# సినాదం

నిఖార్సైన జర్నలిజం





సంపుటి : 22 సంచిక : 302 పేజిలు : 12 వెల రూ. 5 రూ/ శనివారం 07 - 02 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool




2 లో

## జగన్ గుంటూరు పర్యటన

పలువురు నేతలపై కేసులు నమోదు

గుంటూరులో అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించిన జగన్

జగన్ పర్యటన సందర్భంగా ర్యాలీలు నిర్వహించిన పలువురు వైసీపీ నేతలు

ట్రాఫిక్ కు అంతరాయం కలిగించారంటూ కేసులు నమోదు

## బలప్రదర్శన కాదు..
# అభివృద్ధి ముఖ్యం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు
- బలప్రదర్శన కాదు.. అభివృద్ధి ముఖ్యమన్న చంద్రబాబు
- రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చి చూపిస్తామని వెల్లడి
- గత ప్రభుత్వంలో పోలవరం డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయిందని విమర్శ
- కల్తీ నెయ్యితో లడ్డూ ప్రసాదం తయారు చేయించారని ఆరోపణ
- భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ
- కర్నూలు జిల్లాలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు



కర్నూలు : వైసీపీ అధినేత జగన్ పరామర్శ యాత్రలపై సీఎం చంద్రబాబు ఎదురుదాడికి దిగారు. పరామర్శల పేరుతో గంటల తరబడి ట్రాఫిక్ ఆపి ప్రజలను ఇబ్బంది పెట్టడం, బలప్రదర్శనలతో రౌడీయిజం చేయడం వంటి రాజకీయాలు తన దగ్గర చెల్లవని, ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో తనకు బాగా తెలుసని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడకుండా కేవలం రాజకీయం కోసం బలప్రదర్శనలు చేయడం సరికాదని, ఎన్నికల సమయంలో సత్తా చాటాలని ఆయన హితవు పలికారు. గతంలో కాన్వాయ్‌తో ఒకరి మరణానికి కారణమవ్వడం, బంగారుపాళ్యంలో మామిడి రైతుల కాయలను తొక్కించడం వంటి చర్యలు వారి రౌడీయిజానికి నిదర్శనమని విమర్శించారు. కర్నూలు జిల్లా, - మిగతా 2 లో

## మనకెందుకులే అనుకోవద్దు ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది



- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- హిందూ ధర్మంపై దాడులు జరిగినప్పుడు మౌనం వీడాలని పవన్ పిలుపు
- కేవలం భక్తులుగా కాకుండా ధర్మ సంరక్షకులుగా ఉండాలన్న డిప్యూటీ సీఎం
- కులం, ప్రాంతం వేరైనా మన ధర్మం ఒక్కటేనని వ్యాఖ్య
- మన విశ్వాసాలను కాపాడుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ

అమరావతి : ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుందని, హిందూ దేవుళ్లను, ధర్మాన్ని కించపరిచినప్పుడు మౌనంగా ఉండకుండా తమ గళాన్ని వినిపించాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం - మిగతా 2 లో

## విదేశాల్లోనూ మన యూపీఐ
# 8 దేశాల్లో సేవలు ప్రారంభం




- విదేశాలకు కూడా విస్తరించిన యూపీఐ సేవలు
- డిజిటల్ చెల్లింపుల్లో గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతున్న భారత్
- ఇండియా స్టాక్ కోసం 23 దేశాలతో కేంద్ర ప్రభుత్వ ఒప్పందాలు
- రాజ్యసభలో వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద
- జనవరి నెలలో రికార్డు స్థాయిలో పెరిగిన యూపీఐ లావాదేవీలు

అమరావతి : భారత్ అభివృద్ధి చేసిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తూ, డిజిటల్ చెల్లింపుల రంగంలో దేశాన్ని గ్లోబల్ లీడర్‌గా నిలుపుతున్నాయి. యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్, ఖతార్ దేశాల్లో ప్రస్తుతం యూపీఐ సేవలు అందుబాటులోకి - మిగతా 2 లో



2 లో

## ఇస్లామాబాద్‌లో
# భారీ పేలుడు

15 మంది మృతి

ఇస్లామాబాద్‌లోని షియా మసీదులో భారీ పేలుడు

ఘటనలో 15 మంది మృతి,


80 మందికి పైగా గాయాలు

శుక్రవారం జుమ్మా ప్రార్థనల సమయంలో జరిగిన దాడి

ఇది ఆత్మాహుతి దాడి అని అనుమానిస్తున్న అధికారులు

## రాహుల్ గాంధీకి సిక్కు మతంపై ద్వేషం ఉందన్న ప్రధాని మోదీ

- తీవ్రంగా స్పందించిన ఖర్గే
- ప్రధాని ప్రసంగంలో పనికొచ్చే అంశం ఒక్కటీ లేదని విమర్శలు
- సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపణన



ఢిల్లీ : రాహుల్ గాంధీలో, కాంగ్రెస్ పార్టీలో సిక్కుమతంపై ద్వేషం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. ప్రధానమంత్రి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ప్రధాని ప్రసంగం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. గురువారం ప్రధాని మోదీ రాజ్యసభలో చేసిన ప్రసంగంలో పనికొచ్చే అంశం ఒక్కటి కూడా లేదని విమర్శించారు.మోదీ 97 నిమిషాల పాటు ప్రసంగించారని కానీ ఏమాత్రం ఉపయోగం లేని ప్రసంగం అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం విషయంలో తాము చేసిన ప్రతిపాదనల్లో ఒక్క దానికి కూడా ఆయన స్పందించలేదని అన్నారు. ఆయన కేవలం 100 సంవత్సరాలు, 75 సంవత్సరాలు, 50 సంవత్సరాలు అంటూ ఏదేదో మాట్లాడారని - మిగతా 2 లో

## బీజేపీ మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా

బీజేపీ గెలిస్తే పెండింగ్ పనుల్లో వెసులుబాటు కల్పిస్తామన్న రామచందర్ రావు

యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామని హామీ



2 లో

## పేదరిక నిర్మూలనకు
# సరికొత్త పథకం

- కేరళలో అమలు చేస్తున్న 'కుటుంబశ్రీ' తరహా పథకం తెస్తున్నామన్న సీతక్క
- సర్వే చేయించి పేదరికంలో ఉన్నవారిని గుర్తిస్తామన్న మంత్రి
- ప్రతి పేద కుటుంబానికి సాయం అందిస్తామని వెల్లడి



హైదరాబాద్ : తెలంగాణ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు రాష్ట్రంలో కొత్త పథకాన్ని ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. కేరళలో అమలు చేస్తున్న 'కుటుంబశ్రీ' మోడల్ ను అనుసరించి ఈ పథకానికి రూపకల్పన చేస్తున్నామని చెప్పారు.కేరళలో ఒక సర్వే నిర్వహించారని... దాని ద్వారా 65 వేల మంది పేదలను గుర్తించి, వారిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చారని సీతక్క తెలిపారు. అదే తరహాలో తెలంగాణలో మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా సర్వే చేయించి, పేదరికంలో ఉన్న వారిని గుర్తిస్తామని చెప్పారు.సర్వే పూర్తయిన తర్వాత ప్రతి పేద కుటుంబానికి తగిన సాయం అందిస్తామని సీతక్క తెలిపారు. ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడినా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఈ కొత్త పథకం ద్వారా రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

## కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి,
# మీరు కట్టిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి?

- నిజామాబాద్ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- 'కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేస్తారనే కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగించాం'
- 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారింది
- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా నిజామాబాద్‌కు ఏం చేయలేదు
- కేసీఆర్, కేటీఆర్‌లను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు
- కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని ధ్వజమెత్తారు
- కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి, మీరు కట్టిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి?
- మున్సిపల్ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలని జిల్లా ప్రజానికాన్ని కోరారు



నిజామాబాద్ : లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బీజేపీ చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేటీఆర్, కేసీఆర్‌ను అరెస్టు చేస్తారని కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే ఇంతవరకు అతి లేదు గతి లేదని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్‌లను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. అసలు కిషన్‌రెడ్డి ఎందుకు కాపాడుతున్నారు? అని ప్రశ్నించిన సీఎం కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని ధ్వజమెత్తారు. ఎప్పుడో కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి, మీరు కట్టిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి? అని ప్రతిపక్షంపై ప్రశ్నలు సంధించారు. నిజామాబాద్ జిల్లా బర్దిపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు.ఫిబ్రవరి 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా - మిగతా 2 లో

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# మమత 'సర్' పోరు

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేడు సుప్రీంకోర్టులో ప్ర త్యక్షమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను సవాల్ చే స్తూ, తన రాష్ట్రంలో దానిని తక్షణం ఆపివేయాలంటూ ఆమె న్యాయపోరాటం చేస్తున్నారు. సర్ అమలు న్యాయబద్ధం కాదంటూ ఆమెపార్టీ ఇటీవల కోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. విచారణ నేడు జరుగుతున్న నేపథ్యంలో, జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న ఆమెకు కోర్టుకూడా వ్యక్తిగత హాజరుకు అనుమతించడంతో ఢిల్లీలోనే ఉన్న మమత వచ్చి సర్ మీద తన అభ్యంతరాలను స్వయంగా విన్నవించుకుంటారని మీడియా అంటోంది.మమతా బెనర్జీ తన 'సర్' వ్యతిరేకపోరాటాన్ని దేశరాజధానికి మార్చి రాజకీయంగా మంచి ఎత్తు వేశారని విశ్లేషకుల అంచనా. సోమవారం సీఈసీతో భేటీకోసం ఆమె ఆదివారం ఢిల్లీలో ఒక పెద్ద బృందంతో కాలూనారు. పార్టీ నాయకులు, కార్యకర్తల నినాదాలు, నిరసనల హడావుడి ఎలాగూ ఉండగా, సర్‌తో నష్టపోయినవారంటూ కొందరిని ఆమె తనతోపాటు ఢిల్లీ తీసుకువచ్చారు. నిరసన ఘాటుగా ఉండాలంటే నల్లబాడ్జీలు సరిపోవని అనుకున్నారేమో, సదరు సర్ బాధితులతో పాటు తాను కూడా నల్లశాలువా కప్పుకొని ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ఎంత అమానుషమైనదో వివరించారు. సీఈసీతో జరిపిన గంటన్నర భేటీలోనూ ఏమి జరిగిందన్నది మనకు స్పష్టంగా తెలియదు కానీ, ఉభయపక్షాలు పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకున్నాయి. ఎన్నికల సంఘం మీద ఆమె తీవ్ర ఆరోపణలు చేశారని, తాము జవాబు చెబుతున్నప్పుడు మాత్రం తృణమూల్ నాయకులు ఉద్దేశపూర్వకంగా పదేపదే అడ్డుతగిలారని అధికారుల విమర్శ. గట్టిగా మాట్లాడుతూ మమత పలుమార్లు టేబుల్‌ను బలంగా చరిచారనీ, సమాధానం పూర్తిగా వినకుండానే ఆగ్రహంగా వెళ్ళిపోయారని వారంటున్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ అహంకారనీ, జమీందారులాగా ప్రవర్తిస్తూ తృణమూల్ బృందాన్ని అవమానించారని మమత ఆరోపణ. ఎప్పటిలాగానే ఆయనను బీజేపీ బ్రోకర్ అని ఆడిపోసుకున్నారామె. జగ్‌దీప్ ధన్‌కర్‌కు పట్టిన గతే జ్ఞానేశ్‌కూ పడుతుందని ఆమె జోస్యం చెప్పారు. ఢిల్లీలోని బంగభవన్‌కు రక్షణగా స్వరాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో పోలీసులను తెచ్చుకున్న ఆమె, ఢిల్లీ పోలీసులను కూడా అక్కడ మోహరించినందుకు మండిపడుతున్నారు.బెంగాలీల పేర్లు, ఇంటిపేర్ల స్పెల్లింగులో స్వల్ప తేడాలు సర్వసాధారణమనీ.పాత జాబితాలను డిజిటలైజ్ చేసే క్రమంలో కృత్రిమమేధ వినియోగం లక్షలాది ఓటర్లకు అన్యాయం చేసిందని, మైక్రో అబ్జర్వర్ల పేరిట ఎనిమిది వేలమందిని రంగంలోకి దించడం కూడా ఈసీబీజేపీ సంయుక్త కుట్రని ఆమె అంటున్నారు. ఓటరు జాబితాలో ఉన్న వృద్ధులను సైతం ఆస్పత్రిలో పురుడుపోసుకున్న ఆధారాన్ని ఈసీ అడుగుతోందని, నరేంద్రమోదీకి సైతం ఇది సాధ్యమేనా అని ఆమె ప్రశ్న.బిహార్‌లో సంసందర్భంగా, ఆధార్‌ను సైతం కాదన్న ఎన్నికల సంఘం చివరకు సుప్రీంకోర్టు ఒత్తిడికి లొంగి సరేనన్నప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి లక్షలాదిపేర్లు గల్లంతైనాయి.పశ్చిమబెంగాల్‌లో సర్ ప్రక్రియను ఉద్దేశించి పక్షంరోజులక్రితం కూడా సుప్రీంకోర్టు కొన్ని ఆదేశాలు ఇచ్చింది. రెండు దశాబ్దాలనాటి జాబితాలతో కుస్తీపడుతున్న అధికారులు అనుభవిస్తున్న ఒత్తిడిని, పౌరులు ఓట్లు కోల్పోయే ప్రమాదాన్ని గమనించి కోర్టు కొన్ని ఆదేశాలు ఇచ్చింది. ముఖ్యంగా, పిల్లలూ వారి తల్లిదండ్రుల పేర్లు ఇంటిపేర్లలో స్వల్పతేడాలు, వేర్వేరు స్పెల్లింగులు, నమ్మశక్యం కానంత వయసు అంతరాలు వంటివి పరిష్కరించడానికి వీలుగా కోటీపాతికలక్షలమంది పేర్లను ఆయా గ్రామపంచాయతీలు, బ్లాక్, వార్డు కార్యాలయాల్లో ప్రదర్శించాలనీ, జవాబు చెప్పుకోవడానికి తగినంత సమయం ఇవ్వాలని, విచారణ సమయంలో తగినంత సిబ్బందిని నియమించి, ప్రతీదశలోనూ రసీదులు ఇవ్వాలనీ, తుది నిర్ణయానికి కారణాలు తెలియచేయాలని కోర్టు మార్గనిర్దేశనం చేసింది. పాత జాబితాలను ప్రక్షాళించే బృహత్ కర్తవ్యాన్ని ఎన్నికల సంఘం నెత్తినెత్తుకోవడాన్ని ఎవరూ ఆక్షేపించడం లేదు. కానీ, ఎన్నికలు ముంచుకొస్తున్న రాష్ట్రాల్లో దానిని హడావుడిగా అమలుచేయడమే విమర్శలకు కారణమవుతున్నది. తీవ్రమైన ఒత్తిళ్ళు, గడువుల మధ్య బీఎల్‌వోలు పలురకాల తప్పులు చేయడంతో పాటు, అనేకమంది తీవ్ర అనారోగ్యం పాలైనారు. సర్ మంచిచెడులను మొదట్లోనే నిర్థారించి, నిలవరించాల్సిన న్యాయస్థానాలు ఆ పని చేయని కారణంగా ఇప్పుడు ఎప్పటికప్పుడు ప్రక్రియను గాడినపెట్టవలసి వస్తున్నది.

# బలప్రదర్శన కాదు.. అభివృద్ధి ముఖ్యం




**మొదటిపేజీ తరువాయి** - ఎమ్మిగనూరు నియోజకవర్గం, కలుగట్లలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.గత ఐదేళ్ల పాలనలో శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠను దెబ్బతీసేలా కల్తీ ప్రసాదంతో టీటీడీని అపవిత్రం చేశారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. బాత్రూంలు శుభ్రపరిచే రసాయనాలతో తయారుచేసిన కల్తీ నెయ్యితో లడ్డూలు చేయించారని, దీనిపై సీబీఐ, సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిందని అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. తాము ఇప్పుడు ఆ తప్పును సరిదిద్ది, నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్నామని తెలిపారు.ఒకవైపు ప్రతిపక్ష రాజకీయ శైలిపై విమర్శలు గుప్పిస్తూనే, మరోవైపు తమ ప్రభుత్వ అభివృద్ధి అజెండాను, ముఖ్యంగా రాయలసీమ ప్రగతికి సంబంధించిన ప్రణాళికలను ఆయన వివరించారు. ఒకప్పుడు కరవుతో అల్లాడిన రాయలసీమను ఉద్యాన హబ్‌గా మారుస్తున్నామని, ఏటా 200 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు ఈ ప్రాంతం నుంచే వస్తున్నాయని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి సౌకర్యాలతో సీమకు నీరందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. తాను రాయలసీమ బిడ్డనని, ఎన్టీఆర్ కూడా ఈ ప్రాంత ముద్దుబిడ్డేనని గుర్తుచేశారు.గత పాలకులు పోలవరాన్ని గోదాట్లో ముంచేశారని, డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసి రూ.400 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఇప్పుడు తాము అదనంగా రూ.1000 కోట్లతో డయాఫ్రామ్ వాల్‌ను పునర్నిర్మిస్తున్నామని, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్లించిన దూరదృష్టి తమదని పేర్కొన్నారు.రాయలసీమ లిఫ్ట్ పేరిట గత పాలకులు డ్రామాలు ఆడారని, అనుమతులు లేవని ఎన్జీటీ ఆపినా మళ్లీ నాటకాలు మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. తాము వెస్ట్ కర్నూలులో వేదవతి ప్రాజెక్టు, గురు రాఘవేంద్ర, రాజోలిబండ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గుండ్రేవుల ప్రాజెక్టుపై పొరుగు రాష్ట్రాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని, ప్రజలపై ఎలాంటి భారం మోపబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఎంపీ నాగరాజు, స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇస్లామాబాద్ లో భారీ పేలుడు



**మొదటిపేజీ తరువాయి** - పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ మరోసారి బాంబు పేలుడుతో దద్దరిల్లింది. శుక్రవారం జుమ్మా ప్రార్థనల సమయంలో ఓ షియా మసీదు లక్ష్యంగా జరిగిన ఈ భీకర దాడిలో కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోగా, 80 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనను స్థానిక అధికారులు ధృవీకరించారు.ఇస్లామాబాద్‌లోని ఆగ్నేయ ప్రాంతమైన తర్లాయ్ కలాన్‌లోని ఖదీజతుల్ కుబ్రా మసీదులో ఈ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కావడంతో ప్రార్థనల కోసం పెద్ద సంఖ్యలో భక్తులు హాజరైన సమయంలో పేలుడు సంభవించడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించాయి. నగరంలోని ప్రధాన ఆసుపత్రుల్లో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.ఇది ఆత్మాహుతి దాడి అయి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. మసీదు ప్రధాన ద్వారం వద్ద దుండగుడు తనను తాను పేల్చుకుని ఉండవచ్చని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. ఈ దాడిని పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ తీవ్రంగా ఖండించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ దాడికి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించలేదు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. గత ఏడాది నవంబర్‌లో ఇస్లామాబాద్‌లోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ తాజా ఘటనతో రాజధానిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి, మీరు కట్టిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి?



**మొదటిపేజీ తరువాయి** - ఎగరవేయబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా తెలంగాణకు గొప్ప నాయకులను అందించిందని, మున్సిపల్ ఎన్నకల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలని జిల్లా ప్రజానికాన్ని కోరారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారిందన్న ఆయన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఇందూరుకు ఏం చేయలేదన్నారు. కాళేశ్వరంపై కేంద్రప్రభుత్వం చర్యలు ఏమైయ్యాని బీజేపీని అడుగుతున్నట్లు చెప్పారు.

**మళ్లీ అధికారంలోకి కాంగ్రెస్ :** నిజామాబాద్ పసుపు బంగారంతో పోటీ పడేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇక్కడి వ్యవసాయం తెలంగాణకే కాదు దేశానికే ఆదర్శం అని కొనియాడారు. నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికే ఆదర్శమని ప్రశంసలు కురిపించారు. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లోని ప్రాజెక్టుల పూర్తికి, అదనపు నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.టీపీసీస అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ సూచనలతో నిజామాబాద్‌లో అభివృద్ధి పనులు చేస్తున్నామని సీఎం తెలిపారు. నిధులు విడుదల చేసి మున్సిపాల్టీలను అభివృద్ధి చేయాలనుకున్నా, 90 శాతం మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్ సభ్యులే ఉన్నారని అన్నారు. ఒకవేళ నిధులు ఇచ్చినా అభివృద్ధి చేస్తారనే నమ్మకం లేదని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుంటేనే మున్సిపాల్టీల్లో వేగంగా అభివృద్ధి జరుగుతుందన్నారు.

**నిజామాబాద్‌కు ఏం తెచ్చారు :** బీజేపీలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు పరపతి లేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ప్రకటించలేదు? అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు తెలంగాణకు కేంద్రం నుంచి నిధులు తీసుకురావడం లేదని ఆక్షేపించారు. నిజామాబాద్‌కు ఏం తెచ్చారని ధర్మపురి అర్వింద్‌ను అడుగుతున్నట్లు చెప్పారు.తాను అందరి వాడినని తనకు కులం, మతం లేదని సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో అన్నారు. అన్ని మతాలను, కులాలను సమన్వయం చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రెండుసార్లు ఎంపీగా గెలిపిస్తే నిజామాబాద్‌కు ధర్మపురి అర్వింద్ ఏం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని బీఆర్ఎస్ వాళ్లు అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా స్పందిస్తూ "లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చాం, 3.17 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నాం, గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చామని స్పష్టం చేశారు."

**7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం :** రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ తెలిపారు. దేశంలోనే తొలిసారి సన్నబియ్యం పంపిణీ ప్రారంభించడం కాంగ్రెస్ పార్టీ ఘనత అని పేర్కొన్నారు. మున్సిపల్ ప్రచారంలో కార్యకర్తలు మన సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని చెప్పారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని, 2023 బీఆర్ఎస్ ప్రభుత్వం ఖరీఫ్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగులు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని అన్నారు.

# బీజేపీ మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల



**మొదటిపేజీ తరువాయి** - తెలంగాణలో బీజేపీ మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర సహ ఇన్‌ఛార్జులు అశోక్ పర్ణామి, రేఖా శర్మతో కలిసి 'వికసిత్ తెలంగాణ.. బీజేపీ సంకల్ప పత్రం' పేరుతో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.బీజేపీ గెలిస్తే పెండింగ్ పనుల్లో వెసులుబాటు కల్పిస్తామని, మోడ్రన్ మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తామని తెలిపారు. అవినీతిరహిత మున్సిపాలిటీలే తమ లక్ష్యమని తెలిపారు. కబ్జాలపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు బీజేపీని చూసి భయపడు తున్నాయని అన్నారు. కేంద్రం తెలంగాణకు ఏమిచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారని, ఏ జిల్లాకు ఎంతిచ్చామో కూడా చెబుతామని అన్నారు. మరి రేవంత్ రెడ్డి ఏమిచ్చారో చెబుతారా అని నిలదీశారు. బీజేపీ కార్యకర్తలపై పోలీసులు దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పోలీసులను తమ కార్యకర్తల్లా ఉపయోగించుకుంటోందని అన్నారు.

# భాగ్యనగరానికి మంచి రోజులు!

**పొల్యూషన్ ఫ్రీ సిటీగా హైదరాబాద్**

**ఎలక్ట్రిక్ బస్సులు, ఇతర వాహనాల కొనుగోళ్లకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు**

**రోడ్‌ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులపై మినహాయింపులు**

**కొత్త ఈవీ కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్న ప్రజలు**



భాగ్యనగరాన్ని కాలుష్య రహితంగా మార్చడానికి ఆర్టీసీ, ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ బస్సులు, ఇతర వాహనాల కొనుగోళ్లకు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. అలాగే రాయితీలు కూడా ఇస్తుండటంతో కొనుగోళ్లు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. రోడ్‌ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులపై మినహాయింపులు ఇస్తున్న కారణంగా ప్రజలు ఎక్కువగా కొత్త ఈవీ కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. అందువల్ల టన్నుల కొద్దీ కర్బన ఉద్గారాలు తగ్గుతున్నాయి. పర్యావరణహిత చర్యలు ఇలాగే కొనసాగితే త్వరలోనే నగరం గ్రీన్‌సిటీగా, అత్యంత నివాసయోగ్యంగా మారనుంది.నగరంలోకి మరో 150 ఎలక్ట్రిక్ బస్సులు : డీజిల్‌తో నడిచే వాటితో పోలిస్తే ఒక ఎలక్ట్రిక్ బస్సు రోజులో ఒక టన్ను కర్బన ఉద్గారాలను నియంత్రిస్తుంది. పుష్పక్ బస్సులతో కలిపి మొత్తం 385 ఎలక్ట్రిక్ బస్సులు నగరంలో ఉన్నాయి. మరికొద్ది రోజుల్లో మరో 150 ఎలక్ట్రిక్ బస్సులు రానున్న క్రమంలో ఉద్గారాల స్థాయి భారీగా తగ్గనుంది. రెండేళ్లలో మరో 2,500 రోడ్డెక్కించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో నగరంలో మొత్తం అవే దర్శనమివ్వనున్నాయి. వీటితో పాటు ప్రైవేటు వాహనాలు సైతం రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఈవీలపై జీవితకాల పన్ను మినహాయింపుతో 2 లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలు, 30 వేల కార్లు రోడ్డెక్కాయి. డీజిల్, పెట్రోల్ కారుతో పోల్చితే ఎలక్ట్రిక్ కారు రోజులో 38 నుంచి 40 కేజీల కర్బన ఉద్గారాలను నియంత్రిస్తుంది.

**2.5 లక్షల విద్యుత్ వాహనాల నమోదు :** కొంతకాలంగా ఈ రెండు కేటగిరీల వాహన అమ్మకాలు ఊపందుకున్నట్లు ఆటోమొబైల్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాలు కూడా ఎలక్ట్రిక్ వాహనాల దూకుడు పెరిగేందుకు దోహదమయ్యాయి. ఇంధన ధరలు భారంగా మారుతున్న దృష్ట్యా సామాన్య, మధ్య తరగతి వర్గాలు క్రమంగా పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి ఈవీలకు మారుతున్నారు. 6 వేలకు పైగా ఆటోలు, 5 వేలకు పైగా తేలిక పాటి వస్తు రవాణా వాహనాలు వివిధ విభాగాల్లో మొత్తం కలిపి 2.5 లక్షల విద్యుత్ వాహనాలు నమోదయ్యాయి. అందుకు అనుగుణంగా 650 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లు నగరంలో ఏర్పాటయ్యాయి.

**వాయు కాలుష్యం నివారణే లక్ష్యంగా :** నగరంలో వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) తరచూ 100 నుంచి 200 మధ్య నమోదవుతోంది. ఈ నేపథ్యంలో ఈవీలు శబ్ద, వాయు కాలుష్య ఉద్గారాలను తగ్గిస్తాయి. పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి ఈవీలకు మారడం వల్ల ఇంధన ఆధారిత కాలుష్యం గణనీయంగా తగ్గి జాతీయ వాయుశుద్ధి కార్యక్రమం లక్ష్యాలు నెరవేరే అవకాశం ఉంది.

**ప్రభుత్వం చేపట్టిన చర్యలు :**

ఐటీ, ఫార్మా కంపెనీలు, విద్యా సంస్థలు కొనుగోలు చేసే వాహనాల్లో 25 నుంచి 30 శాతం ఈవీలే ఉండాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ప్రభుత్వ ఉద్యోగులకు ఈవీల కొనుగోలుపై 20 శాతం రాయితీ కల్పించాలనే అంశం తెరపైకి వచ్చింది.

ప్రభుత్వ విభాగాల్లో కొనుగోలు చేసే వాహనాల్లో 25 నుంచి 50 శాతం ఈవీలు తప్పనిసరి చేయాలని ప్రతిపాదన ఉంది.

ప్రజా రవాణాను మెరుగుపరిచేందుకు పట్టణాభివృద్ధి విభాగం అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు.

తక్కువ మోతాదులో కాలుష్యం నమోదు : ఈవీ వాహనాల కారణంగా శబ్ద, వాయు కాలుష్యాలు తక్కువగా ఉండటంతో ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకుంది. రోడ్ పన్ను, వాహన రిజిస్ట్రేషన్ ఫీజు 100 శాతం మినహాయిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఈవీ వాహనాల పట్ల ఆదరణ మరింత పెరిగింది. వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈవీ పాలసీని రూపొందించి, ఈ సరికొత్త విధానం అమల్లోకి తెచ్చినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో వెల్లడించారు.

# మనకెందుకులే అనుకోవద్దు...
# ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది

**మొదటిపేజీ తరువాయి** - పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సగటు హిందువు మనస్తత్వంలో మార్పు రావాలని, భయంతో లేదా సౌలభ్యం కోసం మౌనంగా ఉండే ధోరణిని వీడాలని ఆయన సూచించారు. దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉన్నప్పటికీ, మన ధర్మాన్ని ఎవరైనా దురుద్దేశంతో అపహాస్యం చేసినప్పుడు కేవలం వ్యక్తిగతంగా బాధపడి, కర్మకు వదిలేసి ముందుకు సాగే అలవాటు మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలను వివరిస్తూ, "మనం కులం, మతం, ప్రాంతం, భాషల పరంగా విభజనకు గురై ఉండవచ్చు. కానీ మనందరి ధర్మం ఒక్కటే, దేవుళ్లు కూడా అంతే. మన విశ్వాసాలను, ధర్మాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినప్పుడు మన బాధను తెలియజేయడం మనందరి కర్తవ్యం. ఇలాంటి కీలక సమయాల్లో పాటించే మౌనం సమిష్టి చైతన్యాన్ని బలహీనపరుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ కేవలం భక్తులుగా మిగిలిపోకుండా, తమ విశ్వాసాలకు స్పృహతో కూడిన సంరక్షకులుగా కూడా వ్యవహరించాలని ఆయన కోరారు.హిందూ ధర్మాన్ని రక్షించుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ సొంత విశ్వాసాలను, సంప్రదాయాలను కాపాడుకోవడం మాత్రమేనని ఆయన వివరించారు. హిందువులు తమ ధార్మిక బాధ్యతను గుర్తించి, సోమరితనం వీడి, తమ విశ్వాసాల పరిరక్షణకు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మార్పు ద్వారానే హిందూ ధర్మం యొక్క గౌరవాన్ని కాపాడుకోగలమని ఆయన ట్వీట్ చేశారు.

# జగన్ గుంటూరు పర్యటన

**మొదటిపేజీ తరువాయి** - అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసీపీ అధినేత చేపట్టిన గుంటూరు పర్యటన సందర్భంగా వైసీపీ నేతలు హల్ చల్ చేశారు. పోలీసు యాక్ట్ 30ను పట్టించుకోకుండా అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించారు. ఈ క్రమంలో పలువురు వైసీపీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... నల్లపాడులో పోతిన మహేశ్, బలసాని కిరణ్ కుమార్ పై కేసు నమోదయింది. మంగళగిరిలో నూనె ఉమామహేశ్వర్ రెడ్డి, తాడేపల్లిలో దొంతిరెడ్డి వేమారెడ్డిపై, నగరంపాలెం ప్రాంతంలో పానుగంటి చైతన్య, నూరి ఫాతిమా, గుంటూరు పట్టాభిపురంలో అంబటి మురళిపై కేసులు నమోదయ్యాయి.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ... వైసీపీ నేతలు చేపట్టిన ర్యాలీల కారణంగా గుంటూరులోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. పోలీసు నిబంధనలను ఉల్లంఘించడం, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించడం చట్ట విరుద్ధమని చెప్పారు. ఈ క్రమంలో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

# విదేశాల్లోనూ మన యూపీఐ
# 8 దేశాల్లో సేవలు ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి** - వచ్చాయని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం పార్లమెంటుకు తెలియజేసింది.రాజ్యసభలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు వెల్లడించారు. యూపీఐ అంతర్జాతీయంగా ఆదరణ పొందడం వల్ల విదేశీ మారక ద్రవ్యం బదిలీలు పెరగడంతో పాటు, ఆర్థిక సమ్మిళితానికి ఊతం లభిస్తోందని ఆయన తెలిపారు. ప్రపంచ ఫిన్‌టెక్ రంగంలో భారత్ స్థానం మరింత బలపడుతోందని పేర్కొన్నారు.యూపీఐ మాత్రమే కాకుండా, భారత్ యొక్క డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) లేదా 'ఇండియా స్టాక్' ను పంచుకోవడం కోసం ఇప్పటికే 23 దేశాలతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు మంత్రి వివరించారు. డిజిటల్ ఐడెంటిటీ, డిజిటల్ చెల్లింపులు, డేటా మార్పిడి వంటి అంశాల్లో సహకారం కోసం ఈ ఒప్పందాలు జరిగాయని తెలిపారు. ఇందులో భాగంగా డిజిలాకర్ కోసం క్యూబా, కెన్యా, యూఏఈ, లావోస్‌లతో ఒప్పందాలు కుదిరాయి.భారత్ తన జీ20 అధ్యక్షతన 'గ్లోబల్ డీపీఐ రిపాజిటరీ'ని ప్రారంభించిందని, దీనికి అత్యధిక డిజిటల్ సొల్యూషన్స్ అందించిన దేశంగా భారత్ నిలిచిందని మంత్రి గుర్తుచేశారు. మరోవైపు, దేశీయంగానూ యూపీఐ వాడకం భారీగా పెరుగుతోంది. ఈ ఏడాది జనవరిలో రూ. 28.33 లక్షల కోట్ల విలువైన 21.70 బిలియన్ల లావాదేవీలు నమోదైనట్లు ఎన్‌పీసీఐ గణాంకాలు చెబుతున్నాయి.

# రాహుల్ గాంధీకి సిక్కు మతంపై
# ద్వేషం ఉందన్న ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి** - ఎద్దేవా చేశారు.ఆర్మీ మాజీ చీఫ్ నరవణే రాసిన పుస్తకాన్ని రాహుల్ గాంధీ ప్రస్తావించగానే అధికార పార్టీ ఇబ్బంది పడిందని అన్నారు. సభలో అధికార పక్షం తమకు మాట్లాడటానికి అవకాశం ఇవ్వలేదని అన్నారు. లోక్ సభ, రాజ్యసభ ప్రజాస్వామ్యానికి రెండు స్థంభాలని, ఒక దానిలో ప్రతిపక్షాన్ని అణిచివేసి మరో సభలో మాట్లాడితే ఫలితం లేదని ఖర్గే అన్నారు.



# బానిస భావజాలంలో విమర్శల జోరు!

**గతంలో వికీలీక్స్ కూడా ఓ ఊపు ఊపింది. విదేశాల్లో ఉన్న ఊరూపేరు లేని కొందరు పనిగట్టుకుని ప్రపంచ దేశాల్లో ఉన్నవారిపై ఊకదంపుడు, ఊహాగాన కథనాలు రాస్తుంటారు. అవన్నీ పట్టుకుని మనదేశంలో నోరు పెద్దదిచేసి అరవడం కొందరు అలవాటు చేసుకున్నారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్ పైనా దుమారం రేపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ప్రధాని పేరు పదేపదే ప్రస్తావన కు వచ్చిందని చెబుతున్న వారు అందులో ఏముందో తెలుసుకుని మాట్లాడితే బాగుండేది.**

ఎడిటోరియల్

ఇదంతే ఒక ఎత్తయితే దీని కారణంగానే మోడీ అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారన్న ప్రచారం చేపట్టారు. దీంట్లో రాహుల్, లెఫ్ట్ పార్టీలు ముందున్నాయి. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్ లో రాహుల్ పేరు కూడా ఉంది. దానిని ఆయనగాని, ఆయనకు వంతపాడుతున్న వారు గానీ మాట్లాడడం లేదు. అందులో రాహుల్‌ను ఓ అసమర్థ నేతగా వర్ణించారు. అతను రాజకీయాలకు పనికి రాడని, అతని వల్ల ఒరిగేదేమీ లేదని తేల్చారు. దీనిని మరుగున పర్చి మాట్లాడుతున్నారు. కనీసం రాహుల్ కూడా దీనిని తెలుసుకుని మాట్లాడితే బాగుండేది. అలాగే రాహుల్ భారత రాజకీయాల గురించి ఎప్‌స్టీన్ ఎవడు కామెంట్ చేయడానికి అన్న ప్రశ్న వేసుకోవాలి. అలాగే మిగతా వారి గురించి కూడా అతను వ్యాఖ్యానించడానికి అతని తాహతు ఏంటన్నది కూడా ముఖ్యం. ఇక ట్రేడ్ డీల్ గురించి మాట్లాడుకుంటే ట్రంప్ ఏనాడూ భారత్‌కు అనుకూలంగా వ్యవహరించ లేదు. 50శాతం సుంకాలు బాది చెవి మెలిపెట్టాడు. మాట్లాడడానికి కూడా భారత్ ప్రధానితో ఇష్టపడలేదు. అనూహ్యంగా ఆయన మారడానికి, డ్రేడ్ డీల్ కుదుర్చుకోవాలని అనుకోవడానికి కారణాలు ఉన్నాయి. ఒకటి అమెరికాలో భారత్‌కు మద్దతుగా అక్కడి నేతలు ట్రంప్‌పై అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. భారత్‌తో వాణిజ్యం తెంపుకుంటే మనం మటాష్ అవుతామని అంటున్నారు. అలాగే యూరోపియన్ యూనియన్‌తో భారత్ ట్రేడ్ డీల్ కుదుర్చుకోవడంతో ట్రంప్‌కు దిక్కుతోచకుండా పోయింది. అలాంటి ట్రంప్ టారిఫ్‌లను 18శాతానికి తగ్గించి భారత్‌తో కాళ్లబేరానికి వచ్చాడు. ఇక్కడ మోడీ ఎక్కడ ట్రంప్‌కు లొంగిపోయాడో, ఎక్కడ భారత్‌ను తాకట్టు పెట్టారో కాంగ్రెస్, కమ్యూనిస్టులు చెప్పాలి. ఈ పరిస్థితిలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా డీల్ కుదుర్చుకునేదే. రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడుతున్న వారికి దేశాం గురించి, ప్రపంచం గురించి తెలియదునుకోవాలి. రాహుల్ లాంటి విపక్ష నేత ఉన్నందుకు సిగ్గుపడాలి. ఎందుకంటే పార్లమెంట్‌లో గట్టిగా వాణి వినిపించలేకపోవడం, అల్లరి చేసి బయటకు రావడం మాత్రమే తెలిసిన అసమర్థుడు రాహుల్. ఇలాంటి వారి వల్లనే దేశ ప్రతిష్టకు మచ్చగా మారుతోంది. బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం ఎంతవరకైనా వెళ్తుందని ట్రేడ్ డీల్ గురించి పదేపదే చెబుతున్న వారు సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అనేకరకాలుగా అందిరి పేర్లు ఉన్నాయి. వాటికి ఆధారాలు లేవు. ఓ వికృత వ్యక్తి, వ్యవభిచారి తనకు తానుగా రాసుకున్న కథలను చూపించి అంతా అక్కసు వెళ్లగక్కుతున్నారు. ముఖ్యంగా భారత విపక్షాలు ఈ విషయంలో ముందున్నారు. ఏ సందు దొరికినా మోడీని ఆడిపోసుకోవడమే పనిగా పెట్టుకున్నారు. నిజానికి పార్లమెంటులో ప్రజల సమస్యలను ప్రస్తావించి పోరాడాలన్న పట్టుదల లేని వారంతా ఎంపిలుగా ఉన్నారు. ప్రజల డబ్బును దోచేస్తున్నారు. పన్నుల రూపంలో కట్టిన డబ్బులను దుబారా చేస్తున్నారు. ఇవన్నీ మాట్లాడడానికి సమయం ఉండదు. ఇకపోతే ఎప్‌స్టీన్ లైంగిక నేరస్తుడిగా అంగీకరించి 18 నెలలపాటు జైలు శిక్షకు గురై, పైవేట్ జెట్స్, ఐలాండ్స్ కొనుగోలు చేసే స్థాయికి ఎదిగిన జెఫ్రీ ఎప్‌స్టీన్ ప్రపంచ నేతలతో, కార్పొరేట్లతో సంబంధాలు నెరిపే బ్రోకర్. 2019లో రెండోసారి జైలుకు వెళ్లిన తరువాత ఆత్మహత్య చేసుకున్నాడని అమెరికా ప్రకటించింది. అయితే తమ సంబంధాలు బయటకు వస్తాయని ప్రముఖులే హత్య చేయించారన్నది అక్కడి మీడియా కథనం. జెఫ్రీ ఎప్‌స్టీన్ తనకుతాను రాసుకున్న వారి పేర్లలో మోడీ, రాహుల్, కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి, ముఖేష్ అంబానీ సోదరుడు అనిల్ అంబానీ పేర్లు ఉన్నాయని సమాచారం. మరి వీరందిరికి సంబంధించి అందులో ఏముందో ఎవరికీ తెలియదు. ఆ సందర్భంగా జరిపిన ఇ మెయిల్స్‌లో పదేపదే ప్రధాని పేరు ప్రస్తావనకు రావడం తదితర అంశాలపై ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత కేంద్రానిదే అంటూ చిలకపలుకులు పలుకుతున్న వారికి రాజకీయ నిబద్ధత లేదనుకోవాలి. 2014 జూన్ నుంచి 2017 మే మధ్య ఎప్‌స్టీన్‌తో అనేకసార్లు మెయిల్స్, చాట్స్ చేయడంతోపాటు మూడుసార్లు స్వయంగా కలిశారు. టెక్నాలజీ అభివృద్ధి కోసం, ఆ రంగంలో ప్రముఖులతో సంబంధాల కోసమే సంప్రదించానని, అతను నేరస్తుడని తెలీదని పురి చెబుతున్నారు. అప్పటికే ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైన క్రిమినల్ గురించి ఐఎఫ్‌ఎస్ మాజీ అధికారికి తెలియదనడం బుకాయింపున అంటున్నారు. అయితే అందులో బిల్‌గేట్స్, ట్రంప్, క్లింటన్, హిల్లరీ క్లింటన్ ఇలా ఎందరో ప ఏర్లు ఉన్నాయి. అప్పట్లో ఏదో సందర్భంలో అతనిని కలిసే ఉంటారు. అంతమాత్రాన అతనో సచ్ఛీలుడిగా, అతనికి పెద్ద హోదా ఆపాదించి మనలను మనం చిన్న చేసుకోవడం దారుణం. 2017 జులైలో ప్రధాని మోడీ ఇజ్రాయిల్‌లో పర్యటించడం మినహా మిగతా దంతా అబద్ధమని, ఆ నేరస్తుడి కల్పనలని పేర్కొంటూ కేంద్రం ఖండించింది. జెఫ్రీ ఎప్‌స్టీన్ ఇ మెయిల్స్‌కు సంబంధించిన అంత ర్జాతీయ కథనాలపై స్పందించడం సరికాదు. ఎవరికి వారు ఏదో ఊహించుకుని ఎప్‌స్టీన్‌ను ఆకాశానికి ఎత్తడం, అతనో దేవదూతగా భావించడం దుర్మార్గం. ఒక లైంగిక వ్యభిచారి అయిన ఎప్‌స్టీన్ గురించి తెలుసుకుంటే మంచిది. ట్రంప్, బిల్ క్లింటన్ మొదలు ప్రపంచవ్యాప్తంగా అనేకమంది ప్రముఖుల చీకటి కోణాలను వెలుగులోకి వచ్చాయని అనుకోవడం కూడా అంతే పొరపాటు. ఇలాంటి కథనాలను వండివార్చే లెఫ్ట్ నేతలు దేశం గురించి ఆలోచిస్తే మంచిది. ముందుగా రాహుల్ పేరు ఎందుకు ప్రస్తావనకు వచ్చిందో నిలదీస్తే మంచిది. మోడీని నిందించాలనుకుంటే పార్లమెంటులో నిలదీయండి. అతని నిర్ణయాలను తిప్పికొట్టండి. పార్లమెంటులో మాట్లాడడం చేతకాని నేతలంతా జెఫ్రీ ఎప్‌స్టీన్ అనే ఓ వ్యభిచారి కథనాలకు ప్రాధాన్యం ఇవ్వడం, అదికూడా అతను ఈ భూమ్మీద లేడు కనక వివరాలు ఇవ్వలేడు కనుక బురదజల్లడం సరికాదు.

# గడ్చిరోలిలో మరోమారు కాల్పులు

## ముగ్గురు మావోయిస్టుల మృతి

మహారాష్ట్ర – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పులు జరిగాయి. గడ్చిరోలి అడవుల్లో జరిగిన ఈ కాల్పుల ఘటనలో భారీ నష్టం వాటిల్లింది. అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయని ఇంటెలిజెన్స్ సమాచారం అందడంతో.. పోలీసులు, భద్రతా బలగాలు గురువారం నుంచి గాలింపు చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలు అడవిలోకి ప్రవేశించగానే మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు మొదలయ్యాయి. ప్రతిగా బలగాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. ఈ హోరాహోరీ పోరులో కమాండో దీపక ప్రాణాలు కోల్పోగా, గాయపడిన మరో అధికారిని మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలిలో ఏకే–47, స్వాధీనం చేసుకున్నాయి భద్రతా బలగాలు. ఘటనా స్థలంలో పోలీసులు.. ఆయుధాలు, విప్లవ సాహిత్యం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో ఇంకా కొందరు మావోయిస్టులు దాగిఉండే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌తో గడ్చిరోలి జిల్లాలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. స్థానికులను అప్రమత్తం చేసిన అధికారులు.. అటవీ ప్రాంతాల వైపు వెళ్లవద్దని సూచనలు జారీ చేశారు. ఎన్‌కౌంటర్ పూర్తైన తర్వాత మృతుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.



# సౌర విద్యుత్ కాంతులతో.... వెలిగిపోతున్న తెలంగాణ

**సూర్యుడు ప్రధాన శక్తి వనరు. ప్రతిరోజు సూర్యుని శక్తి మిగతా వాటి నుండి ఉత్పత్తి అయ్యే శక్తి కంటే 600 రెట్లు ఎక్కువ. ఈ శక్తిని పూర్తిగా వినియోగించుకోవడం సాధ్యమైతే మానవాళికి మరే ఇతర శక్తి వనరులు అవసరం లేదు. నీటిని వేడి చేయడానికి విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ఈ శక్తిని సేకరించేందుకు అనేక పద్ధతులు అభివృద్ధి చేయబడ్డాయి. 1970లో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగిన తర్వాత సౌర శక్తిని ఉపయోగించుకునేందుకు పరిశోధనలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను అనేక దేశాలు ప్రారంభించాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సౌరశక్తి ఉత్పత్తి ఇప్పటికే ప్రాథమిక దశలోనే ఉంది. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయతీయులు పథకాల ద్వారా సౌర శక్తిని ప్రత్యామ్నాయ వనరుగా ప్రోత్సహించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నాయి. 2014 నాటికి సౌర శక్తి స్థాపిత సామర్థ్యం 1 ఎం డబ్ల్యు. ప్రస్తుతం 1 ఎండబ్ల్యూపి సామర్థ్యంలో రేవులపల్లి జోగులాంబ జిల్లాల వద్ద ఉన్న ప్రియదర్శని జూరాల జలప్రాజెక్టు కింద మాత్రమే సౌరశక్తి ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు.**





తెలంగాణలో ప్రైవేట్ రంగంలో సౌరశక్తి: ప్రభుత్వ సంస్థతోపాటు ప్రైవేట్ రంగంలో కూడా సౌర శక్తిని ఉత్పత్తిలో పాలు పంచుకుంటుంది. ఏప్రిల్ 30, 2020 నాటికి ప్రైవేట్ సౌరశక్తి ఒప్పంద సామర్థ్యం 3680 మెగావాట్లు. తెలంగాణలో సౌరశక్తి ప్లాంట్లు: 1.ఎమ్మెస్ అండ్రోమేడా ఎనర్జీ దీని సామర్థ్యం 750 కి. వా.ప ఈ ప్రాజెక్టు మెదక్ జిల్లాలోని నరసాపురం మండలం అవంచ గ్రామంలో ఉంది.2. ఫోటో ఎనర్జీ సిస్టం దీని సామర్థ్యం 1000 కి. వా.పా. ఇది రంగారెడ్డి జిల్లాలోని మోయిన్పేట మండలం మెయిన్ పేట గ్రామంలో ఉంది.3. భవాని ఇంజనీరింగ్: దీని సామర్థ్యం 1000కి. వా.ప. ఇది నల్గొండ జిల్లాలోని నార్కెట్పల్లి మండలం మాధవ ఎదవల్లి గ్రామంలో ఉంది 4. తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ విద్యుత్ సౌదా హైదరాబాద్ ఖైరతాబాద్: దీని సామర్థ్యం 1000కి. వా.ప. ఇది మహబూబ్నగర్ జిల్లాలోని జూరాల జల విద్యుత్ కేంద్రం దగ్గర ఉంది 5. సోలార్ సెమీ కండక్టర్ ప్రైవేట్ లిమిటెడ్ దీని సామర్థ్యం 750 కి. వా.ప. ఇది రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని శ్రీనగర్ గ్రామంలో ఉంది 6. రామకృష్ణ ఇండస్ట్రీస్ ఇది వెయ్యికి వాప సామర్థ్యం గలదు. ఇది రంగారెడ్డి జిల్లాలోని షాద్నగర్ మండలం కిషన్ నగర్ గ్రామంలో ఉంది.

తెలంగాణ సౌరశక్తి విధానం:2022 నాటికి 100 మెగావాట్ల మరియు 2050 నాటికి 200 గిగావాట్ల సౌర సామర్థ్యాన్ని పెంచే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని భారత ప్రభుత్వం నిర్దేశించుకుంది. ఈ లక్ష్యాలను సాధించడానికి భారత ప్రభుత్వం 300 కంటే ఎక్కువ సూర్యరశ్మి రోజులకు 5.5 కిలోవాట్ల సౌర శక్తి సామర్థ్యాన్ని తెలంగాణ ప్రాంతంలో అమలు చేస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో సౌర సామర్థ్యాన్ని గణనీయంగా వినియోగించుకోవడం కోసం సోలార్ మార్కెట్లో సానుకూలమైన అవకాశాలనుఉపయోగించుకోవాలని మరియు భారత ప్రభుత్వం అందించిన చేయూతను ఉపయోగించుకోవాలని భావిస్తుంది సౌర శక్తి పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలు కలిగి ఉంది. ఇది సౌర శక్తి అభివృద్ధి దారులకు ఎక్కువ సౌర శక్తిని సాధ్యమైనంత వరకు ఉత్తమ పద్ధతిలో వినియోగించుకోవడానికి వీలు కల్పించే వాతావరణాన్ని కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. దాని వినియోగదారులకు పోటీ తత్వ నమ్మకమైన విద్యుత్ సరఫరాను అందించడానికి దీర్ఘకాలంలో స్థిరమైన ఇంధనం నిర్ధారణ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన లక్ష్యాన్ని చేరుకోగలరని భావిస్తున్నారు.

సోలార్ పార్కులు: సోలార్ పార్క్ అనేది సౌర విద్యుత్ ప్రాజెక్టుల అభివృద్ధిలో కేంద్రీకృతమైన జోన్. ఇది డెవలపర్లకు సరైన మౌలిక సదుపాయాలు మరియు ప్రాజెక్టుల ప్రమాదాన్ని తగ్గించడంతోపాటు అనుమతి ప్రక్రియను సులభతరం చేసే ప్రాంతాన్ని అందిస్తుంది. సోలార్ పార్క్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కేంద్ర ఏజెన్సీ మరియు ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో ప్రైవేట్ రంగంలో స్వతంత్రంగా ఏర్పాటు చేస్తుంది.

సోలార్ గ్రూప్ టాప్ ప్రాజెక్టులు: పబ్లిక్ భవనాలు గృహ వాణిజ్య పారిశ్రామిక సంస్థలపై సోలార్ గ్రూప్ టాప్ సిస్టంలను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఎన్ఎస్ఎన్ కింద భారత ప్రభుత్వం ఎంఎన్ఆర్ అందించే అన్ని ప్రోత్సాహకాలు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఇతర పథకాలు మరియు ప్రోత్సాహకాలను గ్రిడ్ అనుసంధానం చేయబడిన సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులకు అలాగే ఆఫ్ గ్రూప్ ఎస్ ఆర్ పి లకు విస్తరించబడుతుంది. సోలార్ పంప్ సెట్లు: కేంద్ర ప్రభుత్వం ఎమ్ఎన్ఆర్ఈఎంఓపి బహుళార్థక సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సాంప్రదాయ పంప్ సెట్ల స్థానంలో శక్తితో నడిచే పంపు చెట్లను సబ్సిడీ ద్వారా ఇవ్వడానికి చర్యలు తీసుకుంటుంది. నోడల్ ఏజెన్సీ టీఎస్ డిస్కొంట్ తరపున సబ్సిడీలు గ్రాంట్ల ప్రోత్సాహాల కోసం వాటాదారులతో నిమగ్నమై ఉంది. రాష్ట్రంలో సౌర శక్తితో నడిచే పంప్ సెట్ ఏర్పాటు కోసం తెలంగాణలో ప్రాజెక్టు డెవలపర్లు రైతులకు గ్రాస్ మీటరింగ్ సౌకర్యాన్ని కల్పిస్తుంది. ఈ విధంగా తెలంగాణ రాష్ట్రంలో సోలార్ అభివృద్ధి శక్తి పెంపునకు ఎంతగానో రాయతీయులు ఇస్తూ రైతులకు గ్రాస్ మీటరింగ్ సౌకర్యం కల్పిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో చేయబడిన మొదటి సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్ట్ జూబ్లీహిల్స్ వద్ద హైదరాబాదులో కలదు. 60 మెగావాట్ల సామర్థ్యం గల సౌరశక్తి ప్లాంట్ జహీరాబాద్ లోని మెదక్ జిల్లాలో గలదు. అలాగే 10 మెగావాట్ల సామర్థ్యం గల సౌరశక్తి పవర్ ప్లాంట్ మిడ్జిల్ గ్రామ వద్ద మహబూబ్నగర్ జిల్లాలో కలదు. ఈ విధంగా సౌరశక్తి ఉత్పత్తిలో తెలంగాణ సౌర శక్తి విధానం 2017 కు అనుగుణంగా ప్రభుత్వం అనేక చర్యలను తీసుకుంటూ సౌర శక్తి ఉత్పత్తి రంగంలో స్వావలంబన సాధించే దిశగా తెలంగాణ సౌర విద్యుత్ కాంతులతో.... వెలిగిపోతున్న తెలంగాణ కొరకు ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందనడంలో సందేహం లేదు.


**పందిరి: శ్రీనివాసులు**
**ఎంఏ (జాగ్రఫీ) బిఈడి,**
**ఎంసీజే (జర్నలిజం)**
**పిజి డిసిజె ( జర్నలిజం)**
**ఉస్మానియా యూనివర్సిటీ**



# మద్రాస్ హైకోర్టులో విజయ్‌కు చుక్కెదురు

## ఆదాయపన్ను శాఖ జరిమానాపై పిటిషన్ కొట్టివేత

మద్రాసు హైకోర్టులో నటుడు, టీవీకే అధినేత విజరు కు చుక్కెదురైంది. ఆదాయపన్ను శాఖ విధించిన పెనాల్టీకి వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించగా.. విచారించిన న్యాయస్థానం విజరు పిటిషన్‌ను కొట్టేసింది. 2015–16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజరు రూ.1.50 కోట్ల జరిమానా చెల్లించాలని ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది. దీనిపై 2022లో విజరు హైకోర్టును ఆశ్రయించారు. గత నెలలో తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు.. ఇప్పుడు పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. 2015–16 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆదాయపన్ను రిటర్న్ దాఖలు చేసినప్పుడు ఆ ఏడాది విజరు రూ.35 కోట్లు ఆదాయం పొందినట్లు ఆదాయ పన్ను శాఖ మద్రాసు హైకోర్టులో నివేదిక దాఖలు చేసింది. అందుకు సంబంధించి మదింపు చేపట్టిన ఆదాయపన్ను శాఖ విజరు ఇంట్లో జరిపిన సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలను సరిచూడగా 'పులి' సినిమాకు తీసుకున్న రూ.15 కోట్ల ఆదాయాన్ని లెక్కల్లో చూపలేదని తేలింది. ఆ ఆదాయాన్ని దాచినందుకు రూ.1.50 కోట్ల జరిమానా విధిస్తూ ఆదాయపన్ను శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ విజరు.. మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.



విజరు నటించిన కొత్త సినిమా 'జన నాయగన్' వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడింది. కొత్త విడుదల తేదీ ఎప్పుడనే ఉత్కంఠ ఇంకా వీడలేదు. ఈ క్రమంలో పన్ను జరిమానా కేసులో విజరు రిట్ పిటిషన్‌ను మద్రాస్ హై కోర్టు శుక్రవారం కొట్టివేసింది. 2015 సెప్టెంబర్ 30న ఐటి అధికారులు నిర్వహించిన సోదాలను అనుసరించి మాత్రమే నటుడు విజరు పన్నులు చెల్లించారని, అంతకు ముందు వచ్చిన ఆదాయానికి సంబంధించి కాదని, ఐటి శాఖ విధించిన జరిమానాను రద్దుచేయలేమని జస్టిస్ సెంథిల్ కుమార్ రామమూర్తి తీర్పునిచ్చారు. ఆదాయపన్ను చట్టం ప్రకారం నిర్దేశించిన కాల పరిమితిలోపు జరిమానా ఉత్తర్వు జారీ చేయబడిందని ఆయన తేల్చారు. 015–16 ఆర్థిక సంవత్సరంలో అదనపు ఆదాయాన్ని స్వచ్ఛందంగా వెల్లడించినందుకు ఆదాయ పన్ను శాఖ తనకు రూ.1.50కోట్ల జరిమానా విధించడాన్ని వ్యతిరేకిస్తూ 2022లో నటుడు విజరు రిట్ పిటిషన్‌ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. 2015లో వచ్చిన పులి సినిమా నిర్మాతలు, ఎస్‌కెటి స్టూడియోస్‌కు చెందిన పి.టి.సెల్వకుమార్, శిబు చెక్కుల ద్వారా రూ.16కోట్ల పారితోషకంతో పాటు రూ.4.93 కోట్ల నగదును చెల్లించారని, చెక్కు మొత్తానికి మాత్రమే పన్ను మినహాయింపు (టిడిఎస్) జమ చేశారని, నగదు లావాదేవీకి కాదని ఐటి శాఖ పేర్కొంది.

# రెపోరేట్‌లో కానరాని మార్పులు

## యధాతథంగా ద్రవ్యపరపతి విధానం.. ఆర్‌బీఐ గవర్నర్ సంజరు మల్హోత్రా

***రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. మునుపటి వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ఈ మేరకు శుక్రవారం ద్రవ్య పరపతి విధాన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజరు మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు.***




కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఆర్‌బీఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇది. గత ఏడాది ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోతపెట్టింది. ఆ తర్వాత డిసెంబర్‌లో మరో పావు శాతం తగ్గించింది. దాంతో గత ఏడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4 శాతం వృద్ధి నమోదవుతుందని ఆర్బీఐ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27) తొలి త్రైమాసికంలో 6.9 శాతం, రెండో త్రైమాసికంలో 7 శాతం వృద్ధి నమోదవ్వొచ్చని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉండొచ్చని తెలిపింది. అదే విధంగా 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 4 శాతం, రెండో త్రైమాసికంలో 4.2 శాతం ద్రవ్యోల్బణం నమోదు కావచ్చని అర్బీఐ అంచనా వేసింది. కాగా జనవరి చివరి నాటికి ఫారెక్స నిల్వలు 723.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వ్యవస్థలో ద్రవ్య లభ్యత రోజువారీ సగటున రూ.75 వేల కోట్లుగా ఉంది.

ప్రస్తుత బీజీ లైఫ్, పని ఒత్తిడి కారణంగా ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో తలనొప్పి సమస్యను ఎదుర్కొనే ఉంటారు. ఇది మీకు సాధారణ సమస్యగా మాత్రమే కనిపించవచ్చు.అందుకే చాలా మంది దీనికి అప్పటి పూర్తికి ట్యాబ్లెట్స్ వేసుకొని తప్పించుకుంటారు. కానీ ఈ తలనొప్పి పదేపదే మిమ్మల్ని వేధిస్తుంటే, దీని వల్ల మీ రోజు వారి జీవితంలో మీరు ఇబ్బందులు ఎదుర్కొంటే మాత్రం కచ్చితంగా మీరు వైద్యులను కలవాల్సిందే. ఎందుకంటే ఇది ఒక రకమైన మైగ్రేన్ కావచ్చని నిపుణులు చెబుతున్నారు.



# మీకున్నది మైగ్రేనా? లేదా సాధారణ తలనొప్పా
# గుర్తించడం ఎలా?

**మైగ్రేన్, సాధారణ తలనొప్పి మధ్య తేడా ఏమిటి?**
లేడీ హార్డింగ్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.హెచ్. ఘోటేకర్ ప్రకారం.. మైగ్రేన్లు, సాధారణ తలనొప్పుల మధ్య అతిపెద్ద వ్యత్యాసం నొప్పి స్వభావం, ప్రభావం. మీకు నార్మల్ తలనొప్పి వచ్చినప్పుడు మీ తల, నుదిటిపై కాస్త ఒత్తిడిగా అనిపిస్తుంది. ఇది అలసట, ఒత్తిడి, నిద్ర లేకపోవడం లేదా ఎక్కువసేపు స్క్రీన్ చూడడం వల్ల రావచ్చు. కానీ మైగ్రేన్ నొప్పి మాత్రం చాలా తీవ్రంగా ఉంటుంది. మైగ్రెన్ వచ్చినప్పుడు తల ఒక వైపున విపరీతమైన పెయిన్ వస్తుంది. అలాగే ఈ తలనొప్పి వచ్చినప్పుడు మీకు వాంతింగ్ సెన్సేషన్ కూడా వస్తుంది. అంతేకాకుండా, ఈ నొప్పి చాలా రోజులు ఉంటుంది, కానీ సాధారణ తలనొప్పులు మాత్రం మీరు ట్యాబ్లెట్ వేసుకున్న, లేదా కాసేపు విశ్రాంతి తీసుకున్నా తగ్గిపోతాయి. మైగ్రేన్ల తలనొప్పి తగ్గాలంటే మీకు ప్రత్యేక చికిత్స అవసరం. అందుకే రెండింటి మధ్య వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.


**మైగ్రేన్లను నివారించడానికి చిట్కాలు:**
అయితే మన రోజువారి జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా మైగ్రేన్‌లను తగ్గించుకోవచ్చు. మీరు ప్రతి సరైన టైంను ఫిక్స్ చేసుకొని అదే సమయానికి రోజు నిద్రపోవడం ద్వారా మీరు ఈ సమస్య నుంచి కాస్త ఉపశమనం పొందవచ్చు. అలాగే సరైన సూర్యరశ్మి పొందడం, పెద్ద శబ్దాలు వినడం, మొబైల్ లేదా టీవీని ఎక్కువగా చూడడాన్ని తగ్గించండి. అధిక ఒత్తిడి అనేది ముఖ్యంగా మైగ్రేన్‌ను పెంచుతుంది, కాబట్టి ఈ సమస్యను తగ్గించుకునేందకు యోగా, ధ్యానం, లోతైన శ్వాసను తీసుకోవడం ప్రయత్నించండి. వీటితో పాటు సరైన సమయంలో తినడం అలవాటు చేసుకోండి, ఆకలి పెట్టుకొని ఎక్కువ సమయం ఉండకండి. అలాగే ప్రాసెస్ చేసి ఆహారానికి

## పరీక్షల వేళ పిల్లల్లో
# జ్ఞాపక శక్తిని పెంచే సూపర్ ఫుడ్..!



వాల్‌నట్స్.. ఇవి పోషక విలువలతో నిండిన డ్రై ఫ్రూట్స్‌లో ఒకటి. వాల్‌నట్స్‌ను మీ దైనందిన ఆహారంలో చేర్చుకోవడం వల్ల అద్భుతమైన ప్రయోజనాలను పొందొచ్చు.ఆకలిగా ఉన్నప్పుడు చిరుతిళ్లకు బదులుగా కేవలం ఐదు వాల్‌నట్స్ తీసుకోవడం వల్ల పొట్ట నిండుతుంది. వీటిలోని పాలీశాచురేటెడ్ ఫ్యాట్ల కారణంగా త్వరగా ఆకలి వేయదు. కడుపు నిండినట్లు అనిపించి.. మీరు ఎక్కువగా తినకుండా ఉండేందుకు దోహదంచేస్తుంది.
రోజూ వాల్‌నట్స్ తీసుకుంటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో తెలుసా..?
మెదడు పనితీరును వాల్‌నట్స్ మెరుగుపరుస్తాయి. చదువుకునే పిల్లల్లో వాల్‌నట్స్ జ్ఞాపకశక్తిని పెంచుతాయి. వీటిలోని ఎసెన్షియల్ ఫ్యాటీ ఆమ్లాలు మెదడు పనితీరును చురుగ్గా ఉంచుతాయి. తరచుగా వాల్‌నట్స్ తీసుకునే పిల్లల్లో ఏకాగ్రత పెరిగి, మతిమరుపు సమస్య దరిచేరదు.వాల్‌నట్స్‌లో మాంసకృత్తులు, పిండిపదార్థాలు, విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉంటాయి. ఈ పోషకాలన్నీ శరీరంలోని జీవక్రియ పనితీరును మెరుగుపరచి, శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి.గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా వాల్‌నట్స్ కీలక పాత్ర పోషిస్తాయి. ఒమెగా-3, మోనోశాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు మేలు చేసే కొలెస్ట్రాల్‌ను అందించి, హృదయానికి రక్త సరఫరా సక్రమంగా జరిగేలా చూస్తాయి.రక్తపోటు, మధుమేహంతో బాధపడేవారు ప్రతిరోజూ ఐదు వాల్‌నట్లను తీసుకుంటే, వాటిలోని పోషకాలు ఈ సమస్యలను అదుపులో ఉంచుతాయి. వాల్‌నట్లలోని పోషకాలు ఎముకలు దృఢంగా ఉండటానికి తోడ్పడతుంది.వీటిని నానబెట్టి తింటే జీర్ణక్రియ మెరుగవుతుంది. నేరుగా తినడం ఇష్టంలేని వారు పాలు, స్మూతీలు, సలాడ్స్‌లో కలిపి తీసుకోవచ్చు. అందుకే సంపూర్ణ ఆరోగ్యం కోసం వాల్‌నట్లను మీ ఆహారంలో భాగం చేసుకోండి.వాల్‌నట్స్ పెద్ద వారు రోజూ 5 తీసుకుంటే సరిపోతుంది. చిన్న పిల్లలు 2-4 తీసుకోవాలి.అయితే వీటిని ఎక్కువగా తింటే బరువు పెరిగే అవకాశం ఉంది. అలర్జీ సమస్యలు ఉన్నవారు..వీటిని తమ డైట్‌లో చేర్చుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవాలి.

# యాలకులతో ఎన్నో లాభాలు



ఆరోగ్యానికి మాత్రం గొప్ప వరం. సువాసనతో మనసును ఆకట్టుకునే యాలకులు, ఆయుర్వేదంలో ప్రాచీనకాలం నుంచే ఔషధంగా ఉపయోగించబడుతున్నాయి.జీర్ణక్రియను మెరుగుపరచడం నుంచి నోటి ఆరోగ్యం, హృదయ సంరక్షణ వరకు అనేక ప్రయోజనాలు వీటిలో దాగి ఉన్నాయి. రోజువారీ ఆహారంలో కొద్దిగా యాలకులు చేర్చుకుంటే, శరీరానికి సహజమైన బలం, ఉత్సాహం లభిస్తుంది. కానీ, భోజనం తర్వాత యాలకులు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో చాలా మందికి మీకు తెలియకపోవచ్చు? భోజనం తర్వాత యాలకులు తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి.మంచి ఆరోగ్యానికి యాలకులు తినడం చాలా ముఖ్యం. యాలకులు తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు నయమవుతాయి. ముఖ్యంగా, భోజనం తర్వాత యాలకులు తినడం వల్ల ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.యాలకులు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. యాలకులు అనేక వంటలలో చేర్చడంతో గొప్ప రుచి వస్తుంది. యాలకులు ఆహారానికి ప్రత్యేక రుచిని ఇస్తాయి. యాలకులు దాదాపు అన్ని ఇళ్లలోని వంట గదుల్లో ఉంటాయి. భోజనం తర్వాత యాలకులను తినడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. మీకు ఏవైనా జీర్ణ సమస్యలు ఉంటే యాలకులు తినడం వల్ల మంట తగ్గుతుంది. జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది.గుండె, జీవక్రియ ఆరోగ్యానికి కూడా యాలకులు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. భోజనం తర్వాత యాలకులను నమలడం వల్ల ఎంజైమ్‌ల ఉత్పత్తి తగ్గుతుంది.

# రెండవ వార్డులో బిఆర్ఎస్ ప్రచారం జోరు
## 2వ వార్డులో విస్తృత ప్రచారం.. బీఆర్ఎస్‌కు ఓటేయండి అభివృద్ధికి సహకరించండి





**చెన్నూర్ ఫిబ్రవరి 05 (నినాదం):**
2 వ వార్డు ప్రచారంలో బిఆర్ ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా బరిలో నిలిచిన షమీం సుల్తానా దిల్షాద్ గురువారం వార్డులో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయనకు స్థానిక వార్డు ప్రజలు బ్రహ్మరథం పెట్టారు. ఈ సందర్భంగా షమీం సుల్తానా దిల్షాద్ గతంలో బిఆర్ఎస్ పార్టీ ద్వారానే అభివృద్ధి చెన్నూర్ పట్టణశీ అభివృద్ధి చెందింది ఇప్పుడు మళ్లీ గతంలో ఆగిన అభివృద్ధి పనులు జరగాలంటే బిఆర్ఎస్ పార్టీని ఓటు వేసి గెలిపించాలని కోరారు.
**ఎమ్మెల్యే బాల్క సుమన్ నాయకత్వంలో...**
చెన్నూర్ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో ముందుండే అని ఇప్పుడు జరిగే పమున్సిపల్ ఎన్నికలలో చెన్నూర్ మున్సిపల్ కార్యాలయం పై ఎగిరే జండా టిఆర్ఎస్ పార్టీ దే అని ఆయన అన్నారు.. 2 వ వార్డు ప్రజలకు అందగా ఉంటా అన్న అని పిలిస్తే నేను ఉన్నాను అంటూ 2 వ వార్డు ప్రజలు అండగా ఉంటాడని ఏ సమయంలో కష్టం వచ్చినా నేను 24 గంటలు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని దిల్షాద్ తెలిపారు. పేద ప్రజలకు నేవ చేయడానికి రాజకీయాల్లో వచా అభివృద్ధి సంక్షేమం కోసం ఎంతదూరమైనా వస్తానని 12 వ వార్డు అభివృద్ధి కొరకు ప్రత్యేక నిధులు తెస్తాననీ ఆయన అన్నారు ప్రజలు ఓటు వేసి భారీ మెజారిటీతో ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు.




# 40 ఏళ్ల వయసులో మీ డబ్బుతో ఇలా చేయండి!




**రిటైర్మెంట్ తర్వాత మీకు ఎలాంటి ఆర్థిక ఇబ్బంది ఉండదు!**

40 ఏళ్లు.. ఆర్థికంగా చాలా ప్రమాదకరం. మీరు ఇంతకు ముందు కంటే ఎక్కువగా సంపాదిస్తూ ఉంటారు. మీరు ఇంతకు ముందు కంటే ఎక్కువగా ఖర్చు చేస్తుంటారు. స్కూల్ ఫీజులు పెరుగుతాయి, తల్లిదండ్రుల వయస్సు, గృహ రుణాలు అంతులేనివిగా అనిపిస్తాయి. జీవనశైలి అప్‌గ్రేడ్‌లు మీరు గమనించకుండానే వస్తాయి. పదవీ విరమణ సిద్ధాంతపరంగా అనిపించడం మానేసి, అసౌకర్యంగా వాస్తవంగా అనిపించడం ప్రారంభించే దశాబ్దం కూడా ఇదే.మీ జీతం పెరిగితే ప్రతి ఇంక్రిమెంట్‌లో కనీసం సగభాగాన్ని దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టండి. మీ రిస్క్ ప్రొఫైల్ ఆధారంగా చీరూ, జూఖీ, ౹రాఖీ, డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ వంటి మార్గాలను ఎంచుకోండి. ఎక్కువ పెట్టుబడి పెట్టడానికి పరిపూర్ణ సమయం కోసం వేచి ఉండకండి. మీ ఆదాయం అత్యధికంగా ఉన్నప్పుడు సరైన సమయం.మీ 40 ఏళ్ల వయసులో కూడా క్రెడిట్ కార్డ్ బ్యాలెన్స్‌లు లేదా వ్యక్తిగత రుణాలు ఉంటే రిటైర్మెంట్ నాటికి అవి చాలా భారం అవుతాయి. వాటిని వీలైనంత త్వరగా క్లియర్ చేసుకోండి.ఉద్యోగం లేకుండా మీ వద్ద ఉన్న సేవింగ్స్‌తో మీ 20 ఏళ్ల వయసులో మూడు నెలల ఖర్చులు సరిపోయి ఉండవచ్చు. మీ 40 ఏళ్ల వయసులో కనీసం ఆరు నుండి పన్నెండు నెలల వరకు లక్ష్యం పెట్టుకోండి. ఈ దశలో ఉద్యోగ నష్టాల నుండి కోలుకోవడం కష్టం.హెల్త్ ఇన్సూరెన్స్ కోసం కార్పొరేట్ కవర్ సరిపోదు. ఒకే ఆసుపత్రిలో చేరడానికి అనేక లక్షలు ఖర్చవుతుంది. స్వతంత్ర కుటుంబ ఫ్లోటర్ పాలసీని కొనుగోలు చేసి, సూపర్ టాప్ అప్‌ను యాడ్ చేసుకోండి. భారతదేశంలో వైద్య ద్రవ్యోల్బణం సాధారణ ద్రవ్యోల్బణం కంటే ఎక్కువగా ఉంది. మీ 40 ఏళ్లలో దీనిని విస్మరించడం వల్ల తరువాత పదవీ విరమణ పొదుపులు ఆవిరి అయిపోతాయి.మీ కుటుంబం మీ ఆదాయంపై ఆధారపడి ఉంటే, మీ జీవితానికి సరైన బీమా ఉండాలి. మీ 50 ఏళ్ల వయసు కంటే 40 ఏళ్ల వయసులో పెద్ద టర్మ్ ప్లాన్ చాలా చౌకగా ఉంటుంది. తక్కువ ప్రీమియంతో వస్తున్నప్పుడే తీసుకోవడం ఉత్తమం.40 ఏళ్లలో ఉన్న చాలా మంది వ్యక్తులు చాలా సంవత్సరాలుగా కొనుగోలు చేసిన మ్యూచువల్ ఫండ్‌లు కలిగి ఉన్నారు. ఏకీకృతం చేయండి. పనితీరు తక్కువగా ఉన్న నిధులను తీసివేయండి. స్పష్టమైన లక్ష్యాలకు అనుగుణంగా ప్రతిదీ సమలేఖనం చేయండి.

## నాసా ఎన్.ఎస్.ఎస్ "లైవ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్" పోటీలో
# శ్రీ చైతన్య విద్యార్థుల ప్రపంచ స్థాయి విజయం

అమెరికా నాసా వారి నేషనల్ స్పేస్ సొసైటీ (చీూా) నిర్వహించిన "లైవ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్" డిజైన్ కాంపిటీషన్ 2026లో శ్రీ చైతన్య స్కూల్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా 12 నుండి 18 ఏళ్ల వయస్సు గల విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ పోటీలో, అంతరిక్ష నివాసాల కోసం అగ్రికల్చరల్ మాడ్యూల్ (వ్యవసాయ విభాగం) రూపకల్పన చేయడమే ప్రధాన లక్ష్యం. ఈ పోటీలో ప్రకటించిన మొత్తం 85

Sri Chaitanya Educational Institutions INDIA
Sri Chaitanya
Educational Institutions

బహుమతులలో శ్రీ చైతన్య విద్యార్థులు

7 ప్రపంచ ప్రథమ బహుమతులతో సహా మొత్తం 34 (40%) బహుమతులను కైవసం చేసుకున్నారు. ఇటీవల జరిగిన "రోడ్ మ్యాప్ టు స్పేస్" పోటీలో కూడా ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 10 ప్రాజెక్టులలో 8 ప్రాజెక్టులను సాధించి క్లీన్ స్వీప్ చేశామని డైరెక్టర్ సీమ తెలిపారు. గత 14 ఏళ్లుగా ఈ పోటీల్లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలుస్తున్న ఏకైక సంస్థ ఇదేనని, వ్యక్తిగత లేదా మొత్తం బహుమతుల సంఖ్యలో మరే ఇతర పాఠశాల ఈ స్థాయి ఫలితాలను సాధించలేదని ఆమె పేర్కొన్నారు. బట్టీ పట్టే పద్ధతి కాకుండా శ్రీ చైతన్య అనుసరిస్తున్న కాన్సెప్చువల్ టీచింగ్ మరియు ప్రాక్టికల్ ఆధారిత బోధనే ఈ విజయానికి కారణమని సీమ అన్నారు. విజేతలైన విద్యార్థులను, తల్లిదండ్రులను మరియు ఉపాధ్యాయులను అభినందిస్తూ, ఐఐటి-జెఈఈ, నీట్ వంటి పరీక్షల్లోనే కాకుండా ఏ అంతర్జాతీయ పోటీలోనైనా నంబర్ 1 స్థానం తమదేనని ఈ ఫలితం మరోసారి నిరూపించిందని ఆమె స్పష్టం చేశారు.

# రెప్కో హోమ్ ఫైనాన్స్ క్యూ3 ఫలితాల విడుదల

**-రూ. 15,394 కోట్లకు పెరిగిన రుణ పోర్ట్‌ఫోలియో;**
**మెరుగుపడిన ఆస్తుల నాణ్యత**

Repco
Home Finance
- We value your Dream


**చెన్నై, ఫిబ్రవరి 05, 2026:** రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఫిబ్రవరి 5, 2026న జరిగిన సమావేశంలో డిసెంబర్ 31, 2025తో ముగిసిన మూడవ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ఆమోదించారు. కంపెనీ మొత్తం లోన్ బుక్ గత ఏడాదితో పోలిస్తే 8.8% వృద్ధితో రూ. 15,394 కోట్లకు చేరుకుంది. ఈ పోర్ట్‌ఫోలి యోలో 100% రిటైల్ రుణాలు కాగా, ఇందులో గృహ రుణాలు 71.0% మరియు హోమ్ ఈక్విటీ ఉత్పత్తులు 29.0% ఉన్నాయి. విభాగాల వారీగా చూస్తే, జీతమేతర వర్గం 52.9% మరియు జీతం పొందే వర్గం 47.1% వాటాను కలిగి ఉన్నాయి.ఆస్తుల నాణ్యత మెరుగుపడింది; గ్రాస్ ఎన్‌పీఏ (+చీూా) గత ఏడాది రూ. 546 కోట్ల (3.86%) నుండి రూ. 450 కోట్లకు (2.92%) తగ్గింది. నెట్ ఎన్‌పీఏ (చీచీూా) రూ. 213 కోట్లు (1.38%) గా ఉంది. కంపెనీ సుమారు రూ. 359 కోట్ల కేటాయింపులను (జూతీశీ-జఅంఅశీఅం) కలిగి ఉంది మరియు స్టేజ్-3 ఆస్తులపై 53% కవరేజ్ రేషియోను నిర్వహిస్తోంది.ఆర్థికంగా, ఈ త్రైమాసికంలో రుణ మంజూరీలు 35% వృద్ధితో రూ. 1,087 కోట్లకు, మరియు పంపిణీలు (ఽఅంఎబతీంవ-ఎవత్ం) 40% వృద్ధితో రూ. 1,064 కోట్లకు చేరుకున్నాయి. మొత్తం ఆదాయం రూ. 457 కోట్లు కాగా, నికర వడ్డీ ఆదాయం 5% వృద్ధితో రూ. 208 కోట్లుగా నమోదైంది. ఈ త్రైమాసికంలో నికర లాభం రూ. 109 కోట్లు మరియు రుణ స్ప్రెడ్ 3.8% గా ఉంది. కంపెనీ మూలధన సమృద్ధి నిష్పత్తి (ఝుజూఞ్ఝుశ్రీ ాాంవనఝుఎం ఞ్ఆశీ) 37.22% గా ఉంది, ఇది నిబంధనల ప్రకారం ఉండాల్సిన 15% కంటే చాలా ఎక్కువ.డిసెంబర్ 31, 2025 నాటికి, కంపెనీకి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ మరియు మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో 205 శాఖలు మరియు 31 శాటిలైట్ సెంటర్లు ఉన్నాయి. ఇతర వివరాల కోసం చెన్నైలోని కార్పొరేట్ కార్యాలయంలో కంపెనీ సెక్రటరీ మరియు కంప్లయన్స్ ఆఫీసర్ మిస్టర్ అంకుష్ తివారీని సంప్రదించవచ్చునని కంపెనీ తెలిపింది.

# గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తా



**మంథని ఫిబ్రవరి 6( నినాదం):**
గ్రామ అభివృద్ధి కోసం నిత్యం కృషి చేస్తానని పోతారం గ్రామ సర్పంచ్ ఎడ్ల ఆదిత్య పేర్కొన్నారు. శుక్రవారం మంథని మండలం పోతారం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన భూమి పూజను సర్పంచ్ ఆదిత్య నిర్వహించారు. తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంజూరు అయినటువంటి పంచాయతీ భవనానికి భూమి పూజ నిర్వహించడం చాలా ఆనందకరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో గ్రామాభివృద్ధికి నిత్యం చేస్తానని ఆయన తెలిపారు. గ్రామస్తులే నా దేవుళ్ళు, పంచాయతీ అభివృద్ధి నా ముఖ్యమని సర్పంచ్ ఆదిత్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాసరి వెంకటస్వామి, పాలకవర్గ సభ్యులు దాసరి సతీష్, దాసరి ఈశ్వరి, వీణ , కుమార్, ఈసంపల్లి బాపు, బండి లిరిష్, సంతోష్, మహేందర్, నారాయణ, భూపతి, నరేష్, దాసరి రాములు, ముక్తేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడిదారుల అదృష్టాన్నే మార్చేసింది



రూ.1 లక్ష పెట్టుబడిపై రూ.78 లక్షలు! భారతీయ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిదారులు ఎల్లప్పుడూ మల్టీబ్యాగర్ రాబడిని అందించగల స్టాక్‌ల కోసం వెతుకుతూ ఉంటారు. ఈ సందర్భంలో తంగమాయిల్ జ్యువెలరీ కీలక పాత్ర పోషించింది.శుక్రవారం కంపెనీ షేర్లు బలమైన ర్యాలీని చూశాయి. ఇది పెట్టుబడిదారుల ఉత్సాహాన్ని పెంచింది. గణాంకాల విషయానికొస్తే, ఈ స్టాక్ దాదాపు 10% పెరిగి రూ.3491.80 గరిష్ట స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా ఈ స్టాక్ గత 10 సంవత్సరాలలో పెట్టుబడిదారులకు అద్భుతమైన రాబడిని అందించింది. రూ.1 లక్ష పెట్టుబడి రూ.78 లక్షలకు పైగా పెరిగింది. కంపెనీ పెట్టుబడిదారులకు బహుళ-బ్యాగర్ రాబడిని ఎలా అందించిందో తెలుసుకుందాం.

**రూ.లక్ష పెట్టుబడి రూ. 78 లక్షలు:**
తంగమయిల్ జ్యువెలరీ షేర్లు దీర్ఘకాలికంగా అద్భుతమైన రాబడితో పెట్టుబడిదారులను ఆశ్చర్యపరిచాయి. ఫిబ్రవరి 2016లో కంపెనీ షేర్ల ధర దాదాపు రూ.89.37గా ఉంది. ఆ సమయంలో రూ.1 లక్ష పెట్టుబడి పెట్టే పెట్టుబడిదారుడు దాదాపు 1,118 షేర్లను పొందేవాడు. తదనంతరం జూలై 2023లో కంపెనీ 1:1 బోనస్ షేరు ఇష్యూను ప్రకటించింది. ప్రతి పెట్టుబడిదారుడు తన వద్ద ఉన్న ప్రతి షేర్‌కు ఒక బోనస్ షేరును అందుకున్నాడు. దీనితో షేర్ల సంఖ్య 2,236కి పెరిగింది. ఫిబ్రవరి 6, 2026 నాటికి, కంపెనీ స్టాక్ ధర రూ.3,491.80కి చేరుకుంది. ఈ 2,236 షేర్ల మొత్తం విలువ దాదాపు రూ.78.07 లక్షలు. ఈ పెట్టుబడి మల్టీబ్యాగర్‌కు బలమైన ఉదాహరణగా నిలిచింది.
స్టాక్ మార్కెట్లో కంపెనీ పరిస్థితి
శుక్రవారం బిఎస్ఇలో కంపెనీ షేర్లు బలమైన ర్యాలీని చూశాయి. రోజు చివరిలో కంపెనీ షేర్లు 6.31% లేదా రూ.200.25 పెరిగి రూ.3374.65 వద్ద ముగిశాయి. ఇంట్రాడే గరిష్ట ధర రూ.3,491.80. ఈ కాలంలో కంపెనీ 52 వారాల గరిష్ట ధర రూ.4,138.15. 52 వారాల కనిష్ట ధర రూ.1,526.45.

## 7న ఓలా, ఉబర్, ర్యాపిడో

# డ్రైవర్ల దేశవ్యాప్త సమ్మె..

ఢిల్లీ: కనీస ఛార్జీలు, డ్రైవర్ల పని పరిస్థితులపై ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్లు శనివారం (ఫిబ్రవరి 7న) దేశవ్యాప్త సమ్మెకు దిగనున్నారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల యూనియన్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈ సమ్మె నిర్వహిస్తున్నారు. కనీసం ఆరు గంటల పాటు డ్రైవర్లు ఈ సమ్మెలో పాల్గొంటారని కార్మిక సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. సమ్మె కారణంగా దేశవ్యాప్తంగా క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీ సేవలకు అంతరాయం ఏర్పడనుంది. సమ్మెలో పాల్గొనే డ్రైవర్ల సంఖ్యను బట్టి ఆయా ప్రాంతాల్లో సేవల్లో సమ్మె తీవ్రత కనిపించనుంది. కనీస ఛార్జీలు, గిగ్ వర్కర్ల పని పరిస్థితులను నిరసిస్తూ ఈ ఆందోళన చేపడుతున్నట్లు తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల యూనియన్ పేర్కొంది.



క్యాబ్ సేవలను నియంత్రించేందుకు తీసుకొచ్చిన మోటార్ వెహికల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్, 2025 ఉన్నప్పటికీ ఆయా ప్లాట్‌ఫామ్స్ మాత్రం ఇష్టానుసారం ఛార్జీలు నిర్ణయిస్తున్నాయని కార్మికసంఘాలు పేర్కొంటున్నాయి. కాబట్టి ప్రభుత్వమే జోక్యం చేసుకుని కనీస ఛార్జీలను నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రైవేటు వాహనాలను కమర్షియల్ అవసరాలకు వినియోగించడంపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. డ్రైవర్ల ఆదాయానికి రక్షణ కల్పించడంతో పాటు, పని పరిస్థితుల మెరుగు కోరుతూ ఈ సమ్మె చేపడుతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా ఫుడ్ డెలివరీ, క్విక్‌కామర్స్ వర్కర్లు సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో కేంద్రం చొరవ తీసుకుని 10 నిమిషాల డెలివరీ హామీని తొలగించాలని ఆయా కంపెనీలకు సూచించింది. దీంతో బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో 10 నిమిషాల హామీని తొలగించాయి.

# 2008-2019 కాలానికి డీఏ చెల్లించండి

### పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

ఢిల్లీ: లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు సుప్రీంకోర్టులో గురువారం భారీ ఉపశమనం లభించింది. కరవు భత్యం (డీఏ) పొందడం ఉద్యోగుల చట్టబద్ధమైన హక్కు అని న్యాయస్థానం స్పష్టం చేసింది. 2008-2019 కాలానికి సంబంధించి డీఏను ఉద్యోగులకు చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. బకాయిపడిన మొత్తంలో 25శాతాన్ని మార్చి 6వ తేదీకల్లా ఉద్యోగులకు అందజేయాలని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం తెలిపింది.



అఖిల భారత వినియోగ ధరల సూచీ (ఏఐసీపీఐ) ప్రకారం నిర్ణయించిన డీఏ లెక్కింపు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆఫీస్ మెమోరాండం ద్వారా సవరించడానికి వీల్లేదని పేర్కొంది. 'డీఏ అదనపు ప్రయోజనం కాదు. కనీస జీవన ప్రమాణాల నిర్వహణకు ఇది సాధనం. పౌరుల సామాజిక, ఆర్థిక సంరక్షణ బాధ్యత సంక్షేమ రాజ్య ప్రభుత్వాలదే'నని ధర్మాసనం తెలిపింది. తీర్పు అమలు ఆర్థికంతో ముడిపడి ఉన్నందున మొత్తం డీఏ చెల్లింపు నిర్ధారణ, చెల్లింపుల షెడ్యూల్, విడతల వారీగా నిధుల విడుదల పర్యవేక్షణకు ఓ కమిటీని నియమిస్తున్నట్లు వెల్లడించింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులూ అప్పటి బకాయిలకు అర్హులేనని తెలిపింది. ఏప్రిల్ 15వ తేదీకల్లా స్థాయీ నివేదిక సమర్పించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. మొత్తం డీఏ బకాయిలు రూ.41వేల కోట్లు ఉంటాయని అంచనా.

# ఆర్‌బీఐ వడ్డీరేట్లలో మార్పుల్లేవ్..

ఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఆర్‌బీఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇదే.

గతేడాది ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ పలుమార్లు సవరించిన సంగతి తెలిసిందే. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావు శాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది.




### ఆర్‌బీఐ ప్రసంగంలోని కీలక అంశాలివే..

ద్రవ్యోల్బణం, వృద్ధి అంచనాలు సానుకూలంగా ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉంది. కార్పొరేట్ కంపెనీల పనితీరు మెరుగుపడటం, అసంఘటిత రంగంలో స్థిరమైన వృద్ధి తయారీకి ఊతమివ్వనుంది.

ఇటీవల కుదిరిన భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, త్వరలో జరగనున్న భారత్-అమెరికా ట్రేడ్ డీల్.. దేశీయ వృద్ధిని మరింత బలోపేతం చేయనున్నాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4శాతం వృద్ధి నమోదవుతుందని అంచనా. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికంలో 6.9శాతం, రెండో త్రైమాసికంలో 7శాతం వృద్ధి నమోదవ్వొచ్చని అంచనా వేస్తున్నాం.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 2.1శాతంగా ఉండొచ్చని అంచనా. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 4శాతం, రెండో త్రైమాసికంలో 4.2శాతం ద్రవ్యోల్బణం నమోదవ్వొచ్చు.

జనవరి చివరి నాటికి ఫారెక్స్ నిల్వలు 723.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వ్యవస్థలో ద్రవ్య లభ్యత రోజువారీ సగటున రూ.75వేల కోట్లుగా ఉంది.

## భూమి పాసుపుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే




వి మాడుగుక్ విలేకరి

మాడుగుల మండలం, సత్యవరం గ్రామంలో శుక్రవారం పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో మాడుగుల నియోజక వర్గం శాసనసభ్యులు బండారు సత్యనారాయణ పాల్గొని రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు మండల ఎన్ డి ఏ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి

# చెక్కులు పంపిణీ



వి మాడుగుల విలేకరి

మాడుగుల మండలం కేంద్రంలో శుక్రవారం స్థానికౖా4 కార్యాలయంలో మాడుగుల మండలం, చీడికాడ మండలాలికి సంబంధించిన 17 మంది అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 8,92,971 యొక్క రూపాయలు చెక్కులను మాడుగుల నియోజకవర్గం శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి చేతులు మీదుగా అందజేయడం జరిగింది. ఇంకా ఎవరైనా అనారోగ్యంగా బాధపడి హాస్పిటల్లో చూపించుకొని, ఆ యొక్క హాస్పటల్ నుండి ముఖ్యమంత్రి సహాయ నిధికి అప్లై చేసుకోవడానికి కావలసిన పత్రాలను తీసుకొని తమకు అందజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాల ఎన్డీఏ కూటమి నాయకులు, లబ్ధిదారులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఫిబ్రవరి 7, 8 తేదీలలో జీవీఎంసీ, సులభ్ ఇంటర్నేషనల్

## 'శిఖర్ సే సాగర్ తక్' స్వచ్ఛతా కార్యక్రమాలు

**కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విశాఖ అభివృద్ధికి సహకరించండి.**

**జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

విశాఖపట్నం ప్రతినిధి):

విశాఖ నగరంలో 'శిఖర్ సే సాగర్ తక్' అనే' స్వచ్ఛతా, అవగాహనా కార్యక్రమాలను ఫిబ్రవరి 7,8 తేదీలలో జీవీఎంసీ, సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్, సంయుక్తంగా నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమాలలో నగర ప్రజలు పాల్గొని స్వచ్ఛ విశాఖ అభివృద్ధికి సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

విశాఖ నగరాన్ని పర్యావరణహితంగా,పరిశుభ్రమైన హరిత విశాఖగా తీర్చిదిద్దేందుకు మహా విశాఖ నగర పాలక సంస్థ తో కలిసి సామాజిక బాధ్యతతో సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ా×ూాూా) "శిఖర్ సే సాగర్ తక్" (ాష్ట్రఅఝితీ ావ ాఝష్త్రుతీ ఎష్టుఎ) అనే వినూత్న స్వచ్ఛత ,ప్రచార కార్యక్రమాలను ఫిబ్రవరి 7, మరియు 8 తేదీల్లో విశాఖ నగరంలో ఆర్కే బీచ్, కాళీమాత దేవాలయం సమీపంలో నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు.

ఈ స్వచ్ఛతా డ్రైవ్ కార్యక్రమాలలో 2026 ఫిబ్రవరి 07 వ తేదీన ఆర్కే బీచ్ సమీపంలో ఉదయం 6 గంటల నుండి... 3 కి.మీ. కేటగిరిల స్వచ్ఛత వాక్ లో 60 సం.లు పైబడిన సీనియర్ సిటిజన్లు, 5 కి.మీ. కేటగిరిల స్వచ్ఛత రన్ లో 16-29 సం . లు కలిగిన యువతీ యువకులు. స్వచ్ఛతపై అవగాహన కల్పించేలా ఇసుకతో శిల్పాల (సైకత శిల్పాల) తయారీ (ాఝఅఎ ాఎబశ్రీజ్‌బతీవ) , పెయింటింగ్ పోటీలు ప్రజలు పాల్గొనవచ్చునన్నారు.

అలాగే ఫిబ్రవరి 8వ తేదీన ఆర్కే బీచ్ , కాళీమాత టెంపుల్ సమీపములో ఉదయం 6 గంటల నుండి.. , లిసైక్లోథాన్ - పర్యావరణ పరిరక్షణ ,స్వచ్ఛతపై సందేశాన్ని ఇస్తూ సైకిల్ ర్యాలీ .,

సామాజిక భాగస్వామ్యంతో భారీ స్థాయిలో సముద్ర తీర పరిశుభ్రత (బీచ్ క్లీనింగ్) కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు.

కావున, ఈ స్వచ్ఛత, అవగాహన కార్యక్రమాలలో సామాజిక బాధ్యతతో విశాఖ నగర ప్రజలు , యువతీ యువకులు, సీనియర్ సిటిజెన్లు పాల్గొని 2025-26 స్వచ్ఛ సర్వేక్షన్ లో దేశంలోనే విశాఖ నగరాన్ని ఉత్తమ పరిశుభ్ర నగరంగా, పర్యావరణహిత నగరంగా, హరిత విశాఖగా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దేందుకు ,స్వచ్ఛ విశాఖ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ప్రజలను కోరారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# ఇంటర్నెట్ చీప్ అని.. సమయం వృథా చేసుకోకండి

### విద్యార్థులతో మోదీ




దిల్లీ: పరీక్షల ముందు ఒత్తిడిలో ఉండే విద్యార్థుల్లో సరికొత్త ఉత్సహాన్ని నింపేలా పరీక్షాపే చర్చా కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారితో మాట్లాడుతున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. ఆ సందర్భంగా వారు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను శుక్రవారం మోదీ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. “పరీక్షలను సానుకూలంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవడం గురించి విద్యార్థులతో అద్భుతమైన చర్చ జరిగింది” అని రాసుకొచ్చారు. అలాగే ఈ వీడియోను అందరూ చూడాలని సూచించారు.

ఈ వీడియోలో మోదీ విద్యార్థులతో మాట్లాడుతూ.. “నేను ప్రధానిని అయ్యాను. కానీ పనితీరు గురించి ప్రజలు ఎన్నో విషయాలు చెప్తుంటారు. ఆ సలహాలు అన్నీ తీసుకోవాలి. కానీ అందులో మనకు సరిపోయేది ఎంచుకోవాలి. నేను కూడా కొన్ని సూచనలు తీసుకొని, పనిలో మార్పులు చేసుకున్నాను. నా విలువలను మాత్రం వదులుకోలేదు. చదువు, విశ్రాంతి, అలవాట్లు, నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడంలో ఒక బ్యాలెన్స్ ఉండేలా చూసుకోవాలి. అదే ఎదుగుదలకు కీలకంగా మారుతుంది. ఆటలు ఆడటం అనేది ఒక నైపుణ్యం. వాటిని ఒక సరదాగా మాత్రమే చూడకండి. జూదం జోలికి వెళ్లకండి. బెట్టింగ్‌ల వంటి వాటికి వ్యతిరేకంగా మన దేశంలో చట్టాలు ఉన్నాయి. అలాగే గతం దగ్గరే ఆగిపోకుండా.. మీ ముందున్న దాన్ని చూసేందుకు ప్రయత్నించండి. ఇంకా చేయాల్సిన వాటి గురించి ఆలోచించండి. ఇంటర్నెట్ తక్కువ ధరకే లభిస్తుందని సమయం వృథా చేసుకోకండి. పరీక్షలను పండుగలా చేసుకోవాలి.. మీతో మీరు పోటీపడాలి” అంటూ పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరి ఆలోచనా విధానానికి తేడా ఉంటుందని గుజరాత్ విద్యార్థి సాన్య అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. ఈసారి పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు 4.5 కోట్ల మంది నమోదయ్యారు.

# ఆంత్రోపిక్ కొత్త టూల్..

## భయం అక్కర్లేదన్న సుందర్ పిచాయ్



**అమెరికా : టెక్ కంపెనీలను కలవరపాటుకు గురిచేసిన అమెరికా ఏఐ స్టార్టప్ సంస్థ ‘ఆంథ్రోపిక్’ తాజాగా మరో కొత్త టూల్‌ను విడుదల చేసింది. సొంతంగా సీ-కంపైలర్లను రూపొందించే మోడల్‌ను తీసుకొచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో ‘ఆంథ్రోపిక్’పై గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ స్పందించారు. దీనిపై అనవసర భయాలు అక్కర్లేదని పేర్కొన్నారు.**

“గూగుల్ సెర్చ్, యూట్యూబ్ మాదిరిగానే ఏఐ కూడా ఓ సాధారణమైన సపోర్టింగ్ టూల్. దీనిపై మార్కెట్లలో అనవసర భయాలు నెలకొన్నాయి. ఇలాంటివాటిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సాంకేతికతను తమ ప్రయోజనాలకు తగ్గటుగానే వినియోగించే కంపెనీలకు ఇదో చక్కటి అవకాశం” అని సుందర్ పిచాయ్ వివరించారు.

అటు ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ప్రస్తుతమున్న సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను ఏఐ మరింత సమర్థంగా మారుస్తుందని పేర్కొన్నారు.

అంతేగానీ.. వాటిని కృత్రిమమేధ భర్తీ చేయలేదన్నారు. క్లిష్టమైన పనుల్లో ఉద్యోగులు దీన్ని ఉపయోగించుకుని తేలికగా టార్గెట్లు పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఇటీవల ఆంథ్రోపిక్ తీసుకొచ్చిన ప్రకంపనల కారణంగా ప్రపంచవ్యాప్తంగా సాఫ్ట్‌వేర్, లీగల్ టెక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీల షేర్లు కుదేలైన సంగతి తెలిసిందే. దీనివల్ల కేవలం ఒకేఒక్క ట్రేడింగ్ సెషన్‌లో ఈ రంగాల్లో 285 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది.

### ఆంథ్రోపిక్ కొత్త టూల్ ఇదే..

ఇదిలాఉండగా.. సొంతంగా సీ-కంపైలర్‌ను రూపొందించే క్లాడ్ ఓపస్ 4.6 మోడల్‌ను ఆంథ్రోపిక్ తాజాగా విడుదల చేసింది. 16 క్లాడ్ ఏఐ ఏజెంట్లు కలిసి సీ-కంపైలర్‌పై ప్రయోగాలు జరపగా.. సత్ఫలితాలనిచ్చినట్లు పేర్కొంది. ఈ ఏజెంట్లు కేవలం రెండు వారాల్లోనే లక్ష లైన్ల కంపైలర్‌ను సృష్టించాయని తెలిపింది. ఈ కంపైలర్.. లైనక్స్ కెర్నల్‌ను కంపైల్ చేయగలదని వెల్లడించింది. సీ-కంపైలర్ అనేది సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్. సీ-ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లో రాసిన సోర్స్ కోడ్‌ను.. మెషిన్-రీడబుల్ ఫార్మాట్‌లోకి మారుస్తుంది. ఆ ఆదేశాలనే కంప్యూటర్ సీపీయూ అర్థం చేసుకుని ఎగ్జిక్యూట్ చేస్తుంది. ఈ కంపైలర్‌తోనే కంప్యూటర్లు బైనరీ కోడ్‌లో ఆదేశాలను స్వీకరిస్తాయి. సాధారణంగా ఇది చాలా క్లిష్టమైన ప్రోగ్రామ్ అని టెక్ నిపుణులు చెబుతుంటారు. అలాంటి ప్రక్రియను ఏఐ సొంతంగా రూపొందించడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది.

# ప్రజలే మిమ్మల్ని వద్దనుకున్నారు..

### ప్రశాంత్ కిశోర్‌కు సుప్రీం చురకలు



దిల్లీ: ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. గతేడాది బిహార్‌లో జరిగిన ఎన్నికల ఫలితాన్ని సవాల్ చేస్తూ ఆ పార్టీ వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ సందర్భంగా ప్రజలే మీ పార్టీని వద్దనుకున్నారంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చురకలంటించారు. ఇప్పుడు ఈ న్యాయవేదికను ప్రచారానికి వాడుకుంటున్నారా అని ప్రశ్నించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో 238 స్థానాల్లో పోటీకి దిగిన ప్రశాంత్ కిశోర్ పార్టీ.. ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. ఇందులో ఎన్డీయే కూటమి ఘన విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే, గెలిచిన కూటమి సభ్యులు ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి.. ఒక్కో మహిళకు రూ.10వేలు పంపిణీ చేశారని జన్ సురాజ్ పార్టీ పిటిషన్‌లో ఆరోపించింది. ఈ క్రమంలో కూటమి గెలుపు చెల్లదని ప్రకటించాలని ఆ పార్టీ కోరింది. అయితే జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించింది.

ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. ‘మేము ఇలాంటి నోటీసులు జారీ చేయలేం. ఎన్నికల్లో ఓడిపోయారు కాబట్టి.. మొత్తం ఫలితాన్ని పక్కన పెట్టాలని మీరు కోరుతున్నారు. ఇలాంటి అంశాలపై రాజకీయ పార్టీలు కాకుండా.. సామాన్యులు కోర్టుకు రావడాన్ని మేం స్వాగతిస్తాం. ఒకవేళ.. మీ పార్టీ అధికారంలోకి వచ్చినా మీరూ అదే చేస్తారు’ అని వ్యాఖ్యానించారు. ఇంకా ఏమైనా ఫిర్యాదులు ఉంటే బిహార్ హైకోర్టును ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది.

# వద్దన్నా వస్తున్నారు..

# యూరప్‌లో ట్రావెల్ ఓవర్‌క్రౌడింగ్!

**యూరప్ : పలు దేశాల ప్రభుత్వాలు తమ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసుకుంటూ.. మా దేశంలో పర్యటించాలని ప్రకటనలు, ప్రచారాలతో హోరెత్తిస్తున్నాయి. భారత్‌లోనూ పర్యాటక రంగ అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. అయితే, యూరప్‌లోని పలు దేశాలు మాత్రం.. ‘ రాకండి ప్లీజ్’ అంటూ పర్యాటకులను వేడుకుంటున్నాయి. ఎక్కువ మంది పర్యాటకులు వస్తుండటంతో అటు ప్రభుత్వాలకు, స్థానికులకు ‘ట్రావెల్ ఓవర్ క్రౌడింగ్’ సమస్యలు వచ్చి పడుతున్నాయి. అందుకే, యూరప్‌లో ట్రావెల్‌పై పలు ఆంక్షలు మొదలయ్యాయి.**



ప్రపంచ పర్యాటక రంగంలో యూరప్‌ది కీలక పాత్ర. శతాబ్దాల చరిత్ర, విభిన్న సంస్కృతులు, అద్భుతమైన కట్టడాలు, అందమైన బీచ్‌లు, ప్రాచీన-ఆధునిక జీవనశైలి కలగలిసిన యూరప్.. పర్యాటకులకు బాగా ఆకర్షిస్తోంది. ముఖ్యంగా ఫ్రాన్స్‌లోని పారిస్, ఇటలీలోని వెనీస్, యూకేలోని లండన్, స్పెయిన్‌లోని బార్సిలోనా, నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్, హంగేరీలోని బుడపెస్ట్, ఆస్ట్రియాలోని వియాన్నా, ఇటలీలోని రోమ్ ఇలా అనేక ప్రాంతాలు టూరిజానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్నాయి. దీంతో అంతర్జాతీయ విహారయాత్ర చేయాలనుకునే పర్యాటకులు ముందుగా యూరప్‌ను ఎంచుకుంటున్నారు. గతేడాది 70కోట్లకుపైగా పర్యాటకులు యూరప్ పర్యటనకు వెళ్లారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

### దగ్గరేగా..

అంతర్జాతీయ పర్యాటకులతో మాత్రమే సమస్య కాదు.. యూరప్ దేశాల ప్రజల నుంచి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఖండంలో దేశాల మధ్య దూరాలు చాలా తక్కువ. బస్సు, రైలు, విమాన మార్గాల్లో తక్కువ ఖర్చుతోనే ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్లొచ్చు. దీంతో అక్కడి ప్రజలు వీకెండ్ వస్తే చాలు ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో వాలిపోతున్నారు.

### ఆ నగరాల్లోనే

పారిస్, రోమ్, వెనిస్, లండన్, బార్సిలోనా, ఆమ్‌స్టర్‌డామ్ వంటి నగరాలు పర్యాటకానికి పెట్టింది పేరు. దీంతో పర్యాటకులంతా నేరుగా ఈ నగరాలకే చేరుకుంటున్నారు. ఎయిర్‌పోర్టులు నిత్యం పర్యాటకులతో కిటకిటలాడుతుంటాయి.

### సోషల్‌మీడియా - ట్రావెల్ ట్రెండ్

యూరప్‌లో ప్రముఖ పర్యాటక ప్రాంతాల గురించి సోషల్‌మీడియాలో విస్తారంగా ప్రచారం జరుగుతోంది. ‘డ్రీమ్ డెస్టినేషన్’, ‘బకెట్ లిస్ట్’ అంటూ ఫొటోలు, వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో ఆ ప్రదేశాలకు వెళ్లడానికి పర్యాటకులు మొగ్గుచూపుతున్నారు.

### సీజనల్ టూరిజం

సమ్మర్, క్రిస్మస్, ఈస్టర్ హాలీడేస్ సమయంలో యూరప్‌లో పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. వీకెండ్‌లో దగ్గర ప్రాంతానికి, సమ్మర్‌లో చల్లటి ప్రాంతానికి, హానీమూన్ కోసం రొమాంటిక్ డెస్టినేషన్‌కు ఇలా సందర్భం, సీజన్‌ను బట్టి యూరప్‌లోని పర్యాటక ప్రాంతాలను ఎంచుకుంటున్నారు.

### స్థానికుల ఇబ్బందులు

పర్యాటక రంగంతో భారీగానే ఆదాయం వస్తున్నా నియంత్రణలేని ట్రావెల్ ఓవర్‌క్రౌడింగ్‌తో స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. పర్యాటకులతో సందర్శక ప్రాంతాలు కిక్కిరిసిపోతున్నాయి. స్థానికుల్లో కలిసిపోతుండటంతో రవాణా, వసతి, ఇతర సేవల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎయిర్ బీఎన్‌బీ వంటి సంస్థలు ఆయా ప్రాంతాల్లో పర్యాటకులకు ఇళ్లను అద్దెకిస్తున్నాయి. దీంతో అద్దె ధరలు అమాంతం పెరుగుతున్నాయి. స్థానిక ప్రజలకు ఇల్లు బాడుగకు దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. వీరి రాకపోకలతో పౌరులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోంది. అంతేకాదు, పర్యాటకులు పెరుగుతుండటంతో కాలుష్యం, వ్యర్థాల నిర్వహణ, నీటి కొరతతోపాటు పర్యావరణానికి హాని కలుగుతోంది. అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు తగ్గుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

# ట్రంప్ నోబెల్ పాట్లు.. మిత్రదేశం చీవాట్లు..!



అమెరికా : అమెరికాకు మరో మిత్ర దేశం షాకిచ్చింది. అగ్రరాజ్య సూచనలను పట్టించుకోలేదు సరికదా.. తమకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదంటూ చురకలంటించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ బహుమతికి నామినేట్ చేయడానికి పోలండ్ నిరాకరించడం ఇరుదేశాల మధ్య దౌత్య వివాదానికి దారితీసింది. ఈ పరిణామాలను అగ్రరాజ్య దౌత్యవేత్త తీవ్రంగా ఖండించగా.. పోలండ్ ప్రధాని ఘాటుగా బదులిచ్చారు. అసలేం జరిగిందంటే..

మధ్యప్రాచ్యంలో శాంతియుత పరిస్థితులు నెలకొల్పేలా చేసినందుకు గానూ.. వచ్చే ఏడాది నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ పేరును నామినేట్ చేయాలని అమెరికా, ఇజ్రాయెల్ నుంచి పోలండ్ పార్లమెంట్‌కు ప్రతిపాదనలు వచ్చాయి. దీన్ని పోలండ్ స్పీకర్ తిరస్కరించారు. "బలవంతపు రాజకీయాలు, విధానాలతో ట్రంప్ అంతర్జాతీయ సంస్థలను అస్థిరపరుస్తున్నారు. ఆయన నోబెల్‌కు అనర్హులు. ఈ ప్రతిపాదనను మేం తిరస్కరిస్తున్నాం" అని పోలండ్ స్పీకర్ ప్రకటించారు.

ఈ చర్యను అమెరికా తీవ్రంగా పరిగణించింది. దీనిపై పోలండ్‌లోని అమెరికా దౌత్యవేత్త టామ్ రోజ్ స్పందిస్తూ.. "ఇది ట్రంప్‌ను అవమానించడమే. దీనివల్ల ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఆయనను మా దేశంలోకి రానివ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేస్తాం" అని పేర్కొన్నారు. దీనిపై పోలండ్ ప్రధాని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. "మిత్ర దేశాలు పరస్పరం గౌరవించుకోవాలి. అంతేగానీ ఇలా మాకు పాఠాలు చెప్పే ప్రయత్నం చేయొద్దు. దౌత్య సంబంధాలు ఎలా నిర్వహించాలో మాకు తెలుసు" అని హితవు పలికారు.

# గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్..

## ముగ్గురు మావోయిస్టులు మృతి



చర్ల: మహారాష్ట్రలోని గడ్చిరోలిలో మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. గురువారం నుంచి భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరుగుతున్న ఈ ఎదురుకాల్పుల్లో ఒక పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భ్రమగఢ్ తాలూకాలో నిన్న రాత్రి నుంచి ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. ఇందులో ఇద్దరు మహిళలతో సహా ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి ఒక ఏకే-47 రైఫిల్‌తో సహా పలు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. ఇక, మావోయిస్ట్‌లతో జరిగిన ఎదురుకాల్పుల్లో సీ-60 కమాండో దీపక్ చిన్న మాదవి (38) తీవ్రంగా గాయపడ్డారు. అతడిని హెలికాప్టర్‌లో భ్రమాగడ్‌లోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో ఓ అధికారి కూడా గాయపడగా.. అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయన్నారు.

# అబుధాబీలో రెండో రోజూ

# కొనసాగిన రష్యా-ఉక్రెయిన్ చర్చలు





కీవ్: దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా.. యూఏఈ రాజధాని అబుధాబీ వేదికగా రష్యా, ఉక్రెయిన్ రెండో రోజైన గురువారం కూడా చర్చలు కొనసాగించాయి. అమెరికా మధ్యవర్తిత్వంతో జరుగుతున్న ఈ రెండో రౌండ్ చర్చల్లో ఇప్పటివరకూ ఏయే అంశాలపై ఏకాభిప్రాయం కుదిరిందన్నది అధికారికంగా వెల్లడి కాలేదు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్, ఐరోపాలో నాటో సుప్రీం అలైడ్ కమాండర్ జనరల్ అలెక్సస్ గ్రింకెవిచ్ తదితరులు తాజా చర్చల్లో పాల్గొన్నారు. అబుధాబీలోనే గత నెల్లో జరిగిన తొలి రౌండ్ సమాలోచనల్లోనూ విట్కాఫ్, కుష్నర్ పాల్గొన్న సంగతి గమనార్హం. మరోవైపు- రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఇప్పటివరకూ తమ సైనికులు 55 వేల మంది అమరులయ్యారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ఇంకా చాలామంది సైనికుల జాడ తెలియరావడం లేదని కూడా పేర్కొన్నారు.

### రష్యా-అమెరికా మధ్య కీలక అంగీకారం

తమ రెండు దేశాల మధ్య ఉన్నత స్థాయి మిలిటరీ-మిలిటరీ కమ్యూనికేషన్‌ను పునరుద్ధరించుకోవాలని రష్యా, అమెరికా తాజాగా నిర్ణయించుకున్నాయి. అబుధాబీలో రష్యా, అమెరికా, ఉక్రెయిన్ సైనిక ఉన్నతాధికారుల మధ్య జరిగిన చర్చల్లో ఈ కీలక అంగీకారం కుదిరింది. అమెరికా ఐరోపా కమాండ్ గురువారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. దీర్ఘకాలిక శాంతి కోసం పనిచేసేందుకు ఇది దోహదపడుతుందని తెలిపింది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభానికి ముందు 2021లో రష్యా, అమెరికా తమ మధ్య ఉన్నత స్థాయి మిలిటరీ-మిలిటరీ కమ్యూనికేషన్‌ను సస్పెండ్ చేసుకున్న సంగతి గమనార్హం.

# చైనాకు వెళ్తున్న నౌక..

## మర్చంట్ నేవీ అధికారి అదృశ్యం..!



మారిషస్ : మారిషస్ సమీపంలో ఓ నౌకలో విధుల్లో ఉన్న భారత్‌కు చెందిన మర్చంట్ నేవీ అధికారి అదృశ్యమయ్యారు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకోవాలని బాధితుడి కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆ అధికారిని ఒడిశాకు చెందిన సార్థక్ మహాపాత్రోగా గుర్తించారు. బాధితుడి కుటుంబసభ్యులు పేర్కొన్న వివరాల ప్రకారం.. గతేడాది జులైలో ఒక ప్రైవేట్ షిప్పింగ్ కంపెనీలో సార్థక్ ఉద్యోగంలో చేరారు. అతడు ప్రయాణిస్తున్న నౌక సింగపూర్ నుంచి చైనాకు తిరిగివస్తోంది. ఫిబ్రవరి 2న తల్లిదండ్రులు, స్నేహితులతో అతడు వీడియో కాల్‌లో మాట్లాడాడు. తర్వాత రోజు అతడిని సంప్రదించేందుకు బాధితుడి తల్లి ప్రయత్నించగా సాధ్యపడలేదు. సార్థక్ కన్పించడం లేదని ఆ తర్వాత షిప్పింగ్ కంపెనీ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చింది. అతడి కోసం గాలింపు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ ఘటనపై బాధితుడి తల్లి స్పందిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని, తమ కుమారుడిని త్వరగా ఇంటికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

ఈ విషయాన్ని కేంద్రంలోని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని రాష్ట్ర ప్రభుత్వ అధికార వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై త్వరగా విచారణ ప్రారంభించాలని కోరినట్లు వెల్లడించాయి. ఇక, సార్థక్ ఫిబ్రవరి 3న తన క్యాబిన్‌లోకి వెళ్లినట్లు రికార్డుల్లో ఉందని కంపెనీ అధికారులు తెలిపారు. నౌక మొత్తం గాలించినా అతడి ఆచూకీ తెలియరాలేదన్నారు. సముద్ర ప్రాంతంలో తనిఖీలు ప్రారంభించామన్నారు.

# భారీగా పతనమైన బిట్‌కాయిన్



అమెరికా : క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ విలువ భారీగా పతనమైంది. ఒకేరోజు 12%కి పైగా పతనమై 63,295 డాలర్లకు చేరింది. 2024 తర్వాత ఒకరోజు అత్యధిక పతనం ఇదే కావడం గమనార్హం. ఒక దశలో 60వేల డాలర్లకు కూడా పడిపోయింది. విలువైన లోహాలలో అస్థిరత, ఐటీ షేర్లలో భారీ అమ్మకాలు ఈ పరిస్థితికి కారణమైంది. దాంతో దాదాపు 1 బిలియన్ డాలర్ల విలువైన బిట్‌కాయిన్ పొజిషన్లను మదుపర్లు వదిలించుకున్నారని క్రిప్టో కరెన్సీ యాప్ కాయిన్‌గ్లాస్ డేటా వెల్లడించింది.

### నష్టాల్లో స్టాక్ మార్కెట్..

దేశీయ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఉదయం 9.45 గంటల సమయంలో సెన్సెక్స్ 323 పాయింట్ల నష్టంతో 82,990 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 117 పాయింట్లు కోల్పోయి 25,525 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ సూచీలో బజాజ్ ఫైనాన్స్, కొటక్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టీఎంపీవీ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. టెక్ మహీంద్రా, టీసీఎస్, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఇన్ఫోసిస్, ఎటర్నల్ స్టాక్స్ నష్టాల్లో కదలాడుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 90.25గా ఉంది.

# రోజూ ఈ జ్యూస్ తాగితే ఇన్ని లాభాలా..? ఇప్పటికైనా అలవాటు చేసుకోండి..!



జీర్ణ సమస్యలతో బాధపడేవారికి పైనాపిల్ జ్యూస్ చాలా మేలు చేస్తుంది. మీరు అతిసారం, కడుపు నొప్పి, మలబద్ధకం లేదా ఉబ్బరంతో బాధపడుతుంటే, పైనాపిల్ రసం మీకు సరైనది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ పండులో లభించే కాల్షియం, మెగ్నీషియం, ఇతర పోషకాలు పైనాపిల్స్‌లో తగినంత పరిమాణంలో కనిపిస్తాయి. ఇది ఎముకలు, దంతాలను బలపరుస్తుంది. పైనాపిల్ రసంలో పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి.



ముఖ్యంగా మాంగనీస్, కాపర్, విటమిన్ బి6, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలన్నీ ఎముకల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, గాయం నయంకావటం, శక్తి ఉత్పత్తి చేయటానికి, కణజాల సంశ్లేషణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.ఇందులో ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, జింక్, కోలిన్, విటమిన్లు కె, బి కూడా ఉంటాయి. పైనాపిల్ యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి అద్భుతమైన మూలం. ఇది గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. పైనాపిల్ జ్యూస్ తాగడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి. పైనాపిల్ రసంలో విటమిన్ ఎ లభిస్తుంది. ఇది కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పిల్లలకు పైనాపిల్ జ్యూస్ ఇవ్వడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. అనేక రకాల క్యాన్సర్‌తో పోరాడవచ్చు.. బ్రోమెలైన్ జీర్ణక్రియ, గుండె ఆరోగ్యంతో పాటు అనేక రకాల క్యాన్సర్‌ల నుండి మిమ్మల్ని కాపాడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆస్తమా లక్షణాలను కూడా తగ్గించవచ్చు. పైనాపిల్ రసం ఉబ్బసంతో ఇబ్బంది పడేవారికి కూడా మేలు చేస్తుంది. పైనాపిల్ జ్యూస్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది మీ శరీరాన్ని డ్యామేజ్ నుండి, ఇతర వ్యాధుల నుండి కాపాడుతుంది. ఇందులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్‌ల సమూహం కూడా ఉంటుంది. ఇది వాపును తగ్గిస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

# 30 ఏళ్లు వచ్చేసరికి.. పురుషుల్లో వచ్చే అనారోగ్య సమస్యలు ఇవే!

సాధారణంగా వయసు పెరిగే కొద్దీ.. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు వస్తూ ఉంటాయి. ఇవి చాలా కామన్ విషయం. కానీ ఇప్పుడున్న రోజుల్లో చిన్న పెద్దా అనే వయసుతో సంబంధం లేకుండా అన్ని రకాల వ్యాధులు వస్తున్నాయి. వీటి పట్ల మొదట్లోనే జాగ్రత్తలు తీసుకోకపోతే.. చిన్న సమస్యలు కాస్తా పెద్ద సమస్యలుగా మారుతున్నాయి. అయితే ఆడవారి కంటే పురుషులు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఉంటారు. అస్సలు పట్టించుకోరు. అనారోగ్య సమస్యల లక్షణాలు కనిపించినా కేర్ చేయరు. ఆ తర్వాత ఆస్పత్రి పాలవ్వాల్సి వస్తుంది. ఇటీవల జరిగిన సర్వేల ప్రకారం.. 30 ఏళ్లు దాటిన పురుషుల్లో కొన్ని రకాల హెల్త్ ప్రాబ్లమ్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయట. వీటిని ప్రారంభంలో గుర్తించకపోతే.. చివరికి ప్రాణాల మీదకే వస్తుంది. ఇంతకీ పురుషులకు 30 ఏళ్లు దాటాక వచ్చే సమస్యలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఎముకలు బలహీనం: 30 ఏళ్లు వచ్చిన తర్వాత పురుషుల్లో ఎముకలు



బలహీనంగా మారతాయి. ఈ వయసులో ఆహారం విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే.. శరీరంలో విటమిన్ డి, క్యాల్షియం లోపం ఏర్పడుతుంది. దీంతో కీళ్ల నొప్పులు, ఎముకలకు సంబంధించిన సమస్యలు రావచ్చు. కాబట్టి 30 ఏళ్ల వయసులో పురుషులు ఖచ్చితంగా క్యాల్షియం ఉండే ఆహారం తీసుకోవాలి. అలాగే వ్యాయామం కూడా చేయాలి. గుండె జబ్బులు: ప్రస్తుత కాలంలో ఉన్న ఆహారపు అలవాట్ల కారణంగా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ అనేది విపరీతంగా పెరిగిపోతుంది.

ఈ కొలెస్ట్రాల్ కారణంగా గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. మీ లైఫ్ స్టైల్‌లో ఖచ్చితంగా మార్పులు చేసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. బరువు పెరగడం: పురుషులకు 30 ఏళ్లు దాటాక.. బరువు అనేది పెరుగుతూ ఉంటారు. ఒత్తిడి, సరైన వేళకు సరైన ఆహారం తీసుకోకపోవడం వంటి కారణాల వల్ల బరువు అనేది పెరిగిపోతారు. ఈ సమయంలో మీరు మీ శరీరంపై ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలి. వ్యాయామాలు, వాకింగ్ వంటివి చేయడం వల్ల ఒత్తిడి, బరువు తగ్గుతాయి. క్యాన్సర్: పురుషులకు 30 ఏళ్ల వయసులో ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. మూత్రంలో మంట, వృషణాల్లో నొప్పి, యూరిన్ సమస్యలు, ఇన్ ఫెక్షన్లు రావచ్చు. మీరు ఈ సమస్యలతో ఇబ్బంది పడితే టెస్టులు చేయించుకోవడం అవసరం.

# గుట్టలాంటి పొట్టకు ఛూమంత్రం..





గసగసాలులో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మసాలా దినుసు గసగసాలు యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉన్నాయి. వీటిని రాగి, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, ఫైబర్, మాంగనీస్ గొప్ప మూలంగా పరిగణిస్తారు. గసగసాలు అనేక వ్యాధుల నుండి రక్షించడంలో సాయపడతాయి. నాడీ వ్యాధులు, మధుమేహం, గుండె జబ్బులు వంటి వివిధ రకాల ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలోగసగసాలుఉపయోగపడతాయి.ఇంకాఎసిడిటీ, మలబద్ధకం సమస్య నుంచి కూడా ఉపశమనం కలిగిస్తాయి. గసగసాలు.. బరువు తగ్గించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటాయి. పొట్ట, నడుము చుట్టూ కొవ్వు పెరగడం వల్ల మీరు ఇబ్బంది పడుతుంటే గసగసాలు తీసుకోవడం చాలా మంచిది.. ఎందుకంటే ఇందులోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్‌లు బరువు తగ్గడానికి సహకరిస్తాయి. గసగసాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. రోజువారీ ఆహారంలో గసగసాలు చేర్చుకుంటే.. కొన్ని రోజుల్లోనే మార్పు వస్తుంది. ఇంకా గసగసాల సిరప్‌ను మార్కెట్ నుంచి కొనుగోలు చేసి, దానిని షర్బత్‌గా చేసుకుని తాగవచ్చు.ఇదితీసుకోవడం వల్లఎక్కువసేపు ఆకలిగా అనిపించకుండా చేస్తుంది. దీంతో బరువు క్రమంగా తగ్గుతుంది.గసగసాలు, పాలు కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. దీని వినియోగం వల్ల కండరాలు, ఎముకలు బలపడతాయి. ఒక గ్లాసు పాలలో 1టేబుల్ స్పూన్ గసగసాలు వేసిమరిగించి గోరువెచ్చగా ఉన్నప్పుడు త్రాగాలి.

# ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొత్తిమీర నీళ్లు తాగితే ఏమవుతుందో తెలుసా..?

కొత్తిమీర నీరు ఎసిడిటీ, పిత్తాను తగ్గించడంలో చాలా మేలు చేస్తుంది. కొత్తిమీరలోని గుణాలు పొట్టకు మేలు చేస్తాయి. కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపులో యాసిడ్ స్థాయి తగ్గుతుంది. ఎసిడిటీ వల్ల వచ్చే మంట, నొప్పి తగ్గుతుంది. కొత్తిమీరలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది అసిడిటీ వల్ల వచ్చే సమస్యలను తగ్గిస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపు సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కొత్తిమీర నీరు మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. కొత్తిమీరలో అధిక పీచు ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొత్తిమీర గింజలలో ఉండే థైమోల్ అనే పదార్థం మలబద్ధకం నుండి ఉపశమనం కలిగించే జీర్ణ రసాల స్రావాన్ని పెంచుతుంది. అలాగే, కొత్తిమీర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. ఇది మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. బరువు నియంత్రణ, బరువు తగ్గడంలో కొత్తిమీర నీరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కొత్తిమీరలో ఉండే ఫైబర్ కడుపు నిండుగా ఉంచుతుంది. ఆకలి దప్పులను తగ్గిస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు నియంత్రణలో సహాయపడుతుంది. కొత్తిమీరలో ఉన్న పాలీఫెనాల్ యాంటీ ఆక్సిడెంట్లు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి. థైరాయిడ్ సమస్యలకు సహజ నివారణగా పనిచేస్తుంది. కొత్తిమీర ఆకులు, కాండం యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి సరైన థైరాయిడ్ పనితీరుకు సహాయపడతాయి. మీరు దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తాగితే అద్భుత ఫలితం ఉంటుంది. కొత్తిమీరలో గ్లైసెమిక్ 33 మాత్రమే ఉంది. ఇది చాలా తక్కువ. అటువంటి పరిస్థితిలో, ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా చెప్పవచ్చు. పచ్చి కొత్తిమీర శరీరంలో చక్కెర స్థాయిని తగ్గించి, ఇన్సులిన్ మొత్తాన్ని పెంచుతుంది. అలాగే, రక్తంలో చక్కెర తక్కువగా ఉంటే కొత్తిమీర నీటిని తాగకూడదు. అది రక్తంలో చక్కెరను తగ్గిస్తుంది.




# అవిసె గింజలతో ఆరోగ్యమే కాదు.. ఇలా వాడితే మెరిసే అందం మీ సొంతం!



మన శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలు అవిసె గింజల్లో ఉన్నాయి. కొలెస్ట్రాల్, డయాబెటిస్, ఆర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్నవారు, ప్రతిరోజూ అవిసె గింజలతో చేసిన ఆహారాన్ని తినడం వల్ల వాటిని అదుపులో ఉంచుకోవచ్చు. మన శరీరానికి ఎంతో అత్యవసరమైన ఒమేగా త్రీ ఫ్యాటీ ఆమ్లాలు అవిసె గింజల్లో ఉంటాయి. ఇవి పిల్లలకు, పెద్దలకు, గర్భిణులకు చాలా అవసరం. అవిసె గింజలతో చేసుకుంటే రోజుకో లడ్డును తినవచ్చు. ఇది శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఫేస్ ప్యాక్: ఒక టీస్పూన్ అవిసె గింజలను కప్పు నీటిలో వేసి అరగంట పాటు నానబెట్టాలి. తర్వాత చిన్న మంటమీద నీరంతా జెల్‌గా మారేవరకు ఉడికించాలి. చల్లారిన తర్వాత జెల్‌ను ముఖానికి పట్టించాలి. కాసేపటి తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. రోజుకు ఒకసారి ఈ ప్యాక్ వేసుకుంటే చర్మంపై ఉన్న వాపు, మచ్చలు, మొటిమలు తగ్గుతాయి. రోజ్ వాటర్‌తో: అవిసెలను నీళ్లలో నానబెట్టి మిక్సీలో వేసి పేస్టులా చేసుకోవాలి. ఆ పేస్టులో రోజ్ వాటర్ కలిపి ముఖానికి పట్టించాలి. ఇలా చేయడం వల్ల అవిసె గింజల్లో ఉన్న పోషకాలు చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తాయి. స్క్రబ్ గా ఉపయోగపడుతుంది: చర్మంలో ఉండే మృత కణాలను తొలగించి చర్మాన్ని తాజాగా ఉంచడానికి అవిసె గింజల పొడి మంచి స్క్రబ్‌గా ఉపయోగపడుతుంది. ఇందుకోసం ఒక కప్పులో అవిసె గింజల పొడి, ఒక టేబుల్ స్పూన్ తేనె వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకుని పదిహేను నిమిషాల తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. ఇలా చేస్తే చర్మం తాజాగా మారుతుంది. జుట్టు ఆరోగ్యానికీ: ఒక టీస్పూన్ అవిసె గింజల పొడిని చిన్న గిన్నెలో వేసి, ఒక గుడ్డును కొట్టి ఆ పొడిలో వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి, జుట్టుకు రాసుకుని అరగంట తర్వాత స్నానం చేయాలి. ఇలా చేస్తే జుట్టు మెరుస్తుంది. చర్మం కాంతిమంతంగా మారుతుంది.

# షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచే దివ్యాస్త్రాలు.. ఈ 5 జాగ్రత్తలు తప్పనిసరి!






డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు ఏడాది పొడవునా బ్లడ్ షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచుకోవడం సవాలుతో కూడుకున్న విషయం. ముఖ్యంగా వేసవిలో షుగర్ లెవెల్స్‌ను తగ్గించుకోవడం అంత సులువు కాదు. అందుకే డయాబెటిక్ రోగులందరికీ వేసవి కష్టకాలంతో సమానం. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వేసవిలో మీ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చంటున్నారు నిపుణులు. వోక్‌హార్డ్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ మీరా.. డయాబెటిక్ రోగులను వేసవి ఎలా ప్రభావితం చేస్తుందో వివరించారు. సాధారణంగా అధిక వేడి వల్ల అలసట, డీహైడ్రేషన్ వంటి కారణాల వల్ల రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడం కష్టతరం అవుతుంది. అందుకే మధుమేహం ఉన్నవారు వేసవిలో మరింత జాగ్రత్తగా ఉంగాలి. ఎందుకంటే మధుమేహం ఉన్నవారు తమ శరీరంలోని నీటిని త్వరగా కోల్పోతారు. దీంతో సులభంగా నిర్జలీకరణానికి గురవుతారు. పైగా తక్కువ నీరు తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. దీంతో రక్తనాళాలు, నరాల దెబ్బతినడం వంటి కొన్ని మధుమేహం సమస్యలు స్వేద గ్రంధులపై ప్రభావం చూపుతాయి. పైగా శరీర ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది. ఇది హీట్ ఎగ్జాషన్, హీట్ స్ట్రోక్‌కు కారణమవుతుంది. ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతాయి. అందుకే వేసవిలో షుగర్ లెవల్స్ అదుపులో ఉంచుకోవాలి. వేసవిలో మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ కింది జాగ్రత్తలు తీసుకుంటే హాయిగా ఉండొచ్చు. ఔ వేసవిలో మధుమేహాన్ని నియంత్రించడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలు వీలైనంత హైడ్రేటెడ్‌గా ఉండాలి వేసవి కాలంలో అధిక వేడికారణంగా చెమట ద్వారా ఎక్కువ నీటిని కోల్పోతారు. ఇది నిర్జలీకరణానికి దారితీస్తుంది. నిర్జలీకరణం రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడానికి దారితీస్తుంది. అందుకే ఈ కాలంలో నీరు ఎక్కువగా తాగాలి. తద్వారా డీహైడ్రేషన్‌ను నివారించవచ్చు. కానీ చక్కెర కలిపిన తీపి పానీయాలకు దూరంగా ఉండాలి. ఆల్కహాల్ కెఫిన్ వద్దు ఆల్కహాల్, కెఫిన్ ఆధారిత పానీయాలు నిర్జలీకరణానికి దారితీస్తాయి. ఎందుకంటే ఇవి అధిక మూత్రవిసర్జనకు కారణం అవుతాయి. ఈ పానీయాలు శరీరంలో నీటిని కోల్పోవడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడానికి దారితీస్తాయి. కాబట్టి అలాంటి డ్రింక్స్ తీసుకోవడం తగ్గించాలి. రక్తంలో చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఉండాలి వేసవిలో రక్తంలో చక్కెర స్థాయిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలి. వేడి వాతావరణంలో హృదయ స్పందన రేటు పెరిగి, అధిక చెమటలు పట్టవచ్చు. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుంది. అందుకే ఈ కాలంలో ఇన్సులిన్ మోతాదును మార్చుకోవాలి. ఇన్సులిన్ మోతాదును మార్చాలనుకుంటే వైద్యుడిని సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. శారీరకంగా చురుకుగా ఉండాలి శారీరకంగా చురుకుగా ఉండటం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చు. ఈ కాలంలో యాక్టివ్‌గా ఉండటానికి ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయాలి. ఇలాంటి చిన్నపాటి వ్యాయామాలు చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలో హెచ్చుతగ్గులు వస్తాయి. అందుకే వ్యాయామాలు చేసే ముందు, పూర్తి చేసిన తర్వాత దాన్ని పరీక్షించుకోవాలి. ఎండలో బయటకు వెళ్లకపోవడం బెటర్ రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడానికి వేసవి ఎండల నుంచి మిమ్మల్ని మీరు వీలైనంత ఎక్కువగా రక్షించుకోవాలి. వడదెబ్బ శరీరాన్ని ఒత్తిడికి గురి చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ఒకవేళ తప్పనిసరైతే చర్మానికి సన్ స్క్రీన్ రాసుకోవడంతోపాటు వడదెబ్బను నివారించడానికి టోపీ, సన్ గ్లాసెస్, గొడుగుతో బయటకు వెళ్లాలి. అలాగే, శరీరంలోని బహిర్గత భాగాలను కవర్ చేసేలా చూసుకోవాలి.

నినాదం

వారం 7 ఫిబ్రవరి 2026

# కాంగ్రెస్‌కు ఒక లక్ష్యం, ప్రణాళిక లేదు

**ఢిల్లీ:** రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగాన్ని వ్యతిరేకిస్తూ విపక్షాల వాకౌట్ చేశాయి. మరోవైపు.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై ప్రధాని మోదీ సెటైరికల్ కామెంట్స్ చేశారు. మీరు కూర్చునే నినాదాలు చేయొచ్చు అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తుండగా.. విపక్ష పార్టీల ఎంపీలు నిరసనతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే కూడా లేచి నిలబడి నిరసనలు తెలిపారు. దీంతో, మోదీ... వయసు రీత్యా ఖర్గే కూర్చుని నిరసనలు చేపట్టొచ్చని మోదీ అన్నారు. అనంతరం, రాజ్యసభ నుంచి విపక్ష నేతలు వాకౌట్ చేశారు. ముందు నన్ను మాట్లాడనివ్వాలంటూ విపక్షాలకు ప్రధాని మోదీ సూచించారు. మరోవైపు.. రాజ్యసభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఎన్డీయే హయాంలో భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా మారనుంది. దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు. గతంలో భారత్‌తో ఒప్పందానికి పలు దేశాలు ముందుకు వచ్చేవి కాదు. దేశం కోసం కాంగ్రెస్ ఎప్పుడూ పనిచేయలేదు. కాంగ్రెస్‌కు ఎప్పుడూ ఒక విజన్ లేదు. ఎన్డీయే హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. మా హయాంలో అనేక సంస్కరణలు చేపట్టాం.



కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి ఒక ఆలోచనా విధానంగానీ, దూరదృష్టి గానీ, ఎలాంటి ప్రణాళిక గానీ లేవని మండిపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని సమాధానం ఇచ్చారు.


ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీరుపైనా మండిపడ్డారు. తాను ప్రసంగిస్తున్న సమయంలో ఖర్గే సహా విపక్ష నేతలు నినాదాలు చేయడంతో ప్రధాని మోదీ ఈ విధంగా స్పందించారు. ప్రధాని ప్రసంగాన్ని వ్యతిరేకించిన విపక్ష సభ్యులు.. దేశంలో నియంతృత్వం నడవదంటూ నినాదాలు చేశారు. సభ్యుల నిరసన మధ్యే ప్రధాని మోదీ తన ప్రసంగం కొనసాగించారు. ఈ క్రమంలోనే విపక్ష సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు లోక్‌సభలో ప్రధాని మోదీని చుట్టుముట్టేందుకు కాంగ్రెస్ సభ్యులు ప్లాన్ చేసినట్లు తెలిసిందని స్పీకర్ ఓంబిర్లా పేర్కొన్నారు. విపక్షాల నిరసనల దృష్ట్యా ప్రధాని మోదీని సభకు రావొద్దని తానే సూచించానని ఆయన చెప్పారు. కాగా లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని సమాధానం ఇవ్వకపోవడం సిగ్గుచేటని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

భారత్ తొమ్మిది దేశాల్లో ట్రేడ్ డీల్ చేసుకుంది. అన్ని రకాల సవాళ్లను ఎదుర్కొవడానికి దేశం సిద్ధంగా ఉంది. యూపీఏ హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉండేది. ఇటీవలి కాలంలో దేశం శరవేగంగా పురోభివృద్ధి సాధిస్తోంది. అన్ని వర్గాల్లో మార్పు కనిపిస్తోంది. 27 దేశాలు, ఈయూతో అనేక ఒప్పందాలు చేసుకున్నాం' అని చెప్పుకొచ్చారు.

రాష్ట్రపతిని విపక్షాలు దారుణంగా అవమానించారు. దేశ అత్యున్నత పదవిని విపక్షాలు అవమానించాయి. దేశ అత్యున్నత పదవిని, రాజ్యాంగాన్ని, ఆదివాసీలను అవమానించారు. లోక్‌సభలో విపక్షాల ప్రవర్తన నన్నెంతో బాధపెట్టింది. స్పీకర్ కుర్చీలో కూర్చున్న దళితులను విపక్షాలు అవమానించాయి. అసోం ప్రజలు ఈ అవమానాన్ని ఎప్పటికీ మర్చిపోలేరు. కాంగ్రెస్ యువరాజు ఓ ఎంపీని ద్రోహి అన్నారు. అతనికి గర్వం తలకెక్కింది. కాంగ్రెస్ నుంచి ఎంతో మంది పార్టీని వీడారు. బిట్టు సిక్కు కావడంతో అతడిని అవమానించారు. సిక్కుల పట్ల ఎంత ద్వేషం ఉందో వారి మాటల్లో కనిపించింది అని మండిపడ్డారు.

## బాల కార్మికత్వం నిర్మూలన ఒక సామాజిక బాధ్యత





<u>హైదరాబాద్ న్యూస్ :-</u> బాల్యం అనేది ప్రతి పిల్లవాడి జీవితంలో అత్యంత విలువైన దశ. ఆ వయస్సులో పాఠశాలలు, పుస్తకాలు, ఆటపాటలు, కలలు ఉండాలి కానీ సమాజంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ చిన్నారులు చదువుకు దూరమై, కఠినమైన పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఇదే మన సమాజం ఎదుర్కొంటున్న పెద్ద సవాలు అని స్కోప్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న అన్నారు.

### బాల కార్మికత్వం లక్షణాలు..

పేదరికం, కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, అవగాహన లోపం, వలస జీవితం వంటి కారణాలు పిల్లలను పనిలోకి నెట్టేస్తున్నాయి. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లల చదువుకంటే తక్షణ ఆదాయానికే ప్రాధాన్యం ఇవ్వడం కూడా ఈ సమస్యకు ఒక కారణం. ఫలితంగా పిల్లల శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటోంది. భారత రాజ్యాంగం, బాలల హక్కుల చట్టాలు స్పష్టంగా చెప్పేది ఒక్కటే 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టడం నేరం. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో ఈ చట్టాలు పూర్తిగా అమలవడం లేదు. హోటళ్లలో, దుకాణాల్లో, పరిశ్రమల్లో, నిర్మాణ పనుల్లో, గృహ పనుల్లో ఇంకా అనేక మంది పిల్లలు కనిపిస్తూనే ఉన్నారు. బాల కార్మికత్వం వల్ల ఒక తరం భవిష్యత్తే అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. చదువు లేకుండా, నైపుణ్యాలు అభివృద్ధి చెందకుండా పెరిగే పిల్లలు రేపటి సమాజానికి బలమైన పౌరులుగా మారలేరు. అందుకే బాల కార్మికత్వం నిర్మూలన అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు మన అందరి సామాజిక బాధ్యత.

ఈ దిశగా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, పోలీస్ శాఖ, కార్మిక శాఖ కలిసి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఆపరేషన్ ముస్కాన్,ఆపరేషన్ స్మైల్ వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా పిల్లలను పనుల నుంచి విడిపించి, మళ్లీ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. అలాగే తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, సంక్షేమ పథకాలను అందించడం ద్వారా పిల్లల భవిష్యత్తును రక్షించే ప్రయత్నం జరుగుతోంది.

బాల కార్మికత్వ నిర్మూలన ఉద్యమంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సంస్థ అధినేత భువన్ రిభు దేశవ్యాప్తంగా బాలల హక్కుల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఆయన నాయకత్వంలో దేశవ్యాప్తంగా సుమారు 420 స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ విభాగాలు, పోలీస్ శాఖ, న్యాయవ్యవస్థ, స్వచ్ఛంద సంస్థలతో సమన్వయం చేసుకుని వేలాది బాల కార్మికులను రక్షించింది. నేటికీ రక్షిస్తుంది. భువన రిభు ప్రధాన విజయాల్లో బాల కార్మికత్వం, బాల అక్రమ రవాణా, బాల దోపిడీ వంటి సమస్యలపై దేశవ్యాప్తంగా అవగాహన పెంచడం ఒకటి. చట్టాల అమలును బలోపేతం చేయడంలో ఆయన చేసిన కృషి వల్ల అనేక రాష్ట్రాల్లో బాలల రక్షణ వ్యవస్థ మరింత ప్రభావవంతంగా మారింది. పిల్లలను కేవలం రక్షించడం మాత్రమే కాకుండా, వారికి పునరావాసం, విద్య, గౌరవమైన జీవితం అందేలా దీర్ఘకాలిక చర్యలు తీసుకోవడం ఈ సంస్థ ప్రత్యేకత.

### జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ చేపట్టిన కార్యక్రమాలు..

అనేకమంది పిల్లల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాయి. బాల్యం తిరిగి పొందిన ఆ చిన్నారుల చిరునవ్వులే ఈ ఉద్యమానికి నిజమైన విజయ సూచికలు.

### బాల కార్మికత్వం నివారణకు సూచనలు / మార్గాలు..

1. విద్యకు ప్రాధాన్యం: ప్రతి పిల్లవాడిని తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించి, నిరంతరంగా చదువు కొనసాగించేలా చూడాలి. 2. తల్లిదండ్రులకు అవగాహన: బాల కార్మికత్వం వల్ల కలిగే నష్టాలపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. 3. పేదరిక నిర్మూలన పథకాలు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలి.

4. చట్టాల కఠిన అమలు: బాల కార్మికులను నియమించే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

5. సామాజిక భాగస్వామ్యం: గ్రామస్థాయి కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పిల్లల రక్షణకు కృషి చేయాలి.

6. వలస కుటుంబాలపై ప్రత్యేక దృష్టి: వలస కార్మికుల పిల్లలకు ప్రత్యేక విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయాలి.


7. ఫిర్యాదు వ్యవస్థ బలోపేతం: బాల కార్మికులు కనిపిస్తే చైల్డ్‌లైన్ 1098 లేదా సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలి. 8. పునరావాసం, కౌన్సిలింగ్: పనుల నుంచి విడుదలైన పిల్లలకు కౌన్సిలింగ్, బ్రిడ్జ్ కోర్సులు అందించాలి. 9. మీడియా అండ్ ప్రచారం: బాల కార్మికత్వం వ్యతిరేక సందేశాలను మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి. 10. పిల్లల హక్కుల పరిరక్షణ ప్రతి చిన్నారికి భద్రత, గౌరవం, సమాన అవకాశాలు కల్పించే వాతావరణం రూపొందించాలి.

### బాలల హక్కుల కోసం అంకితమైన నాయకుడు భువన్ రిభు..

పిల్లల హక్కుల పరిరక్షణ అనేది కేవలం ఒక కార్యక్రమం కాదు, అది ఒక ఉద్యమం. ఆ ఉద్యమానికి భారతదేశంలో బలమైన నాయకత్వాన్ని అందిస్తున్న వ్యక్తి జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) ప్రాజెక్ట్ అధినేత భువన్ రిభు. ఆయన తన జీవితాన్ని బాలల హక్కుల కోసం అంకితం చేసి, వేలాది మంది పిల్లల జీవితాల్లో వెలుగులు నింపారు. భువన్ రిభు భారతదేశంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల అక్రమ రవాణా నివారణ, బాలల రక్షణ, పునరావాసం వంటి అంశాలపై అహర్నిశలు కృషి చేస్తున్నారు. పిల్లలు పని చేయడానికి కాదు, చదవడానికి, ఆడుకోవడానికి, గౌరవంతో జీవించడానికి పుట్టారని ఆయన బలంగా నమ్ముతారు.

ఈ ఆలోచనతోనే ఆయన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) అనే జాతీయ స్థాయి ఉద్యమాన్ని స్థాపించారు. ఈ వేదిక ద్వారా దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖలు, పోలీస్ విభాగాలు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, స్వచ్ఛంద సంస్థల మధ్య సమన్వయం ఏర్పడి, పిల్లల రక్షణ మరింత ప్రభావవంతంగా మారింది. భువన్ రిభు నాయకత్వంలో వేల సంఖ్యలో బాల కార్మికులను రక్షించి, వారికి విద్య, పునరావాసం, భద్రత కల్పించారు. అలాగే ఆపరేషన్ స్మైల్, పిల్లల అక్రమ రవాణా కార్యక్రమాల అమలులో ఆయన కీలక మార్గదర్శకుడిగా నిలిచారు. ఈ కార్యక్రమాల ద్వారా కనిపించకుండా పోయిన పిల్లలను గుర్తించి, వారి కుటుంబాలకు తిరిగి చేర్చడం సాధ్యమైంది. పిల్లల హక్కుల పరిరక్షణలో చట్టాల అమలు చాలా ముఖ్యమని గుర్తించిన భువన్ రిభు, సంబంధిత అధికారులకు శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ చట్టాల బలోపేతానికి కూడా విశేషంగా కృషి చేశారు. గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు బాలల పరిరక్షణ వ్యవస్థను బలోపేతం చేయడమే ఆయన లక్ష్యం. ఆయన చేసిన సేవలకు గాను దేశీయంగా, అంతర్జాతీయంగా అనేక ప్రశంసలు లభించాయి. అయినప్పటికీ, అవార్డుల కంటే ఒక పిల్లవాడి చిరునవ్వే తనకు గొప్ప గుర్తింపని ఆయన భావిస్తారు."పిల్లల భవిష్యత్తే దేశ భవిష్యత్తు" అనే నినాదంతో భువన్ రిభు సమాజాన్ని నిరంతరం చైతన్యపరుస్తూ ముందుకు సాగుతున్నారు. భువన్ రిభు వంటి నాయకుల కృషి వల్లే నేడు వేలాది మంది పిల్లలు బాల్యాన్ని కోల్పోకుండా, హక్కులతో కూడిన జీవితం పొందుతున్నారు. ఆయన సేవలు పిల్లల హక్కుల ఉద్యమంలో ఒక ప్రేరణగా నిలుస్తాయి.

## కుట్రతోనే ప్రధాని సీటును కాంగ్రెస్ ఎంపీలు చుట్టుముట్టారు



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ ఎంపీలు కుట్రతోనే ప్రధాని మోదీ సీటును చుట్టుముట్టారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆరోపించారు. అందుకే ఆయన భద్రత దృష్ట్యా సభకు రావద్దని ప్రధానికి సలహా ఇచ్చానని చెప్పారు. దీంతో ప్రసంగాన్ని మోదీ రద్దు చేసుకున్నారని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై ప్రధాని మోదీ లోక్‌సభలో బుధవారం ప్రసంగించాల్సి ఉన్నది. అయితే దీనికి ముందు సభలో గందరగోళం చెలరేగింది. ప్రతిపక్షాలకు చెందిన మహిళా ఎంపీలు ప్రధాని సీటు ముందు నిల్చొని నిరసన తెలిపారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ వాయిదా పడింది. కాగా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ సంఘటనపై సభలో గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఎంపీలు తన చైర్‌ను చుట్టుముట్టి దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపించారు. ప్రధాని ప్రసంగ సమయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష ఎంపీలు గందరగోళం సృష్టించడానికి ప్రయత్నించవచ్చని తనకు ముందే సమాచారం ఉన్నట్లు తెలిపారు. 'కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు ప్రధానమంత్రి సీటు వద్దకు వెళ్లి ఊహించని సంఘటనకు పాల్పడవచ్చని నాకు విశ్వసనీయ సమాచారం అందింది. అలాంటి సంఘటన జరిగి ఉంటే, అది దేశ గౌరవానికి తీవ్ర నష్టం కలిగించి ఉండేది. అందుకే ప్రధానమంత్రిని పార్లమెంటుకు రావద్దని నేను కోరా' అని అన్నారు. మరోవైపు రాజకీయ విభేదాలను స్పీకర్ కార్యాలయం వరకు తీసుకురావడం ఈ సభ సంప్రదాయం కాదని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. లోక్‌సభలో బుధవారం జరిగిన సంఘటన పార్లమెంటు చరిత్రలో ఒక మాయని మచ్చ అని అన్నారు.

## బొగ్గు గనిలో పేలుడు.. 10 మంది మృత్యువాత



మేఘాలయలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తాష్టై ప్రాంతంలోని ఓ బొగ్గు గనిలో గురువారం పేలుడు సంభవించడంతో, కనీసం 10 మంది కార్మికులు మరణించారు. ఈ దుర్ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. వార్తా సంస్థల కథనాల ప్రకారం, గని లోపల ఈ పేలుడు జరగడంతో కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా అసోం రాష్ట్రానికి చెందిన వలస కార్మికులుగా అధికారులు అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిని కటిగొరా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ దుర్ఘటన గురించి తెలియగానే మేఘాలయ పోలీసులు, సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గనిలోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. మేఘాలయలో తరచూ జరుగుతున్న చట్టవిరుద్ధమైన 'ర్యాట్-హోల్' మైనింగ్ వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభమైంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో బంగ్లాదేశ్‌తో సరిహద్దు వెంబడి కంచె నిర్మాణం కోసం కేంద్రానికి భూమి ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు. అయితే అంతకంటే ముందు బీఎస్ఎఫ్ అధికార పరిధిని 15 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్లకు పెంచుతూ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సరిహద్దులో కంచె ఏర్పాటును అడ్డుకుంటోందని కేంద్రం, బీజేపీ నేతలు చేసిన ఆరోపణలను ఆమె కొట్టిపారేశారు. బీఎస్ఎఫ్‌తో సహా అన్ని కేంద్ర సంస్థలు, ఏజెన్సీలకు ఇప్పటికే భూమిని అందించామని తెలిపారు. దేశ భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మమతా బెనర్జీ అన్నారు. కంచె విషయంలో భూమి అనేది సమస్య కానే కాదని అన్నారు. ఎంత భూమి అవసరమైతే అంత కేటాయిస్తామని, కానీ బీఎస్ఎఫ్ అధికార పరిధిపై నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. కంచె విషయంలో కొన్ని వాస్తవాలనే బీజేపీ ప్రజల ముందు ఉంచుతోందని ఆరోపించారు. రాష్ట్రం ఇప్పటికే ఎంత భూమిని ఇచ్చిందనే వివరాలను కేంద్ర మంత్రి అమిత్ షా వెల్లడించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాల్‌లో చొరబాట్లు ముప్పుగా పరిణమించాయని, కంచె కోసం భూమి కోరుతూ కోంద్రం పలుమార్లు లేఖలు రాసినా ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదని ప్రతిపక్ష నేత సువెందు అధికారి ఆరోపించారు. అయితే చొరబాట్లపై సాక్ష్యాలను చూపించాలని మమతా బెనర్జీ సవాల్ చేశారు. కంచె కోసం ఇప్పటికే కేటాయించిన భూమిలో ముందుగా పనులు పూర్తి చేయాలని సూచించారు.

## అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందంపై త్వరలో ఉమ్మడి ప్రకటన

భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందంపై త్వరలో ఉమ్మడి ప్రకటన ఉంటుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. రెండు దేశాల మధ్య జరిగిన అతిపెద్ద ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో ఇది మొదటి అంకమని ఆయన అన్నారు. రెండు దేశాల నుంచి వచ్చే వారంలో సంయుక్త ప్రకటన వెలువడుతుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఒప్పందానికి సంబంధించి ముసాయిదా తుది రూపు సిద్ధమవుతోందని పీయూష్ గోయల్ అన్నారు. ఈ ఒప్పందానికి సంబంధించి మార్చి నెల మధ్యలో సంతకాలు జరిగే అవకాశముందని వెల్లడించారు. ఉమ్మడి ప్రకటన వెలువడిన అనంతరం, భారతదేశంపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తూ అమెరికా ఒక కార్యనిర్వాహక ఉత్తర్వును విడుదల చేస్తుంది. మూడు రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడడం తెలిసిందే. అనంతరం ట్రంప్ "భారతదేశానికి చెందిన ఉత్పత్తులపై ఇక నుంచి అమెరికాలో 18 శాతం సుంకాలు మాత్రమే ఉంటాయి" అని పోస్టు చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి ఆమోదం తెలిపినట్టు ప్రకటించారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం
శనివారం 07 - 02 - 2026

# ఆర్‌బీఐ కీలక నిర్ణయం- వడ్డీ రేట్లు యథాతథం

## వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతూ నిర్ణయం తీసుకున్న ఆర్‌బీఐ




దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా సాగుతుందన్న విశ్వాసంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష అనంతరం గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ఉదయం నిర్ణయాలను వెల్లడించారు. రెపో రేటును 5.25 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. కేంద్ర బడ్జెట్ అనంతరం నిర్వహించిన తొలి సమీక్ష కావడంతో నిర్ణయంపై మార్కెట్లు ఆసక్తిగా ఎదురుచూశాయి.గతేడాది పలుమార్లు వడ్డీరేట్లలో కోతలు విధించిన ఆర్‌బీఐ ఈసారి మాత్రం వేచి చూద్దాం అనే ధోరణి అవలంబించిందని చెప్పాలి. ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణం మధ్య సమతౌల్యం సాధించడమే లక్ష్యమని ఆర్‌బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రేట్లను మార్చాల్సిన అవసరం లేదని భావించినట్లు తెలిపారు.

### గత ఏడాది వరుస కోతలు

2025లో ఆర్‌బీఐ వడ్డీరేట్లలో గణనీయమైన మార్పులు చేసింది. ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లో ఒక్కోసారి 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అనంతరం జూన్‌లో 50 బేసిస్ పాయింట్ల భారీ కోత విధించింది. డిసెంబరులో మరో 25 శాతం తగ్గించడంతో మొత్తం ఏడాదిలో రెపో రేటు 1.25 శాతం వరకు తగ్గింది. ఈ తగ్గింపులతో రుణాలు చౌకగా మారి వినియోగం, పెట్టుబడులు పెరిగేలా చర్యలు తీసుకుంది. ఇప్పుడు ఆ ప్రభావాన్ని అంచనా వేసే దశలో ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### వృద్ధి అంచనాలు ఆశాజనకం

దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని ఆర్‌బీఐ గవర్నర్ పేర్కొన్నారు. కార్పొరేట్ రంగంలో లాభాలు మెరుగుపడటం, అసంఘటిత రంగంలో స్థిరత్వం పెరగడం, తయారీ రంగానికి ఊతమివ్వనున్నాయని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధిరేటు 7.4 శాతం నమోదవుతుందని అంచనా వేశారు.వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో కూడా వృద్ధి కొనసాగుతుందని భావిస్తున్నారు. తొలి త్రైమాసికంలో 6.9 శాతం, రెండో త్రైమాసికంలో 7 శాతం వృద్ధి నమోదవ్వొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ, దేశీయ డిమాండ్ బలంగా ఉండటం ప్రధాన బలం అని తెలిపారు.

### ద్రవ్యోల్బణం అదుపులోనే

ద్రవ్యోల్బణం కూడా నియంత్రణలోనే ఉందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సగటు ద్రవ్యోల్బణం 2.1 శాతం ఉండొచ్చని అంచనా. అయితే వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో 4 శాతం, రెండో త్రైమాసికంలో 4.2 శాతం వరకు పెరగవచ్చని భావిస్తున్నారు. అయినప్పటికీ ఇది ఆర్‌బీఐ లక్ష్య పరిధిలోనే ఉందని గవర్నర్ తెలిపారు.

### వాణిజ్య ఒప్పందాల ప్రభావం

భారత్ ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, త్వరలో కుదిరే భారత్ అమెరికా ట్రేడ్ డీల్ దేశ ఆర్థిక వృద్ధికి మరింత బలం చేకూరుస్తాయని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. ఎగుమతులు పెరగడంతో పాటు విదేశీ పెట్టుబడులు పెరిగే అవకాశముందని తెలిపింది. అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ పాత్ర మరింత విస్తరించనుందని గవర్నర్ వ్యాఖ్యానించారు.

### ఫారెక్స్ నిల్వలు బలంగా

దేశ విదేశీ మారక నిల్వలు కూడా బలంగా ఉన్నాయని ఆర్‌బీఐ వెల్లడించింది. జనవరి చివరి నాటికి ఫారెక్స్ నిల్వలు 723.8 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇది గ్లోబల్ అనిశ్చిత పరిస్థితుల్లో దేశానికి రక్షణ కవచంలా పనిచేస్తుందని పేర్కొన్నారు. అలాగే బ్యాంకింగ్ వ్యవస్థలో రోజువారీ సగటున రూ.75 వేల కోట్ల మేర ద్రవ్య లభ్యత ఉందని తెలిపారు.

### సామాన్యులపై ప్రభావం?

రెపో రేటులో మార్పు లేకపోవడంతో బ్యాంకుల రుణ వడ్డీరేట్లు తక్షణం పెరగడం లేదా తగ్గడం జరగకపోవచ్చు. గృహ రుణాలు, వాహన రుణాలు తీసుకునే వారికి ప్రస్తుతం ఉన్న రేట్లే కొనసాగుతాయి. అలాగే డిపాజిట్ రేట్లలో కూడా పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. మొత్తంగా ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందన్న నమ్మకంతో ఆర్‌బీఐ స్థిరత్వానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తాజా నిర్ణయం స్పష్టంగా తెలియజేస్తోంది. రాబోయే నెలల్లో ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ పరిస్థితులను బట్టి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు సంకేతాలు కూడా ఇచ్చింది.

# బంగారం, వెండి ధరలు మళ్లీ ఢమాల్

## ఇవాళ బంగారం, వెండి ధరలు భారీగా పతనం

## 10 గ్రాముల బంగారం రూ. 1.52 లక్షలకు క్షీణత

## రూ. 2.47 లక్షలకు పడిపోయిన కిలో వెండి ధర

## ఎంసీఎక్స్‌లో వెండి ఫ్యూచర్స్ 10 శాతం పతనమైన వైనం

## బలహీన అంతర్జాతీయ సంకేతాలే పతనానికి కారణం




దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఈ రోజు భారీగా కుప్పకూలాయి. రెండు రోజులుగా కొనసాగుతున్న లాభాలకు బ్రేక్ పడింది. ఇండియా బులియన్స్ వెబ్‌సైట్ ప్రకారం కిలో వెండి ధర రూ. 2.47 లక్షలకు పడిపోగా, 10 గ్రాముల బంగారం ధర స్వల్పంగా తగ్గి రూ. 1.52 లక్షల వద్దకు చేరింది. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, డాలర్ బలపడటం వంటి కారణాలతో ఈ పతనం చోటుచేసుకుంది.గత రెండు రోజులుగా లాభాల్లో పయనించిన వెండి, గురువారం నాటి మార్కెట్ క్రాష్ తర్వాత కోలుకోలేకపోయింది. స్పాట్ మార్కెట్లో వెండి ధర ఏకంగా 20 శాతం పతనమై ఔన్సుకు 71 డాలర్ల దిగువకు చేరింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో మార్చి నెల వెండి ఫ్యూచర్స్ ఏకంగా రూ. 26,850 (10శాతం) తగ్గి కిలో రూ. 2,42,000 వద్ద ట్రేడ్ అయింది. అంతకుముందు సెషన్‌లో దీని ధర రూ. 2,68,850గా ఉంది. బంగారం ఫ్యూచర్స్‌లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఏప్రిల్ కాంట్రాక్ట్ రూ. 2,310 (1.51శాతం) తగ్గి 10 గ్రాములు రూ. 1,50,736 వద్ద ముగిసింది.గత నెలలో స్పెక్యులేటివ్ ట్రేడింగ్, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి కారణాలతో బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. అయితే, ఈ పెరుగుదల ఎక్కువ కాలం నిలవదని, ధరలు చాలా వేగంగా పెరిగాయని విశ్లేషకులు హెచ్చరించారు. వారి అంచనాలకు అనుగుణంగానే గత వారం నుంచి మార్కెట్లలో భారీ దిద్దుబాటు మొదలైంది.

**ప్రధాన నగరాల్లో ధరలు ఇలా..**

దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,52,180గా ఉండగా, ఢిల్లీలో రూ. 1,51,910గా ఉంది. దక్షిణ భారత నగరాల్లో ధరలు అత్యధికంగా ఉన్నాయి. చెన్నైలో తులం బంగారం ధర రూ. 1,52,620 కాగా, హైదరాబాద్‌లో రూ. 1,52,420, బెంగళూరులో రూ. 1,52,300గా నమోదైంది.వెండి విషయానికొస్తే, చెన్నైలో కిలో వెండి ధర అత్యధికంగా రూ. 2,47,590గా ఉంది. హైదరాబాద్‌లో రూ. 2,47,260, బెంగళూరులో రూ. 2,47,060 వద్ద ట్రేడ్ అవుతోంది. ముంబైలో కిలో వెండి ధర రూ. 2,46,870గా, ఢిల్లీలో రూ. 2,46,440గా ఉంది. కోల్‌కతాలో రూ. 2,46,540 వద్ద కొనసాగుతోంది.

# వెజ్, నాన్‌వెజ్ థాలీ ధరలు తగ్గినయ్..! క్రిసిల్ రోటీ రైస్ నివేదిక ఏం చెప్పిందంటే..?



వెజ్, నాన్ వెజ్ థాలీ ధరల్లో ఘననీయమైన తగ్గుదల నమోదైంది. ఈ ఏడాది ఆగస్టు మాసంలో వెజ్ థాలీ ధరల్లో 7 శాతం, నాన్ వెజ్ థాలీ ధరల్లో 8శాతం తగ్గిందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ తాజా రోటీ రైస్ నివేదిక వెల్లడించింది. వెజ్, నాన్ వెజ్ థాలీ ధరల్లో ఘననీయమైన తగ్గుదల నమోదైంది. ఈ ఏడాది ఆగస్టు మాసంలో వెజ్ థాలీ ధరల్లో 7 శాతం, నాన్ వెజ్ థాలీ ధరల్లో 8శాతం తగ్గిందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ తాజా రోటీ రైస్ నివేదిక వెల్లడించింది. ఉల్లిపాయ,ంగాళాదుంప, పప్పుధాన్యాల ధరలు గణనీయంగా తగ్గడం వల్ల శాఖాహార థాలీ ధరలు తగ్గుముఖం పట్టినట్లుగా నివేదిక పేర్కొంది.బంగాళాదుంపలు 31శాతం, ఉల్లిపాయల ధరలు వరుసగా 37శాతం తగ్గాయి. బంగాళాదుంప ఉత్పత్తి సవాళ్లను ప్రస్తావిస్తూ.. ఏడాది కిందట బంగాళదుంప ఉత్పత్తి 5 నుంచి 7 శాతం తగ్గాయని.. ఫలితంగా ధర పెరిగిందని నివేదిక వెల్లడించింది. ఈ సంవత్సరం ఉత్పత్తి 3 నుంచి 5శాతం పెరుగుతుందని అంచనా. నివేదిక ప్రకారం.. ఈ సంవత్సరం ఉల్లిపాయల వార్షిక ఉత్పత్తిలో 18-20శాతం పెరగడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి.పప్పుధాన్యాల ధరలు సంవత్సరానికి 14శాతం తగ్గాయి. గత సంవత్సరంతో పోలిస్తే అధిక ఉత్పత్తి, పెరిగిన స్టాక్ లెవల్స్ కారణంగా ఇది సాధ్యమైందని నివేదిక వెల్లడించింది. పండుగ సీజన్ ప్రారంభంలో డిమాండ్ పెరగడంతో కూరగాయల నూనె ధరలు గత సంవత్సరంతో పోలిస్తే 24శాతం పెరిగాయి. అయితే, ఎల్పీజీ సిలిండర్ ధరలు గత సంవత్సరంతో పోలిస్తే 6శాతం పెరిగాయి. ఈ క్రమంలో వెజ్ థాలీ ధరల్లో తగ్గుదల పరిమితంగా ఉందని క్రిసిల్ పేర్కొంది. ఇక మాంసాహార థాలీ ధర తగ్గడానికి కారణం బ్రాయిలర్ చికెన్ ధరలు గత సంవత్సరంతో పోలిస్తే 10శాతం తగ్గమే కారణమని చెప్పింది. నాన్‌వెజ్ థాలీ ధరలో వాటి ధరే 50శాతం వాటా కలిగి ఉందని.. కూరగాయల, పప్పుధాన్యాల ధరలు తగ్గడం కూడా కారణమని నివేదిక తెలిపింది.అయితే, నెలవారీ ప్రాతిపదికన ఆగస్టులో శాఖాహారం, మాంసాహార థాలీ ధరలు వరుసగా 4శాతం, 2శాతం పెరిగాయి. శ్రావణ మాసం ముగింపు తర్వాత డిమాండ్ పెరిగినప్పటికీ.. బ్రాయిలర్స్ సరఫరా ఎక్కువగా ఉండడంతో థాలీ ధరల పెరుగుదల పరిమితంగా ఉందని నివేదిక పేర్కొంది. ఇది నెలవారీ ప్రాతిపదికన ధరల్లో స్థిరత్వం ఉందని చెప్పింది. వినియోగదారుల ధరల సూచిక (%జూ×%).. భారతదేశ రిటైల్ ద్రవ్యోల్బణం జూలై 2025లో వార్షిక ప్రాతిపదికన 1.55 శాతానికి తగ్గింది. జూన్ 2017 తర్వాత అత్యల్ప స్థాయికి చేరడం ఇదే తొలిసారి. కన్స్యూమర్ ఫుడ్ ప్రైస్ ఇండెక్స్ (%జఫీూ×%) ఆధారంగా ఆహార ద్రవ్యోల్బణం.. జూన్‌లో 1.01 శాతంతో పోలిస్తే జూలైలో -1.76 శాతానికి తగ్గింది. జనవరి 2019 తర్వాత ఇది అత్యల్ప స్థాయి ఆహార ద్రవ్యోల్బణం. పప్పుధాన్యాలు, ఉత్పత్తులు, కూరగాయలు, తృణధాన్యాలు, గుడ్లు, చక్కెర, స్వీట్లు.. అలాగే రవాణా, కమ్యూనికేషన్ సేవల ధరలలో విస్తృత స్థాయిలో తగ్గుదల కారణంగా ధరలు తగ్గాయి. ఆగస్టు నెలకు రిటైల్ ద్రవ్యోల్బణ డేటా శుక్రవారం విడుదల కానుంది

# 20 లక్షలు తగ్గనున్న లెక్సస్ కారు వాహనాలపై జీఎస్టీని





తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా మరో అరడజన్ వాహన సంస్థలు తమ వాహన ధరలను తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. వాహనాలపై జీఎస్టీని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా మరో అరడజన్ వాహన సంస్థలు తమ వాహన ధరలను తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. వీటిలో కియా ఇండియా, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్, ఆడీ, నిస్సాన్, లెక్సస్, టీవీఎస్‌లు ఉన్నాయి.కియా, ఎంజీ మోటర్, ఆడీ ధరలు వెంటనే అమలులోకి రాగా, కానీ నిస్సాన్, లెక్సస్ వాహన ధరలు మాత్రం ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్నాయి. టీవీఎస్ మోటర్ వాహన ధరలను తగ్గించేదానిపై కసరత్తు చేస్తున్నది.కియా ఆయా మాడళ్లను బట్టి రూ.48,513 నుంచి రూ.4,48,542 వరకు తగ్గించింది.జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ మాడళ్ల ధరలను రూ.54 వేల నుంచి రూ.3.04 లక్షల వరకు దించింది.ఆడీ ఇండియా తమ వాహన ధరలను రూ.2.6 లక్షల నుంచి రూ.7.8 లక్షల వరకు కోత విధించింది.నిస్సాన్ మోటర్ కాంప్యాక్ట్ ఎస్‌యూవీ మాగ్నైట్ మాడల్ ధరను లక్ష రూపాయల వరకు దించింది. ఈ రేటు 22 నుంచి అమలులోకి రానున్నాయి.లెక్సస్ ఇండియా కూడా తన లగ్జరీ కార్ల ధరలను రూ.1.47 లక్షల నుంచి రూ.20.8 లక్షల వరకు తగ్గించింది. ఈ రేట్లు 22 నుంచి అమలులోకి రానున్నాయని ఒక ప్రకటనలో వెల్లడించింది

# ఐటీఆర్ గడువు పొడిగించండి ఆదాయ పన్ను రిటర్న్




(ఐటీఆర్)ల దాఖలుకున్న గడువు వచ్చే వారం ముగియనున్న క్రమంలో దాన్ని పొడిగించాలన్న డిమాండ్లు అంతటా పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి.ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ల దాఖలుకున్న గడువు వచ్చే వారం ముగియనున్న క్రమంలో దాన్ని పొడిగించాలన్న డిమాండ్లు అంతటా పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఐటీఆర్ దాఖలుకున్న గడువు ఈ నెల (సెప్టెంబర్) 15తో ముగుస్తున్నది. అయితే సాంకేతిక, డాటా సరిపోలని సమస్యలు రిటర్న్ దాఖలుదారులను వేధిస్తున్నాయి.ఈ నేపథ్యంలోనే గడువును పొడిగించాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ)ను వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులతోపాటు వాణిజ్య, ప్రొఫెషనల్ సంఘాలు కోరుతున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికీ తీసుకెళ్తున్నారు. చివరకు ఐటీ శాఖ పనితీరు, ఏర్పాట్లపై సొంత పార్టీ నేతల నుంచీ మోదీ సర్కారుకు సెగ తగులుతుండటం గమనార్హం.కాగా, ఈ నెల 7 నాటికి కేవలం 4.89 కోట్ల ఐటీఆర్‌లే దాఖలైనట్టు ఆదాయ పన్ను శాఖ పోర్టల్ గణాంకాలు చెప్తున్నాయి. నిజానికి 13.35 కోట్ల మంది వ్యక్తిగత రిజిస్టర్డ్ యూజర్లున్నారు. ఇక వెరిఫై జరిగిన రిటర్నులు 4.63 కోట్లుగానే ఉన్నాయి. వీటిలో 3.35 కోట్ల రిటర్నుల ప్రాసెస్ మాత్రమే జరిగినట్టు అధికారిక లెక్కల్ని చూస్తే అర్థమవుతున్నది. ఇప్పటికే బాంబే చార్టర్డ్ అకౌంటెంట్స్ సొసైటీ.. ఈ సమస్యలపై సీబీడీటీకి లేఖ రాసింది. ఐటీఆర్ దాఖలుకున్న గడువును పొడిగించాలని డిమాండ్ చేసింది.యాన్యువల్ ఇన్ఫర్మేషన్ స్టేట్‌మెంట్ (ఏఐఎస్), ట్యాక్స్‌పేయర్ ఇన్ఫర్మేషన్ సమ్మరీ (టీఐఎస్), ఫామ్ 26ఏఎస్‌లో డాటా మిస్‌మ్యాచ్‌లుంటున్నాయని చార్టర్డ్ అకౌంటెంట్లు, ట్యాక్స్ అడ్వకేట్స్, కన్సల్టెంట్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు

# బైబ్యాక్‌పై 11న ఇన్ఫీ నిర్ణయం దేశీయ రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ




ఇన్ఫోసిస్..బైబ్యాక్ ప్రతిపాదనపై ఈ నెల 11న బోర్డు సమావేశమై తుది నిర్ణయం తీసుకోనున్నది. దేశీయ రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్..బైబ్యాక్ ప్రతిపాదనపై ఈ నెల 11న బోర్డు సమావేశమై తుది నిర్ణయం తీసుకోనున్నది.మార్కెట్ నియంత్రణ మండలి సెబీ 2018 నిబంధనలకు లోబడి బైబ్యాక్ ప్రతిపాదనపై ఈ నెల 11న బోర్డు సమావేశమై నిర్ణయం తీసుకోనున్నట్టు బీఎస్‌ఈకి సంస్థ సమాచారం అందించింది. 2022లో సంస్థ రూ.9,300 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తిరిగి కొనుగోలు చేసింది

# ఐపీవోకి ఎల్‌జీ!

కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజాల్లో ఒకటైన ఎల్‌జీ అనుబంధ సంస్థయైన ఎల్‌జీ ఇండియా స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ అనుమతినిచ్చింది కూడా. ఈ ఐపీవో ద్వారా గరిష్ఠంగా రూ.15 వేల కోట్ల నిధులను సమీకరించాలనుకుంటున్నది. కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజాల్లో ఒకటైన ఎల్‌జీ అనుబంధ సంస్థయైన ఎల్‌జీ ఇండియా స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ అనుమతినిచ్చింది కూడా. ఈ ఐపీవో ద్వారా గరిష్ఠంగా రూ.15 వేల కోట్ల నిధులను సమీకరించాలనుకుంటున్నది. దీంతో ఈ ఏడాది వచ్చిన ఐపీవోల్లో ఇదే అతిపెద్దది మార్కెట్లో లిస్ట్ అయిన రెండో అతిపెద్ద కొరియా కంపెనీగా ఎల్‌జీ నిలువనున్నది. మరోవైపు, ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటి వరకు 30 సంస్థలు ఐపీవోకి రాగా, మొత్తంగా రూ.60 వేల కోట్ల నిధులను సమీకరించాయి. ఇప్పటి వరకు వచ్చిన అతిపెద్ద ఐపీవోల్లో హెచ్‌డీఈ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.12,500 కోట్ల నిధులను సేకరించింది. దీంతోపాటు వచ్చేకొన్ని నెలల్లో టాటా క్యాపిటల్ రూ.17,200 కోట్ల నిధులు సమీకరించనుండగా, గ్రోవ్, మీషో, ఫోన్‌పే, బోట్, వీవర్క్ ఇండియా, లెన్స్‌కార్ట్, షాడోఫాక్స్, ఫిజిక్స్ వాలా ఉన్నాయి

నినాదం
నిఖార్సైన జర్నలిజం
శనివారం 07 - 02 - 2026



# సందేశంతో సుమతీ శతకం

అమర్దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటించిన ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'సుమతీ శతకం' నేడు ప్రేక్షకుల ముందుకురాబోతున్నది. ఎం.ఎం.నాయుడు దర్శకత్వంలో సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నది. ఈ సందర్భంగా గురువారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సకుటుంబ కథా చిత్రమిదని, వినోదానికి పెద్దపీట వేశామని హీరో అమర్దీప్ చౌదరి అన్నారు. ఈ కథలో అంతర్లీనంగా చక్కటి సందేశం ఉంటుందని దర్శకుడు ఎం.ఎం.నాయుడు పేర్కొన్నారు. అందరికి అందుబాటులో ఉండేందుకు సింగిల్ స్క్రీన్స్‌లో 100, మల్టీప్లెక్స్‌లో 150 రూపాయలుగా టికెట్ ధరలను నిర్ణయించామని నిర్మాత తెలిపారు. టేస్టీ తేజ, మహేష్ విట్ట, జేడీవీ ప్రసాద్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, రచన-దర్శకత్వం: ఎం.ఎం.నాయుడు.

# రియా చక్రవర్తి రీఎంట్రీ

బాలీవుడ్ హీరో సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య ఉదంతం యావత్ దేశాన్ని కలచివేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయన ప్రేయసి రియా చక్రవర్తి జైలు జీవితాన్ని గడిపారు. అయితే సుశాంత్ ఆత్మహత్య విషయంలో రియా చక్రవర్తికి ఏం సంబంధం లేదని తీర్పు వెలువరిస్తూ గత ఏడాది సీబీఐ కేసును మూసి వేసింది. ఈ నేపథ్యంలో గత ఏడాది కాలంగా బాలీవుడ్‌లో రీ ఎంట్రీ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది రియా చక్రవర్తి. చివరకు నెట్‌ఫ్లిక్స్ ఫ్యామిలీ బిజినెస్ వెబ్ సిరీస్‌లో అవకాశం దక్కించుకుంది. ఇటీవలే ఈ సిరీస్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రియా చక్రవర్తి సోషల్‌మీడియాలో ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. ఏడేళ్ల విరామం తర్వాత తిరిగి కెమెరా ముందుకు రావడం ఆనందంగా ఉందని, ఈ క్షణాలను నమ్మలేకపోతున్నానని, కెరీర్ ముగిసిపోతుందనుకునే తరుణంలో తన ధైర్యమే కాపాడిందని రియా చక్రవర్తి పోస్ట్‌లో పేర్కొంది.







# ఉదయ్‌పూర్‌లో పెళ్లి

## 26న విజయ్-రష్మికల వివాహం

గత ఏడాది అక్టోబరులో విజయ్ దేవరకొండ రష్మికా మందన్నాల నిశ్చితార్థం జరిగినప్పట్నుంచి వీరి వివాహ తేదీ ఎప్పుడు? అనే విషయంపై చర్చ మొదలైంది. ఈ నెల 26న ఈ ప్రేమికులు... భార్యాభర్తలు కానున్నారు. రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్ వీరి పెళ్లికి వేదిక కానుంది. ఇంకా 20 రోజులే ఉన్నందున ఇటు విజయ్ అటు రష్మిక కుటుంబ సభ్యులు జోరుగా పెళ్లి పనులతో బిజీగా ఉన్నారు. ఇరువైపు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ పెళ్లి జరగనుంది. అలాగే హైదరాబాద్‌లో మార్చి 4న సినీ, రాజకీయ ప్రముఖులు, ఇతర సన్నిహితుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయాలనుకుంటున్నారని సమాచారం. ఇక గతంలో 'గీత గోవిందం, డియర్ కామ్రేడ్' చిత్రాల్లో విజయ్‌రష్మిక జంటగా నటించిన సంగతి గుర్తుండే ఉంటుంది. తాజాగా వీరి కాంబినేషన్‌లో మూడో సినిమాగా 'రణబాలి' రూపొందుతోంది. ఈ చిత్రం సెప్టెంబరు 11న విడుదల కానుంది.

# అలా జరగాలని కోరుకోండి!

అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. పునర్జన్మలతో ముడిపడిన ఈ కథలో అల్లు అర్జున్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారని సమాచారం. ఈ సినిమాలో కథానాయికగా దీపికా పడుకోన్ నటిస్తున్నది. కీలకమైన అతిథి పాత్రలో మృణాల్ ఠాకూర్ కనిపించనుందని ప్రచారం జరుగుతున్నది. ఈ భామ ఇప్పటికే షూటింగ్‌లో కూడా పాల్గొంటున్నదని వార్తలొచ్చాయి. వీటిపై తాజా ఇంటర్వ్యూలో స్పందించింది మృణాల్ ఠాకూర్. అల్లు అర్జున్-అట్లీ ఈ సినిమాలో మీ పాత్ర ఎలా ఉండబోతున్నది? అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు మృణాల్ బదులిచ్చింది. 'నిజంగా నేను ఆ సినిమాలో నటిస్తున్నానా? అలాంటి అద్భుతం జరగాలని మీరు ప్రార్థించండి. ఒకవేళ ఈ వార్త నిజమైతే మనందరం సెలబ్రేట్ చేసుకుందాం' అంటూ కాస్త వ్యంగ్యంగా సమాధానమిచ్చింది. దీంతో ఈ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్‌లో మృణాల్ ఠాకూర్ ఇంకా ఖరారు కాలేదని, ఇప్పటివరకు వచ్చిన వార్తలన్నీ పుకార్లేనని తేలిపోయింది. అయితే రెండో నాయిక పాత్ర కోసం జాన్వీకపూర్‌తో పాటు మృణాల్ పేరును చిత్ర బృందం పరిశీలిస్తున్నదని ఫిల్మ్‌నగర్ టాక్.



# హీరో అంటే కేవలం హీరోయిజమే కాదు: ఆనంద్ దేవరకొండ

"నటీనటులకు తొలి సినిమా ఎంత ముఖ్యమో నాకు తెలుసు. అలాగే యూనిట్ కష్టం కూడా తెలుసు. అందుకే 'శ్రీ చిదంబరంగారు' ఈవెంట్‌కి వచ్చాను. ఈ మూవీ టీజర్ ఎంతో నచ్చింది. హీరో అంటే కేవలం హీరోయిజమే కాదు. జనాలకు నమ్మకం కూడా ఇవ్వాలి. ఈ సినిమా ఇంటెన్షన్ అదే. ఈ మూవీలో హీరో పాత్ర చేయడం చాలా కష్టం. కానీ, వంశీని చూశాక ఎంతో కన్విన్సింగ్‌గా అనిపించింది. ఇలాంటి సినిమాలను మన ప్రేక్షకులు ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అని హీరో ఆనంద్ దేవరకొండ తెలిపారు. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన చిత్రం 'శ్రీ చిదంబరంగారు'. వినయ్ రత్నం దర్శకత్వం వహించారు. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా వినీషా రెడ్డి, చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించిన ఈ మూవీని వంశీ నంది పాటి నేడు విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి, ఆనంద్ దేవరకొండ, నిర్మాత, నటి నిహారిక కొణిదెల అతిథులుగా హాజరై, 'శ్రీ చిదంబరం గారు' సక్సెస్ అవ్వాలని ఆకాంక్షించారు. వంశీ నంది పాటి మాట్లాడుతూ "ఇన్‌సెక్యూరిటీని దాటి జీవితంలో ఎలా ఎదగాలి అనేది ఈ చిత్రకథ. అన్నీ కోల్పోయాం అనుకునేవాళ్లకు స్ఫూర్తి, ధైర్యం నింపే సినిమా ఇది" అని చెప్పారు. "హీరో కావాలనే నా కల 'శ్రీ చిదంబరంగారు'తో నెరవేరింది" అన్నారు వంశీ తుమ్మల.



నినాదం
నిఖార్సైన జర్నలిజం

# టాస్ గెలిచిన యంగ్ ఇండియా..

## అందరి చూపు ఐపీఎల్ సెన్సేషన్ పైనే..?

**హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఇప్పటివరకు భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన 56 యూత్ వన్డేల్లో భారత జట్టు ఆధిపత్యం చెలాయించింది. టీం ఇండియా 41 గెలవగా, ఇంగ్లాండ్ 13 మాత్రమే గెలిచింది. ఒక మ్యాచ్ టై కాగా, ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది.**




ఐదుసార్లు ఛాంపియన్లుగా నిలిచిన భారత్ నేడు అండర్-19 ప్రపంచ కప్ ఫైనల్లో ఇంగ్లాండ్‌తో తలపడుతోంది. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. భారత జట్టు రికార్డు స్థాయిలో 10వ సారి ఫైనల్‌కు చేరుకుంది. మరోవైపు 1998లో తమ ఏకైక టైటిల్‌ను గెలుచుకున్న ఇంగ్లాండ్ మూడోసారి ఫైనల్‌కు చేరుకోనుంది. గతంలో, 2022 ఫైనల్‌లో భారత్ ఇంగ్లాండ్ జట్టును ఓడించి ఐదవసారి ట్రోఫీని గెలుచుకుంది.

ఇప్పటివరకు భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన 56 యూత్ వన్డేల్లో భారత జట్టు ఆధిపత్యం చెలాయించింది. టీం ఇండియా 41 గెలవగా, ఇంగ్లాండ్ 13 మాత్రమే గెలిచింది. ఒక మ్యాచ్ టై కాగా, ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది.

హరారే పిచ్ బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. బౌలర్లకు కొంత మద్దతును అందిస్తుంది. ఈ పిచ్ మంచి బౌన్స్, పేస్‌ను అందిస్తుంది. షాట్లు ఆడటం సులభం చేస్తుంది. స్క్వేర్, స్ట్రెయిట్ బౌండరీలు తక్కువగా ఉంటాయి. ఫోర్లు, సిక్సర్లను కొట్టడం ఈజీ అవ్వనుంది. రెండవ సెమీ-ఫైనల్‌లో భారత్ -- ఆఫ్ఘనిస్తాన్ మ్యాచ్‌లో రెండు జట్లు కలిపి మొత్తం 621 పరుగులు సాధించడం గమనార్హం.

ఇంగ్లాండ్ ఖ19 (ప్లేయింగ్ ॐ×): బెన్ డాకిన్స్, జోసెఫ్ మూర్స్, బెన్ మేయస్, థామస్ రెవ్ (కెప్టెన్, కీపర్), కాలేబ్ ఫాల్కనర్, రాల్ఫీ ఆల్బర్ట్, ఫర్హాన్ అహ్మద్, సెబాస్టియన్ మోర్గాన్, జేమ్స్ మింటో, మానీ లమ్స్‌డెన్, అలెక్స్ గ్రీన్.

ఇండియా ఖ19 (ప్లేయింగ్ ॐ×): ఆరోన్ జార్జ్, వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రే(కెప్టెన్), విహాన్ మల్హోత్రా, వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు(కీపర్), ఆా అంబరీష్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ పటేల్, హెనిల్ పటేల్, దీపేష్ దేవేంద్రన్.

# ఆర్సీబీ వండర్ ఫుల్ విక్టరీ.. కట్‌చేస్తే..

## మరపురాని మెసేజ్ పంపిన కోహ్లీ, అనుష్క.. ఏమన్నారంటే..?

ఆర్సీబీ వరుసగా రెండో డబ్ల్యూపీఎల్ ట్రోఫీతో హిస్టరీ క్రియేట్ చేసింది. ఈ అద్భుత విజయంతో విరాట్ కోహ్లీ, అనుష్క శర్మలు ప్రశంసల వర్షం కురిపించారు. ఢిల్లీ క్యాపిటల్స్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండో మహిళా ప్రీమియర్ లీగ్ టైటిల్‌ను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే.

ఢిల్లీ క్యాపిటల్స్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించి, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ రెండవ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో ఐపీఎల్, డబ్ల్యూపీఎల్ ట్రోఫీలను ఒకేసారి గెలుచుకున్న చరిత్రలో మొట్టమొదటి ఫ్రాంచైజీగా ఆర్సీబీ రికార్డు పుస్తకాలలో తన పేరును లిఖించుకుంది. ఆర్సీబీ తమ రెండవ డబ్ల్యూపీఎల్ ట్రోఫీని గెలుచుకున్న సందర్భంలో విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ మరపురాని క్షణాలను పంచుకుంటూ ఉమెన్స్ టీంకు శుభాకాంక్షలు అందించారు. వడోదరలో చివరి బౌండరీ కొట్టిన వెంటనే, విరాట్ కోహ్లీ సోషల్ మీడియాలో జట్టును అభినందిస్తూ.. బెంగళూరు పతాకాన్ని రెపరెపలాడించారు. అలాగే రెండుసార్లు ట్రోఫీని తెచ్చిపెట్టి ఫ్యాన్స్ కు అద్భుతమైన గిఫ్ట్ ఇచ్చారంటూ చెప్పుకొచ్చాడు.




"మళ్ళీ ఛాంపియన్స్. ఆర్సీబీ జెండాను ఎగురవేసినందుకు ధన్యవాదాలు. స్మృతి, మీ మొత్తం జట్టుతోపాటు బృందానికి, ఈ అద్భుతమైన విజయానికి అభినందనలు. మీరు దీనికి నిస్సందేహంగా అర్హులు. ఈ క్షణాన్ని ఆస్వాదించండి, మా అద్భుతమైన అభిమానుల ప్రేమను స్వీకరించండి" అని కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు.

బాలీవుడ్ ఐకాన్ అనుష్క శర్మ కూడా తన సంతోషాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. మహిళా జట్టు విజయాన్ని అభినందించారు. ట్రోఫీని ఎత్తుకున్న జట్టు ఫొటోను షేర్ చేస్తూ, "ఆర్సీబీ మహిళలు మళ్ళీ చేసి చూపించారు. హిస్టరీ రిపీట్" అంటూ రాసుకొచ్చారు.

# టీ20 ప్రపంచకప్ హిస్టరీలో ఎప్పటికీ బద్దలవ్వని 3 రికార్డులు..

## లిస్ట్‌లో టీమిండియా ప్లేయర్ కూడా..?

**ఫిబ్రవరి 7 నుంచి 2026 టీ20 ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. దీంతో ప్రస్తుతం అందరి దృష్టి ఈ ఐసీసీ మెగా టోర్నమెంట్ పై నిలిచింది. ఈ క్రమంలో టీ20 ప్రపంచకప్ హిస్టరీని గుర్తుచేసుకుంటున్నారు. ఇందులో ముఖ్యంగా రికార్డుల గురించి మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో పంచుకున్నారు. వాటిలో కొన్ని రికార్డులు అయితే ఎప్పటికీ చెక్కుచెదరకుండా ఉంటాయని చెబుతున్నారు. ఈ పోట్టి ఫార్మాట్ లో ఒక్క ఇన్నింగ్స్, ఒక చిన్న స్పెల్, లేదా కేవలం ఒకే ఒక్క ఓవర్ కూడా రికార్డు పుస్తకాలను శాశ్వతంగా మార్చేయగలవనే సంగతి తెలిసిందే. ఈ క్రమంలో టీ20ఐ ప్రపంచకప్ హిస్టరీలో ఎప్పటికీ బద్దలవ్వని రికార్డులను ఓసారి చూద్దాం..**




తొలి ఐసీసీ టీ20ఐ ప్రపంచకప్ 2007లో జరిగింది. ఈ సమయంలో శ్రీలంక జట్టు కెన్యాపై 172 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. టీ20 చరిత్రలోనే అత్యంత ఏకపక్ష విజయాన్ని నమోదు చేసి. సరికొత్త రికార్డ్ క్రియోట్ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టు 6 వికెట్ల నష్టానికి 260 పరుగులు చేసింది. ఈమ్యాచ్ లో సనత్ జయసూర్య 44 బంతుల్లో 88 పరుగులతో విశ్వరూపం చూపించగా, మహేల జయవర్ధనే కేవలం 27 బంతుల్లో 65 పరుగులు సాధించాడు. చివర్లో జెహాన్ ముబారక్ 13 బంతుల్లోనే 46 పరుగులు చేసి స్కోరును మరింత పెంచాడు. అనంతరం లక్ష్య ఛేదనలో కెన్యా జట్టు శ్రీలంక బౌలర్ల ధాటికి తట్టుకోలేక 88 పరుగులకే కుప్పకూలింది. చమిందా వాస్, లసిత్ మలింగ, తిలకరత్నే దిల్షాన్ తలో రెండు వికెట్లు తీశారు.

ఈ రికార్డును తిరగరాయడం దాదాపు అసాధ్యం అనడానికి ప్రధాన కారణం ఆనాటి పరిస్థితులు. అప్పట్లో అగ్రశ్రేణి జట్లకు, అసోసియేట్ జట్లకు మధ్య చాలా వ్యత్యాసం ఉండేది. కానీ, నేడు అసోసియేట్ జట్లు ఎక్కువ అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతూ, మెరుగైన శిక్షణతో వ్యూహాత్మకంగా చాలా బలంగా తయారయ్యాయి.

ఇక మరో రికార్డ్ గురించి చెప్పాలంటే అదే సంవత్సరం అంటే 2007లో జరిగిన టీ20ఐ ప్రపంచకప్ లెక్కలు మరోసారి చూడాల్సిందే. ఈ రికార్డ్ క్రియో చేసింది ఎవరో కాదు, టీమిండియా స్టైలిష్ ప్లేయర్ యువరాజ్ సింగ్. దర్బన్ వేదికగా టీ20 ప్రపంచకప్ హిస్టరీలో భారీ రికార్డ్ నమోదు చేశాడు. క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే స్పష్టమైన ఉద్దేశంతో ఆడిన యువరాజ్, కేవలం 12 బంతుల్లోనే తన అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. దాదాపు రెండు దశాబ్దాలు గడుస్తున్నా ఈ రికార్డు నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. స్టువర్ట్ బ్రాడ్ వేసిన ఒకే ఓవర్‌లో వరుసగా 6 సిక్సర్లు బాదడం ఈ ఇన్నింగ్స్‌ను క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిపివేసింది.

యువరాజ్ కేవలం 16 బంతుల్లో 7 సిక్సర్లతో 58 పరుగులు చేయడంతో భారత్ 4 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్‌కు ముందు యువరాజ్, ఆండ్రూ ఫ్లింటాఫ్ మధ్య జరిగిన మాటల యుద్ధం ఈ మ్యాచ్‌కు మరింత హీట్ తెచ్చిపెట్టింది. గౌతమ్ గంభీర్, వీరేంద్ర సెహ్వాగ్ అందించిన శుభారంభంతో భారత్ చివరకు 18 పరుగుల తేడాతో విజయం సాధించింది. కేవలం 12 బంతుల్లో 50 పరుగులు చేయాలంటే అద్భుతమైన హిట్టింగ్ ఉంటే సరిపోదు, బౌలర్ల వ్యూహం కూడా పూర్తిగా అర్థం చేసుకోవాలి.

టీ20 క్రికెట్ అంటేనే పరుగుల వరద, భారీ సిక్సర్లు అని అందరూ అనుకుంటారు. కానీ, వీటికి భిన్నంగా న్యూజిలాండ్ పేసర్ లాకీ ఫెర్గూసన్ 2024 టీ20 ప్రపంచ కప్‌లో పపువా న్యూ గినియాతో జరిగిన మ్యాచ్‌లో ఒక అసాధ్యమైన రికార్డును నెలకొల్పాడు. తన కోటాలోని 4 ఓవర్లను వరుసగా మెయిడిన్లుగా వేసి, 4-4-0-3 ఆశ్చర్యపరిచాడు. అలాగే అసద్ వాలా, చార్లెస్ అమినీ, చాద్ సోపర్ల వికెట్లను పడగొట్టిన ఫెర్గూసన్, ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా మ్యాచ్ ముగించాడు. 2021లో పనామాపై కెనడా బౌలర్ సాద్ బిన్ జఫర్ (4-4-0-2) నెలకొల్పిన రికార్డును ఫెర్గూసన్ ఈ ప్రదర్శనతో అధిగమించాడు. టీ20 ప్రపంచ కప్ చరిత్రలో ఇలా నాలుగు ఓవర్లు వేసి ఒక్క పరుగు కూడా ఇవ్వని తొలి బౌలర్‌గా అతను చరిత్ర సృష్టించాడు.

# అందరి చూపు ఈ ఐదుగురిపైనే..

## పిల్లబచ్చా టీంలో ఉన్నారని లైట్ తీసుకుంటే, తాట తీస్తారంతే..!




**ఈసారి వరల్డ్ కప్‌లో జట్ల సంఖ్య భారీగా పెరిగింది. ఏకంగా 20 జట్లు టీ20 ప్రపంచకప్ 2026 బరిలో నిలిచాయి. అలాగే, తొలిసారి అడుగుపెడుతున్న ఇటలీతో పాటు అమెరికా, నెదర్లాండ్స్, స్కాట్లాండ్ వంటి అసోసియేట్ దేశాలు కూడా సత్తా చాటేందుకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ఈ జట్లు ఐసీసీ ఈవెంట్లలో దిగ్గజ జట్లకు షాక్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచాయి. ఈ క్రమంలో అసోసియేట్ దేశాల నుంచి బరిలోకి దిగనున్న ఈ ఐదురుగు ప్లేయర్లను తక్కువ అంచనా వేస్తే కచ్చితంగా తగిన శాస్తి చేస్తారంతే. ఈ లిస్ట్ లో ఎవరున్నారో ఓసారి చూద్దాం..**

### 1. ఆండ్రీస్ గౌస్:

అమెరికా జట్టుకు ప్రధాన బలంగా ఆ జట్టు ఓపెనింగ్ బ్యాటర్ ఆండ్రీస్ గౌస్ నిలవనున్నాడు. దక్షిణాఫ్రికాలో తన క్రికెట్ ప్రయాణాన్ని మొదలుపెట్టిన గౌస్.. 2021లో అమెరికాకు మకాం మార్చాడు. 2024 వరల్డ్ కప్‌లో గౌస్ అద్భుతంగా రాణించాడు. ముఖ్యంగా తన సొంత దేశమైన దక్షిణాఫ్రికాపై ఆయన చేసిన 80 (నాటౌట్) పరుగులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇప్పటివరకు అమెరికా తరఫున 25 టీ20ల్లో 751 పరుగులు చేసిన గౌస్, 145కుపైగా స్ట్రైక్ రేట్‌తో డేంజరస్ ప్లేయర్ గా గుర్తింపు పొందాడు.

### 2. వేన్ మాడ్సెన్ (ఇటలీ):

తొలిసారి వరల్డ్ కప్‌లో అడుగుపెడుతున్న ఇటలీ జట్టుకు వేన్ మాడ్సెన్ నాయకత్వం వహించనున్నాడు. విశేషమేమిటంటే, మాడ్సెన్ గతంలో దక్షిణాఫ్రికా తరఫున హాకీ ప్లేయర్‌గా 2006 కామన్వెల్త్ గేమ్స్, వరల్డ్ కప్‌లో ఆడాడు. ఆ తర్వాత క్రికెట్‌లోకి మారి ఇంగ్లాండ్ కౌంటీ క్రికెట్‌లో డెర్బీషైర్ తరఫున 20,000 పైగా పరుగులు సాధించాడు. 41 ఏళ్ల వయసులో కూడా తన అపారమైన అనుభవంతో ఇటలీ జట్టును ముందుకు నడిపించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నాడు.

### 3. ముహమ్మద్ వసీం :

2024 టోర్నీకి దూరమైన యూఏఈ, ఈసారి కెప్టెన్, స్టార్ బ్యాటర్ ముహమ్మద్ వసీంపై ఆశలు పెట్టుకుంది. వసీం అత్యంత దూకుడుగా ఆడే వికెట్ కీపర్ బ్యాటర్. ఐర్లాండ్‌పై కేవలం 62 బంతుల్లో 107 పరుగులు చేసి ప్రపంచానికి తన పవర్ ఏంటో చూపించాడు. ఇప్పటివరకు 91 మ్యాచ్‌ల్లో 3,184 పరుగులు చేసిన వసీం, 151కి పైగా స్ట్రైక్ రేట్‌తో పరుగులు సాధిస్తున్నాడు. ఇటీవలి ILT20 లీగ్‌లో కూడా రెండో అత్యధిక రన్ స్కోరర్‌గా నిలిచి ఫామ్ చాటుకున్నాడు.

### 4. రోలోఫ్ వాన్ డెర్ మెర్వే (నెదర్లాండ్స్):

41 ఏళ్ల ఈ వెటరన్ ఆల్ రౌండర్‌కు ఇది ఏడో వరల్డ్ కప్. గతంలో దక్షిణాఫ్రికా తరఫున ఆడిన మెర్వే, ఆ తర్వాత నెదర్లాండ్స్‌కు మారి కీలక ఆటగాడిగా ఎదిగారు. ఐపీఎల్ (ఆర్సీబీ, ఢిల్లీ క్యాపిటల్స్) వంటి ఎన్నో అంతర్జాతీయ లీగ్‌లలో ఆడిన అనుభవం ఆయనకు ఉంది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ మెరుపులు మెరిపించగల సామర్థ్యం మెర్వే సొంతం. నెదర్లాండ్స్ తరఫున ఆడిన 80 మ్యాచ్‌ల్లో 88 వికెట్లు తీసి తన విలువను చాటుకున్నాడు.

### 5. దీపేంద్ర సింగ్ ఐరీ (నేపాల్):

నేపాల్ క్రికెట్ చరిత్రలో రికార్డుల రారాజు దీపేంద్ర సింగ్ ఐరీ. ఈ ఆల్ రౌండర్ 2022 ఆసియా క్రీడల్లో మంగోలియాపై కేవలం 9 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసి టీ20 చరిత్రలో అత్యంత ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. అంతేకాదు, యువరాజ్ సింగ్, పొలార్డ్ తర్వాత ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు బాదిన మూడో ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. నేపాల్ తరఫున అత్యధిక టీ20 పరుగులు (1,956), ఐదో అత్యధిక వికెట్లు తీసిన ప్లేయర్‌గా ఈ 2026 వరల్డ్ కప్‌లో నేపాల్‌కు ఆశాకిరణంగా మారాడు.

# రాసిపెట్టుకోండి..

## మనకు కప్పు తెచ్చేది ఆ ఇద్దరు మొనగాళ్లే..

## తేల్చేసిన మాజీ దిగ్గజం

**2026 ఐసీసీ టీ20 ప్రపంచ కప్ నకు ముందు టీమిండియా దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ ఓ కీలక విషయాన్ని వెల్లడించారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టీ20ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత భారత జట్టులో వీరి స్థానాలను ఎవరు భర్తీ చేయనున్నారో ఓసారి చూద్దాం..**




ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026 ఫిబ్రవరి 7 నుంచి మొదలుకానుంది. ఇందులో భాగంగా తొలి మ్యాచ్‌లో అమెరికాతో భారత్ తలపడేందుకు సన్నద్ధమైంది. ఈ మెగా టోర్నీ కోసం భారత జట్టుతో సహా అన్ని దేశాలు తమ సన్నాహాలలో బిజీగా మారిపోయాయి. ఇప్పటికే రెండుసార్లు ట్రోఫిని ముద్దాడిన భారత జట్టు మూడోసారి ట్రోఫీని దక్కించుకునేందుకు ఫుల్‌గా ప్రిపేర్ అయింది. గత ప్రపంచకప్ లో ఆడిన రోహిత్, కోహ్లీలు ఈ ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సునీల్ గవాస్కర్ ఈ ప్రపంచ కప్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ స్థానంలో ఓఇద్దరు ఆటగాళ్లను చేర్చారు. గవాస్కర్ ప్రకటించిన లిస్ట్ లో ఎవరున్నారో ఓసారి చూద్దాం..

### సునీల్ గవాస్కర్ ఏమన్నారంటే..?

2024 ఐసీసీ టీ20 ప్రపంచ కప్ తర్వాత, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టీ20 అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఇద్దరు దిగ్గజాలకు ప్రత్యామ్నాయంగా చాలామందిని అనుకున్నారు. కానీ తాజాగా ఈ ఇద్దరు ఆటగాళ్ళు టీమిండియాలో రోహిత్, కోహ్లీ స్థానంలో శాశ్వతంగా స్థిరపడ్డారు.

ఈ క్రమంలో సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ.. ఇలాంటి ఆటగాళ్లను భర్తీ చేయడం అంత సులభం కాదు. వీరికి ప్రత్యామ్యాయలను పరిశీలిస్తే, రోహిత్ శర్మ స్థానంలో అభిషేక్ శర్మ, విరాట్ కోహ్లీ స్థానంలో ఇషాన్ కిషన్ సరిగ్గా సెట్ అవుతారు. రవీంద్ర జడేజా స్థానంలో అక్షర్ పటేల్ వచ్చాడు. ఈ ఆటగాళ్ళు భిన్నంగా ఉండవచ్చు, కానీ వారి ప్రదర్శన ఆధారంగా, ఈ దిగ్గజాలకు బెస్ట్ ప్రత్యామ్నాయాలుగా నిరూపితమయ్యారు. మన అభిమానులు ఖచ్చితంగా ఆ ముగ్గురు గొప్ప ఆటగాళ్లను మిస్ అవుతారు. కానీ వారిని ఈ ముగ్గురిలో చూస్తే మిస్ అవుతారని నేను అనుకోను' అంటూ చెప్పుకొచ్చాడు.

### రోహిత్, విరాట్ లేకపోయినా టీ20ల్లో టీమిండియా నంబర్ వన్ స్థానంలోనే..

2024 టీ20 ప్రపంచ కప్ గెలిచిన తర్వాత విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టీ20 ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడం గమనార్హం. రవీంద్ర జడేజా కూడా టీ20 అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు. అయితే, ఈ ముగ్గురు అనుభవజ్ఞులు లేకపోయినా, టీమిండియా ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానంలో ఉంది. 2026లో వరుసగా రెండో టైటిల్‌ను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఫిబ్రవరి 7న జరిగే తొలి మ్యాచ్‌లో టీమిండియా అమెరికాతో తలపడనుంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787